RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS
We undertake Printing of Daily News Papers



హైదరాబాద్ | 22 మే 2026 శుక్రవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:298

## కార్మికుల కనీస వేతనాల పెంపు

## జూన్ 1 నుంచి పెంచిన వేతనాలు అమల్లోకి



హైద్రాబాద్ మే 21 :రాష్ట్రంలో కార్మికులకు సీఎం రేవంత్ రెడ్డి గుడ్ ?న్యూస్ చెప్పారు. కార్మికుల కనీస వేతనాల పెంపునకు సంబంధించి మంత్రివర్గ ఉపసంఘం నివేదిక మేరకు తీసుకున్న నిర్ణయాలను రేవంత్ రెడ్డి మీడియాకు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల 1.11 కోట్ల మంది కార్మికులకు మేలు జరుగుతుందని ఆయన వెల్లడించారు. జూన్? 1 నుంచి పెంచిన వేతనాలు అమల్లోకి రానున్నాయి. రాష్ట్రాన్ని ప్రభుత్వం మూడు జోన్లుగా విభజించింది.

కార్మికుల వేతనాల పెంపు ఇలా :

బీఆర్ఎస్? ప్రభుత్వ హయాంలో కార్మికుల కనీస వేతనాలు నిర్ణయించకపోవడం వల్ల 1.11 కోట్ల మంది కార్మికులు నష్టపోయారని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. కనీస వేతన పెంపుపై ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం అన్ని వర్గాలతో సంప్రదింపులు జరిపి పలు కీలక సిఫార్సులు చేసిందని వివరించారు. కార్మికులు సంతృప్తిగా ఉన్నప్పుడే ఉత్పత్తి బాగుంటుందన్నారు. అన్?స్కిల్, సెమీ స్కిల్, హైస్కిల్ కేటగిరీలుగా విభజించిందన్నారు. కార్మికుల వేతనాలు నిర్ణయించేందుకు గాను జోన్లను 3 జోన్లుగా విభజించామని తెలిపారు.

జోన్?-1లో మున్సిపల్ కార్పొరేషన్లు. జోన్?-2 మున్సిపాల్టీలు. జోన్?-3 కింద గ్రామీణ ప్రాంతాలు ఉంటాయని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. జోన్?-1లో అన్?స్కిల్డ్? కార్మికుల వేతనంను రూ.12,750 నుంచి రూ.16వేలకు, సెమీ స్కిల్డ్? కార్మికుల వేతనం రూ. 13,592 నుంచి రూ.17వేలకు, స్కిల్డ్? కార్మికుల వేతనం రూ.రూ.13,772 నుంచి రూ.18,500కి, హై స్కిల్డ్? కార్మికులకు సంబంధించి రూ.14,607 నుంచి రూ.20 వేలకు పెంచామని వెల్లడించారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం జూన్? నెల ఒకటో తేదీ నుంచి అమల్లోకి వస్తుందని చెప్పారు.

## దేశానికి దిశ, దశ చూపించిన గొప్ప నాయకుడు

## రాజీవ్ గాంధీకి సీఎం రేవంత్ నివాళులు



హైదరాబాద్ మాజీ ప్రధానమంత్రి, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ గారి స్ఫూర్తితో తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు.

రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం ఎదురుగా ఉన్న ఆ మహానేత విగ్రహానికి ముఖ్యమంత్రి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశానికి రాజీవ్ గాంధీ చేసిన సేవలను స్మరించుకున్నారు. 21వ శతాబ్దంలో దేశాన్ని కంప్యూటర్ యుగం వైపు నడిపించి ఒక దశ, దిశ చూపించిన గొప్ప నాయకుడు రాజీవ్ గాంధీ అని గుర్తుచేశారు. సాంకేతిక యుగం వైపు దేశ యువతను సన్నద్ధం చేసిన నాయకుడని కొనియాడారు. మహాత్మగాంధీ, ఇందిరాగాంధీ లాంటి మహానాయకుల స్ఫూర్తితో పనిచేస్తూ రాజీవ్ గాంధీ గారు దేశ సమగ్రత కోసం ప్రాణాలర్పించారని అన్నారు. టెలికాం, కంప్యూటర్ లాంటి ఆధునిక సాంకేతిక విప్లవం తేవడమే కాకుండా పరిపాలనలో మహిళలను భాగస్వామ్యం చేసినప్పుడే దేశం పురోభివృద్ధి సాధిస్తుందని భావించి స్థానిక సంస్థల్లో మహిళా రిజర్వేషన్లు కల్పించారని పేర్కొన్నారు. లోక్సభ, శాసనసభల్లో మహిళా రిజర్వేషన్లకు సంబంధించి ఎలాంటి చిక్కుముడులు లేకుండా పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించి మరోసారి బిల్లును ప్రవేశపెట్టాలని ప్రధానమంత్రి ని కోరారు.

తెలంగాణతో ఇందిరాగాంధీ కుటుంబానికి గొప్ప అనుబంధం ఉందని, ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు చేయడంలో సోనియా గాంధీ సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, సలహాదారు వి హనుమంతరావు తో పాటు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## దేశంలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ ఎలాంటి కొరత లేదు: చమురు సంస్థలు



న్యూ డిల్లి మే 21:పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు సరఫరాలపై ఆందోళనలు వ్యక్తమవుతున్న వేళ దేశంలో పెట్రోల్, డీజిల్, ఎల్?పీజీ ఎలాంటి కొరత లేదని చమురు మార్కెటింగ్ సంస్థలు (ఓఎంసీలు) స్పష్టం చేశాయి. రష్యా నుంచి భారత్కు వస్తున్న ముడి చమురు సరఫరాలో ఎటువంటి తగ్గుదల లేదని ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల వర్గాలు గురువారం వెల్లడించాయి. ఇక దేశంలో పెట్రోలియం ఉత్పత్తుల నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని తెలిపాయి. భారత్ ప్రస్తుతం పెట్రోలియం ఉత్పత్తుల విషయంలో నికర ఎగుమతిదారుగా కొనసాగుతోందని పేర్కొన్నాయి.

## కేబీఆర్ పార్క్ను కాపాడాలి -- పర్యావరణ పరిరక్షణలో బీఆర్ఎస్ అండగా ఉంటుంది : కేటీఆర్

### ఈరోజు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావును కలిసిన కేబీఆర్ పార్క్ రోడ్ విస్తరణ ప్రభావిత యజమానుల ఫోరం ప్రతినిధులు

హైదరాబాద్21 మే 2026కేబీఆర్ పార్క్ రోడ్ విస్తరణ ప్రభావిత యజమానుల ఫోరం ప్రతినిధులు ఈరోజు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావును కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో కేబీఆర్ పార్క్ చుట్టూ భారీగా చెట్లను నరికివేసే ప్రయత్నాలను వ్యతికించాలని, హైదరాబాద్ నగరానికి ఊపిరితిత్తుల్లాంటి కేబీఆర్ పార్క్ను కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా ప్రతినిధుల విన్నపాన్ని విన్న కేటీఆర్ మాట్లాడుతూ, కేబీఆర్ పార్క్ హైదరాబాద్ నగరానికి అత్యంత విలువైన “లంగ్స్ స్పేస్” అని పేర్కొన్నారు. వేగంగా విస్తరిస్తున్న మహానగరంలో పర్యావరణ సమతౌల్యాన్ని కాపాడటంలో కేబీఆర్ పార్క్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఇలాంటి పచ్చదనాన్ని నాశనం చేసే ఏ చర్యనైనా ప్రజాస్వామ్యబద్ధంగా, చట్టబద్ధంగా అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేబీఆర్ పార్క్ ఉనికి, చెట్లకు ఏ మాత్రం ఇబ్బంది కలగకుండా అండర్గ్రౌండ్ ప్రతిపాదికన ప్రత్యామ్నాయ ప్రణాళికలు సిద్ధం చేశామని కేటీఆర్ తెలిపారు. ఆ ప్రణాళికలు ఇప్పటికీ మున్సిపల్ శాఖ వద్ద అందుబాటులో ఉన్నాయని గుర్తుచేశారు. అభివృద్ధి పేరుతో పర్యావరణాన్ని ధ్వంసం చేయడం సరైన విధానం కాదని, సాంకేతిక పరిజ్ఞానం మరియు సమగ్ర ప్రణాళికలతో అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ రెండింటినీ సమన్వయం చేయవచ్చని పేర్కొన్నారు.

కేబీఆర్ పార్క్ చుట్టూ చెట్ల నరికివేతకు వ్యతిరేకంగా ప్రజలు వ్యక్తం చేస్తున్న ఆందోళనను ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాల్సి అవసరం ఉందని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఈ అంశంలో బీఆర్ఎస్ పార్టీ ప్రజల తరఫున అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. హైదరాబాద్ భవిష్యత్తు తరాలకు పచ్చని వారసత్వాన్ని అందించాలంటే కేబీఆర్ పార్క్ వంటి పర్యావరణ సంపదలను కాపాడుకోవడం అత్యవసరమని కేటీఆర్ స్పష్టం చేశారు.

## వైభవంగా సరస్వతి అంత్య పుష్కరాలు ప్రారంభం





భూపాలపల్లి సరస్వతి అంత్య పుష్కరాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. పుష్కరాల తొలి రోజు గురువారం ఉదయం 5.43 గంటలకు పవిత్ర సంగంలో తొలి పుష్కర స్నానం నిర్వహించారు. ఈ పుణ్యస్నానాన్ని కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వాములు, ఐటి పరిశ్రమలు శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దంపతులు, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ధార్మిక సలహాదారు గోవింద హరి తదితరులు ఆచరించారు. అలాగే భూపాలపల్లి, రంగారెడ్డి నియోజకవర్గాల శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, మల్ రెడ్డి రంగారెడ్డి పుష్కర స్నానంలో పాల్గొన్నారు. పుష్కరాల సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు తరలి వచ్చి పవిత్ర స్నానాలు ఆచరిస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేపట్టింది. భద్రత, పారిశుధ్యం, తాగునీరు, వైద్య సేవలు, రవాణా వంటి అన్ని సదుపాయాలు ఏర్పాటు చేశారు. ఈ పుణ్యకాలంలో భక్తులు సౌకర్యవంతంగా, సురక్షితంగా పుష్కర స్నానాలు నిర్వహించుకునేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు

## ఆధునిక భారత నిర్మాత స్వర్గీయ రాజీవ్ గాంధీ

## టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి





సంగారెడ్డి మే 21 :భారత మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా సంగారెడ్డి పట్టణంలో కాంగ్రెస్ నాయకులు గురువారం ఘనంగా నివాళులు అర్పించారు.

టీజీఐఐసీ చైర్పర్సన్ నిర్మల జగ్గారెడ్డి పట్టణంలోని రాజీవ్ పార్కులో రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై రాజీవ్ గాంధీ సేవలను స్మరించుకున్నారు.

ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ రాజీవ్ గాంధీ దేశ అభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. ఆధునిక భారత నిర్మాణంలో ఆయన కీలక పాత్ర పోషించారని, యువతకు అవకాశాలు కల్పించడంలో, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ , సాంకేతిక రంగ అభివృద్ధికి పునాది వేయడంలో రాజీవ్ గాంధీ చేసిన. కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. దేశ ఐక్యత, సామాజిక సమానత్వం కోసం ఆయన చేసిన సేవలు. తరతరాలకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు.

అనంతరం సంగారెడ్డి ప్రభుత్వ మాతా శిశు ఆసుపత్రి లో నిర్మలా జగ్గారెడ్డి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, ధైర్యం చెప్పారు.

ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత కిషన్, సంగారెడ్డి మున్సిపల్ చైర్పర్సన్ కూన వనిత సంతోష్, సి డి సి చైర్మన్ గడిలా రామ్ రెడ్డి,సంగారెడ్డి పట్టణ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, కూన సంతోష్, ప్రభు గౌడ్ , కౌన్సిలర్లు తోపాజి వీణ హరీష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, మహిళా నాయకులు, యువజన విభాగ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

**సమగ్ర విద్యాబోధనతో రాష్ట్రంలో అగ్రగామిగా ఎంజేపీ గురుకులాలు**

వార్తా 2 లో

# ప్రజాబలం

22 మే 2026 శుక్రవారం


## మోదీ పొదుపు పాఠాల చర్యలు

ఎంత అభివృద్ధి చెందిన దేశం అయిన 'వనరుల స్వావలంబన', 'ఆర్థిక స్థిరత్వం' లేకపోతే ఆ దేశం అభివృద్ధి కేవలం నీటి మీద బుడగలాంటిదే. ఇప్పుడు ఇదే సూత్రం మన దేశానికీ కూడా వరిస్తుంది. ఇటీవల మన దేశ ప్రధాని 9 రకాల అంశాల పొదుపుపై చేసిన ప్రసంగంతో దేశం యావత్ ఒక్కసారిగా ఉలిక్కిపడ్డది. గత ఆదివారం సాయంత్రం ప్రధాని హైదరాబాద్‌లో ఈ ప్రకటన చేయగానే సోమవారం ఉదయం స్టాక్ మార్కెట్ సూచీలు బెంబేలెత్తాయి. ఇప్పటికీ స్టాక్ మార్కెట్‌ల ఒడిదుడుకులు కొనసాగుతున్నాయి. స్వయాన ప్రధానమంత్రి దేశ ప్రజలకు పొదుపు పాఠాలు చెప్పడం, దేశ ప్రజలను అప్రమత్తం చేయడం చూస్తే 'వనరుల స్వావలంబన' 'ఆర్థిక క్రమశిక్షణ' లేకపోతే మునుముందు ఆర్థిక సంక్షోభం తప్పదా? అనే అనుమానాలు కలుగక మానదు. అయితే, ప్రధాని ప్రకటనలను కొంతమంది వ్యతిరేక దృక్పథంతో చూస్తే, మరికొందరు సానుకూల దృక్పథంతో చూస్తున్నారు. వాస్తవానికి ప్రధాని చేసిన ప్రకటనలను పాజిటివ్ దృక్పథంతో చూడాలి. ఎందుకంటే, ప్రధాని పేర్కొన్న 9 అంశాలు మామూలు అంశాలు కాదు. దేశ గమనం వీటిమీదనే ఆధారపడి ఉన్నది. వాటిలో బంగారం కొనుగోలు, పెట్రోల్ వాడకం తగ్గించుకోవడం, సేంద్రియ ఎరువులు వాడడం, వంట నూనెల వాడకం తగ్గించుకోవడం చాలా కీలకమైనవి. దాదాపు ప్రతీ సగటు జీవిపై వీటి ప్రభావం ఉంటది. అసలు ప్రపంచంలో నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశంలో పెట్రోల్, బంగారం, నూనెలు, ఇతర విదేశీ ఉత్పత్తుల వాడకం గురించి దేశ ప్రధాని పొదుపు ప్రకటనలు చేయడం వెనుక ఆంతర్యం ఏమిటి? ఎక్కువ శాతం దిగుమతుల మీద ఆధారపడ్డ మనదేశంలో వనరుల స్వావలంబన, ఆర్థిక క్రమశిక్షణ అవసరమా? అనేవి ప్రస్తుత పరిస్థితులలో అందరూ ఆలోచించాల్సిన తరుణం. దేశ జనాభాకి తగినట్టుగా భారతదేశంలో వనరులు లేవు. అందుకే, కొన్ని కీలక వస్తువుల వినియోగంలో దేశం దిగుమతుల మీద ఆధారపడి ఉన్నది. వాటిలో ముఖ్యమైనది ముడిచమురు కాగా, రెండవది బంగారం. మొదటిగా ముడి చమురు పరిశీలిస్తే, 2025 -26 వాణిజ్య డేటా ప్రకారం, మొత్తం దేశ దిగుమతుల విలువ సుమారు 775 బిలియన్ డాలర్లు కాగా, వాటిలో సుమారు 135 బిలియన్ డాలర్ల విలువ గలిగిన చమురు దిగుమతులు కూడా ఉన్నాయి. ముడిచమురు, ఖనిజ ఇంధనం కలుపుకొని భారతదేశం మొత్తం దిగుమతులలో దాదాపు 30% పైననే ఉంటాయి. మొత్తం ముడి చమురు అవసరాలలో సుమారు 87.8% మనం ఇతర దేశాల నుండి దిగుమతి చేశామంటున్నాం. దేశ చమురు అవసరాలలో కేవలం 15% కంటే తక్కువ మాత్రమే దేశీయ ఉత్పత్తి సామర్థం ఉన్నది. మరోవైపు, మొత్తం ముడి చమురు దిగుమతిలో సుమారు 45-50 శాతం కేవలం పశ్చిమాసియా దేశాల నుండి దిగుమతి అవుతుంది. ఇటీవల అమెరికా, ఇజ్రాయల్ ఇరాన్ మధ్య తలెత్తిన యుద్ధం ప్రభావంతో ముడి చమురు దిగుమతి తగ్గింది. అంతర్జాతీయ మార్కెట్ లో దాని ధరలు కూడా పెరిగాయి. యుద్ధానికి ముందు (జనవరి నెలలో) బ్యారెల్ ముడి చమురు విలువ సుమారు 61.41 డాలర్ కాగా, ప్రస్తుతం దాని విలువ సుమారు 100 డాలర్ పై నే ఉన్నది. యుద్ధం తరువాత, దాదాపు అన్ని దేశాలలో పెట్రోల్, డీజిల్ ధరలు సగటున 25 నుండి 50 శాతం వరకు పెరిగాయి. కానీ మన దేశంలో మాత్రం ధరలు పెరగలేదు. ఆయా ధరల భారం సామాన్య ప్రజలపై పడకుండా కేంద్ర ప్రభుత్వం జాగ్రత్త పడుతున్నది. కానీ రానున్న రోజుల్లో ఆ భారం మరింతగా పెరిగే అవకాశం లేకపోలేదు. ఇకపోతే, బంగారం కూడా సుమారు ఒక ఏడాదిపాటు కొనుగోలు చేయవద్దని ప్రధాని చేసిన సూచన కొన్నివర్గాలకు రుచించడం లేదు. బంగారం మన దేశంలో ఒక సెంటిమెంట్ సాధనం. ప్రొడక్టీవ్ పర్పస్ కోసం కాకుండా కేవలం సెంటిమెంట్, అలంకరణ కోసం మాత్రమే బంగారం కొనుగోలు చేస్తున్నాము. ప్రపంచంలో ఉన్న మొత్తం బంగారం నిల్వలో, సుమారు 35 శాతం బంగారం మన దేశంలోనే ఉన్నది. 2024- 25లో 58 బిలియన్ డాలర్ విలువ గలిగిన 757.09 టన్నుల బంగారం దిగుమతి చేసుకోగా, 2025-26 లో 78.98 బిలియన్ డాలర్ల విలువ గలిగిన 721.03 టన్నుల బంగారం దిగుమతి చేసుకున్నాం. గత సంవత్సరంతో పోల్చితే, బంగారం దిగుమతి పరిమాణం తగ్గినప్పటికీ సుమారు 24% వరకు బంగారం ధర మాత్రం పెరిగింది. దిగుమతి టారిఫ్ పెంచడం, యుద్ధం చేయడం వంటి అనవసర నిర్ణయాలతో ట్రంప్ ప్రపంచాన్ని భయాందోళనకు గురిచేస్తున్నాడు. అందుకే పెట్టుబడి దారులు, స్టాక్ మార్కెట్‌లలో సంపదను సురక్షితమైన బంగారం వైపు తరలిస్తున్నారు. ఫలితంగా బంగారం ధరలు అంతర్జాతీయ మార్కెట్‌లో ఆకాశాన్ని అంటాయి. కానీ బంగారం కొనుగోలు మాత్రం భారత్‌లో తగ్గలేదు. వినియోగదారు కొనుగోలు చేసిన బంగారం తిరిగి వారి లాకర్‌లోకి చేరుకుంటుంది. కానీ దాని ద్వారా ఎటువంటి ఉత్పాదకత జరుగదు. బంగారం దిగుమతి రాను రాను దేశానికీ భారం అవుతుంది. భవిష్యత్‌లో బంగారం దిగుమతులు పెరిగితే, అది దేశ ఆర్థిక వ్యవస్థకు తీవ్ర ఆటంకం చేస్తుంది. ఒకవైపు ప్రపంచ వ్యాప్తంగా బంగారం, ముడిచమురు ధరలు పెరుగుతున్నాయి. వాటిని దిగుమతి చేసుకోవడానికి అయ్యే ఖర్చును డాలర్ రూపంలో చెల్లించాలి. మన దేశానికి వచ్చే రేమిటన్స్ తగ్గిపోవడం, ట్రంప్ నిర్ణయాలతో మన ఎగుమతులు తగ్గి దేశానికి డాలరు రాక తగ్గిపోయింది. కానీ బంగారం, ముడి చమురు వంటి ఇతర వస్తువుల దిగుమతి ఖర్చును డాలర్ రూపంలో చెల్లించాల్సి వస్తుంది. మన దగ్గర తగిన విదేశీ నిల్వలు (డాలర్) లేకపోవడం వలన అంతర్జాతీయ మార్కెట్‌లో డాలర్‌ను కొనుగోలు చేయవలసి రావడం వలన రూపాయి విలువ తగ్గి డాలర్ విలువ పెరుగుతుంది. ట్రంప్ అధికారంలోకి రాక ముందు అంటే 2024 డిసెంబర్‌లో 1 డాలర్ విలువ 83 రూపాయలు కాగా, ఇప్పుడు అది సుమారు 95 రూపాయలకు చేరుకుంది. ఏప్రిల్ 17, 2026 నాటికి భారతదేశ విదేశీ మారక ద్రవ్యనిల్వలు 703.308 బిలియన్ డాలర్లు. పరిస్థితి ఇలాగే కొనసాగితే డాలర్ 100 రూపాయలకు చేరుతుంది. అప్పుడు దిగుమతులు మరింత భారం అవుతాయి. ఆ భారం దేశ ప్రజలపై పడుతుంది. ముఖ్యంగా చమురు ధరలు పెరిగితే సరుకు రవాణా పెరిగి అన్ని రకాల వస్తువుల ధరలు పెరుగుతాయి. ఇప్పటికే టోకు ద్రవ్యోల్బణం 3.88% కి చేరింది. రిటైల్ ద్రవ్యోల్బణం 3.40% గా ఉంది. ప్రస్తుత పరిస్థితి కొనసాగితే, మరి కొద్దీ రోజుల్లోనే ద్రవ్యోల్బణం 4-4.5%కి చేరే ప్రమాదం ఉంది. ఇది సామాన్యుల బడ్జెట్‌పై తీవ్ర ప్రభావం చూపడమే కాకుండా బ్యాంకింగ్, ఇన్సూరెన్సు, పారిశ్రామిక రంగాలు భారీగా నష్టపోతాయి. అందుకే, దిగుమతులు తగ్గించుకోవాలి. అంటే, ప్రజలు బంగారు, పెట్రోల్, డీజిల్, వంటనూనెలు, ఇతర దిగుమతుల పై ఆధారపడ్డ వస్తువుల వినియోగం తగ్గించుకుంటే, అంతమేర దిగుమతులు తగ్గి ఈ కష్టకాలం నుండి బయట పడవచ్చును.

## భవిష్యత్ తెలంగాణకు రూపురేఖలు గీస్తున్న ఫ్యూచర్ సిటీ

### (సి.హెచ్.ప్రతాప్)

హైదరాబాద్ నగర శివార్లలో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపుదిద్దుకుంటున్న ఫ్యూచర్ సిటీ తెలంగాణ రాష్ట్ర ప్రగతి ప్రయాణంలో ఒక మైలురాయిగా నిలుస్తోంది. సుమారు ముప్పై వేల ఎకరాల అపార విస్తీర్ణంలో 765 చదరపు కిలోమీటర్ల మేర విస్తరిస్తున్న ఈ సరికొత్త నగరం అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మౌలిక వసతులతో అభివృద్ధి చెందుతోంది. యాభై ఆరు రెవెన్యూ గ్రామాలు, మూడు శాసనసభ నియోజకవర్గాల పరిధిలో విస్తరిస్తున్న ఈ ప్రాజెక్ట్ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా రూపుదాల్చుకుంటోంది. రాబోయే కాలంలో ఇరవై ఐదు నుంచి ముప్పై లక్షల మంది జనాభా ఇక్కడ నివసించడానికి వీలుగా అత్యాధునిక సాంకేతికతను జోడించి జీవన విధానాన్ని సులభతరం చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ఈ నగర నిర్మాణంలో పర్యావరణ పరిరక్షణకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తున్నారు. సౌరశక్తి వినియోగం, వినూత్న జల నిర్వహణ పద్ధతులు, కాలుష్య రహిత రవాణా వ్యవస్థల ద్వారా దీనిని పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దుతున్నారు. ఇక్కడ నివసించే ప్రజలు తమ నివాస ప్రాంతాలకే పరిమితం కాకుండా ఒకే చోట విద్యాభ్యాసం, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, ఆహ్లాదకరమైన వినోదాన్ని పొందేలా సమగ్ర ప్రణాళికలను సిద్ధం చేశారు. కేవలం నివాస ప్రాంతంగానే కాకుండా పారిశ్రామికంగా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పెట్టుబడులను ఆకర్షించే విధంగా ప్రత్యేక జోన్లను నిర్మిస్తున్నారు.

ముఖ్యంగా కృత్రిమ మేధస్సు, జీవ విజ్ఞాన శాస్త్రాలు, ఎలక్ట్రానిక్ వస్తువుల తయారీ, విద్యుత్ వాహనాల పరిశ్రమలు, సమాచార నిల్వ కేంద్రాలు, ఉన్నత విద్యా సంస్థలు, అత్యాధునిక వైద్యశాలలు ఈ నగరంలో కొలువుదీరనున్నాయి. ఈ రకమైన ఆధునిక పరిశ్రమల స్థాపన ద్వారా స్థానిక యువతకు అత్యున్నత నైపుణ్యాలతో కూడిన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. భూములు కోల్పోయిన స్థానిక రైతులకు జీవనోపాధి కల్పించడంతో పాటు వారికి అభివృద్ధి చేసిన లేఅవుట్లలో ప్లాట్లు కేటాయించేలా మెగా టౌన్‌షిప్ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోంది. దీనివల్ల గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య ఆర్థిక సమతుల్యత ఏర్పడుతుంది.

ఔటర్ రింగ్ రోడ్డు, శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం, వివిధ జాతీయ రహదారులతో అద్భుతమైన రవాణా అనుసంధానం కలిగి ఉండటం ఈ ప్రాజెక్టుకు ప్రధాన బలంగా మారింది. దేశీయ, అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు ఇక్కడ పెట్టుబడులు పెట్టడానికి ఈ రవాణా సౌకర్యాలు ఎంతగానో దోహదపడతాయి. పచ్చదనం పెంపొందించడం, కర్బన ఉద్గారాలను తగ్గించడం ద్వారా జీవ వైవిధ్యాన్ని కాపాడేందుకు పెద్ద ఎత్తున తోటల పెంపకం చేపడుతున్నారు. భూసేకరణ ప్రక్రియలో స్థానిక ప్రజల ప్రయోజనాలను కాపాడుతూ, వారి సామాజిక భద్రతకు భరోసా కల్పిస్తూ సమతుల్య విధానాన్ని అనుసరిస్తున్నారు.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పర్యావరణ స్థిరత్వం, సామాజిక సమగ్రతను ఒకే తాటిపైకి తెస్తూ నిర్మిస్తున్న ఈ భవిష్యత్ నగరం కేవలం తెలంగాణకే పరిమితం కాకుండా భారతదేశ పట్టణ అభివృద్ధి రంగానికి ఒక దిశానిర్దేశం చేసే నమూనాగా నిలుస్తోంది. ఆర్థిక వృద్ధిని, పర్యావరణ పరిరక్షణను సమాంతరంగా ముందుకు తీసుకెళ్లే ఈ బృహత్తర ప్రాజెక్ట్ రాబోయే తరాలకు ఆదర్శవంతమైన జీవన ప్రమాణాలను అందిస్తుంది.

## సమగ్ర విద్యాబోధనతో రాష్ట్రంలో అగ్రగామిగా ఎంజేపీ గురుకులాలు

**ఎం జే పి బ్రాండింగ్ క్రియేట్ చేయాలి**

**8 వ తరగతి నుండే నీట్ ,ఎంసెట్ కాంపిటీటివ్ ఎగ్జామ్స్ కి ప్రిపేర్ చేయాలి**

**మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలల పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాలపై సమీక్షా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్**









**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం మే 21:** మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల విద్యాలయాల పనితీరు పై మంత్రి పొన్నం ప్రభాకర్ గారు గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల ప్రిన్సిపాల్స్ ను అభినందించారు. ఫలితాలు తక్కువగా వచ్చిన గురుకుల విద్యాసంస్థలు కారణాలు సమీక్షించుకోవాలని ఆయన సూచించారు. వచ్చే విద్యాసంవత్సరం మంచి ఫలితాలు సాధించేలా పని చేయాలిని ఆయన అన్నారు.

ఈ సమీక్షా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలు వచ్చే విద్యా సంవత్సరంలో రాష్ట్రంలోనే అగ్రగామిగా ఉండాలని ఆదిశగా అధ్యాపక బృందం పని చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు. విద్యార్థులకు చదువులతో పాటు ఆటలు , సాంస్కృతిక కార్యక్రమాలు, సైన్స్, ఏఐ, తదితర అంశాలపై ఉన్నత స్థానాలకు ఎదిగేలా ప్రోత్సహించాలని ఆదేశించారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలను అభిందించడంతో పాటు ఉత్తీర్ణత శాతం తక్కువగా వచ్చిన పాఠశాలల ప్రిన్సిపాల్ లను మందిలించారు. వచ్చే విద్యా సంవత్సరంలో మంచి ఫలితాలు రాబట్టాలని సూచించారు. గతంలో 327 స్కూల్ లలో 301 స్కూల్ లో ప్రైవేట్ భవనాల్లో ఉన్నాయని, ప్రభుత్వం విద్యకు ప్రధాన్యత ఇవ్వడం తో గురుకులాలు అద్భుతంగా పని చేస్తున్నాయనీ తెలిపారు. గురుకుల పాఠశాలలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, ప్రభుత్వం మెస్ ఛార్జీలు కాస్మొటిక్ చార్జీలు పెంచి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులు ప్రభుత్వం మీద విశ్వాసంతో ,అధ్యాపకుల విశ్వాసంతో తమ పిల్లలను గురుకులాలకు పంపిస్తున్నారనీ తల్లిదండ్రుల కన్నా ఎక్కువగా ఉపాధ్యాయులతోనే పిల్లలు సమయం ఇస్తారని తమ సొంత పిల్లల మాదిరి విద్యార్థులను చూసుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు మంచైనా,చెడైనా అధ్యాపకులు దిక్సూచి అని తెలిపారు.

2026-27 సంవత్సరానికి రాష్ట్రంలోని అన్ని బీసీ సంక్షేమ శాఖ గురుకులాలు మరింత సమర్థవంతంగా విజయాలు సాధించాలనీ ఆకాంక్షించారు. ఎవరిని ఇబ్బంది పెట్టి పని చేయించుకోవడం లేదనీ పూర్తి స్థాయిలో విద్యా బోధన జరగాలనీ ఆదేశించారు. ప్రైవేట్ భవనాల్లో నెల వారి అద్దె కడుతున్నప్పటికీ మౌలిక సదుపాయాలు లేకపోతే కల్పించుకునే బాధ్యత ప్రిన్సిపల్ లది సూచించారు. టాయిలెట్స్, ఫ్యాన్స్,ఇతర మౌలిక సదుపాయాలు ఏం ఇబ్బందులు లేకుండా చూసుకోవాలనీ తెలిపారు. ఎంజేపీ గురుకులాలు అద్భుతంగా ఉండాలంటే అందరూ కలిసి సమిష్టి గా ఒక కుటుంబం లాగ పని చేయాలన్నారు. పిల్లల ఉజ్వల భవిష్యత్తు జ్ఞాపకులపై ఆధారపడి ఉందన్నారు. సమాజంలో ఏ విధంగా బతకాలి , డిసిప్లెన్, తల్లిదండ్రుల తో ఎలా వ్యవహరించాలి.. పెద్దలతో ఎలా మాట్లాడాలి అని విద్యార్థులకు నేర్పించాలని సూచించారు. చిన్న చిన్న కారణాలతో గురుకులాల్లో సూసైడ్ జరుగుతున్నాయని విద్యార్థుల్లో మనో ధైర్యాన్ని కల్పించాలని వారిలో మోటివేటివ్ కల్పించాలన్నారు. జిల్లాలో ఉన్న స్కూల్స్ వారిగా సమీక్ష లు చేస్తూ వంద శాతం ఫలితాలు వచ్చిన స్కూల్స్ అభినందిస్తూ.. తక్కువ ఫలితాలు వచ్చిన స్కూల్స్ ఆత్మపరిశీలిన చేసుకోవాలనీ సూచించారు.

అధ్యాపకులంతాఎంజేపీ కి బ్రాండ్ ఇమేజ్ క్రియేట్ చేయాలనీ పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల వారు కూడా మన విద్యా విధానం వచ్చి ఇక్కడ అధ్యయనం చేసేలా సమర్థవంతంగా పనిచేయాలన్నారు. పదవ తరగతి 98.45 శాతం ఉత్తీర్ణత సాధించడం పట్ల సెక్రటరీ సైదులు తో పాటు ప్రిన్సిపల్ లను అభినందించారు. 500 పైన వచ్చిన మార్కులు 9788 మంది విద్యార్థులకు వచ్చాయనీ204 ఎంజేపీ గురుకులాలు 100 శాతం ఫలితాలు సాధించాయనీ సంతోషం వ్యక్తం చేశారు. 65 స్కూల్స్ వెనుకబడి ఉన్నాయనీ ఆ స్కూల్స్ ఆత్మపరిశీలిన చేసుకోవాలి ఉత్తీర్ణత తక్కువగా వస్తె మంచిది కాదనీ హెచ్చరించారు. ఫెయిల్ అయిన విద్యార్థులు తెలుగు లో సబ్జెక్ట్ లో ఎక్కువగా కనిపిస్తున్నారనీ తెలుగు లో ఫెయిల్ కాకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రతి స్కూల్ లో ర్యాంకర్ల ఫోటో లతో ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలనీగ్రామాల్లో గురుకులాల్లో వచ్చిన మార్కులు ఫలితాలు విస్తృతంగా ప్రచారం కల్పించాలన్నారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో 90.31 శాతం ,ఒకేషనల్ ద్వితీయ సంవత్సరంలో 97.72 శాతం , ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం లో 85.80 శాతం, ఒకేషనల్ ప్రథమ సంవత్సరంలో 95.81 శాతం పాస్ శాతం ఉందని

900 పైన మార్కులు సాధించిన విద్యార్థులు 4183 మంది విద్యార్థులు ,980 మార్కులు పైన 496 మంది విద్యార్థులు సాధించారనీ ఇంటర్మీడియట్ లో తక్కువ ఉత్తీర్ణత శాతం వచ్చిన గురుకులాలను హెచ్చరించారు. 35 విద్యా సంస్థలు ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాయనీ అభినందించారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో 8 విద్యా సంస్థలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయన్నారు. ఎంజేపీ లో చదివిన పదవ తరగతి పాస్ అయిన విద్యార్థులకు నేరుగా ఇంటర్మీడియట్ తరగతులకు అడ్మిషన్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. గురుకుల పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు ఇంకా ఏమి అవసరమని ప్రతిపాదనలు ఇవ్వాలని సూచించారు. ఇంటర్మీడియట్ లో వచ్చిన ఫలితాలు మాదిరి్స్త్రముఖజూఎవ్ లో ర్యాంకులు రావాలన్నారు. ప్రతి గురుకుల పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేస్తామన్నారు. 8 వ తరగతి నుండే నీట్ ,ఎంసెట్ ,కాంపిటీటివ్ ఎగ్జామ్స్ కి ప్రిపేర్ చేయించాలన్నారు. జిల్లాలో గురుకుల పాఠశాలలు విజిట్ చేస్తామని పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ తప్పనిసరి చేసి ఎంజేపీ కి బ్రాండ్ ఇమేజ్ క్రియేట్ చేయాలన్నారు.

సమీక్షా సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ సెక్రటరీ బాలమయాదేవి, మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల సెక్రటరీ సైదులు, ఆర్సీవో లు ,ప్రిన్సిపల్ లు హాజరయ్యారు.







**నాంపల్లి గాంధీభవన్ ప్రజాబలం ప్రతినిధి:** గురువారంనాడు , మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా, హైదరాబాద్ సెంట్రల్ సిటీ కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షులు మోతా రోహిత్ ముదిరాజ్ నాయకత్వంలో గాంధీ భవన్‌లో రక్తదాన శిబిరం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ఎస్. ధనరాజ్, డాక్టర్ తేజస్విని, రాజ్‌కుమార్, జిత్తు , యోగేష్ యాదవ్, ఆరిఫ్ కాంగ్రెస్‌నాయకులు చురుకుగా పాల్గొన్నారు. రాజీవ్ గాంధీ ఆదర్శాలు, దార్శనికతను ప్రతిబింబిస్తూ, మానవత్వానికి గౌరవ సూచకంగా మరియు సేవగా ఈ శిబిరం నిర్వహించబడింది.

# శుక్రవారం నిర్వహించే ప్రజా పాలన జిల్లా స్థాయి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి - జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కిరణ్మయి.



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 22న శుక్రవారం నిర్వహించనున్న జిల్లా స్థాయి కార్యక్రమం ఏర్పాట్లపై అదనపు కలెక్టర్ కిరణ్మయి గురువారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో సమీక్ష జరిపారు. ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో ప్రజాపాలన కార్యక్రమాలను చక్కగా నిర్వహించడం జరిగిందని, అదే స్ఫూర్తితో జిల్లా స్థాయి కార్యక్రమాన్ని మరింత అట్టహాసంగా నిర్వహించేలా కృషి చేయాలన్నారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల పోటోలు, ఆయా పథకాల ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారుల జాబితాలను, సంక్షేమ పథకాలకు ప్రభుత్వం కేటాయించిన నిధుల వివరాలతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ అందించేందుకు వీలుగా సమగ్ర వివరాలతో నివేదికలను అందించాలని ఆదేశించారు. జిల్లా అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, సాధించిన పురోగతిని సమగ్రంగా ప్రదర్శించేలా నివేదికలు ఉండాలన్నారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో అమలవుతున్న సంక్షేమ పథకాలకు సంబంధించి స్టాళ్ళను ఏర్పాటు చేయాలన్నారు. ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని, శాఖల వారీగా అధికారులు సమన్వయంతో పనిచేస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు.

# జర్నలిస్టుల సంక్షేమ నిధి నుంచి 21 మంది కి ఆర్థిక సహాయం మంజూరు చేసినట్లు తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.



గురువారంనాడు నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమి కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో జర్నలిస్టుల సంక్షేమ నిధి కమిటీ 5వ సమావేశం చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఆర్థిక సహాయం కోసం వచ్చిన 29 దరఖాస్తులను కమిటీ సభ్యులు పరిశీలించి 17 మంది మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు, తీవ్ర ప్రమాదాలకు గురైన, దీరర్ఘకాలికంగా అనారోగ్యం బారిన పడిన నలుగురు జర్నలిస్టులకు కూడా కమిటీ ఆర్థిక సహాయం మంజూరు చేసింది.

ఈ కమిటీ సమావేశంలో ఎంపికైన 17 మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు ఒక లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సాయం, అలాగే ఆయా కుటుంబాలకు ప్రతి నెల మూడు వేల రూపాయల చొప్పున పెన్షన్ ఐదు సంవత్సరాల పాటు అందజేస్తామని ఆయన తెలిపారు. మరణించిన జర్నలిస్టుల కుటుంబాలలో ఎల్.కే.జి నుండి పదవ తరగతి వరకు చదువుతున్న ఇద్దరు పిల్లలకు ఒక్కొక్కరికి నెలకు ఒక వెయ్యి రూపాయల చొప్పున ట్యూషన్ ఫీజును మంజూరు చేస్తున్నట్లు ఆయన వివరించారు. నలుగురు అనారోగ్యం బారిన పడిన వర్కింగ్ జర్నలిస్టులకు జర్నలిస్టుల సంక్షేమ నిధి నుంచి ఆర్థిక సహాయం మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు.

ఈ కమిటీ సమావేశంలో సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్ డి.ఎస్. జగన్, మీడియా అకాడమి కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావు, అకౌంట్స్ ఆఫీసర్ పూర్ణ చందర్ రావు, మేనేజర్ డి.ఆర్.ఎస్. శైలెశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ,ఘనంగా క్రీడా దినోత్సవం

హైదరాబాద్, మే 21: ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న "స్పోర్ట్స్ అండ్ యూత్ వారోత్సవాలు" కార్యక్రమాల్లో భాగంగా ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా "క్రీడా దినోత్సవం"ను అత్యంత ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలోని 32 జిల్లా కేంద్రాల్లో జిల్లా కలెక్టర్లు మరియు అధికార యంత్రాంగం పర్యవేక్షణలో జిల్లా యువజన మరియు క్రీడాశాఖ ఆధ్వర్యంలో వివిధ క్రీడా పోటీలు విజయవంతంగా జరిగాయి.రాష్ట్ర స్థాయి ప్రధాన ఉత్సవాలు హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించబడగా, యువత, క్రీడాకారులు, తల్లిదండ్రులు మరియు ప్రజల నుండి విశేష స్పందన లభించింది.తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో జంట నగరాల్లోని గచ్చిబౌలి జీఎంసీబీ స్టేడియం, కేవీబీఆర్ ఇండోర్ స్టేడియం, సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం, జింఖానా గ్రౌండ్స్, సైక్లింగ్ వెలోడ్రోమ్ తదితర క్రీడా వేదికల్లో ఇంటర్ స్టేడియా కాంపిటీషన్స్ నిర్వహించబడ్డాయి.ఈ పోటీల్లో అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, బాక్సింగ్, ఫెన్సింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, టెన్నిస్, ఫుట్‌బాల్, చెస్, హ్యాండ్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, రెజ్లింగ్ తదితర క్రీడాంశాల్లో క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు.తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఏ. సోనీ బాలాదేవి ఈ పోటీలను స్వయంగా పర్యవేక్షించారు. ఆమె వివిధ క్రీడా విభాగాల్లో పాల్గొంటున్న క్రీడాకారులను కలుసుకుని ఉత్సాహపరిచారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న స్పోర్ట్స్ అండ్ యూత్ వారోత్సవాలు రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. యువతతో పాటు క్రీడాకారులు, తల్లిదండ్రులు మరియు సమాజంలోని వివిధ వర్గాల ప్రజల నుండి ఈ కార్యక్రమాలకు విశేష ఆదరణ లభిస్తోందన్నారు.సమాజంలోని అన్ని వర్గాల వారు, అన్ని వయస్సుల వారు క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకునేలా తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ కృషి చేస్తోందని ఆమె పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమకు నచ్చిన క్రీడల్లో పాల్గొనే అవకాశాలను కల్పించడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని ఆమెఅభిప్రాయపడ్డారు

ఈ కార్యక్రమంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్లు రవితేజ, సుజాత, శ్రీనివాస్, స్టేడియం అడ్మినిస్ట్రేటర్లు రవికుమార్, రాజ్‌వీర్, నందకిషోర్, కన్నం మధు, పీఆర్వో కాలేరు సురేష్ తదితరులు పాల్గొన్నారు.



**నాంపల్లి గాంధీభవన్ ప్రజాబలం ప్రతినిధి:** గురువారంనాడు , మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా గాంధీ భవన్‌లో రాజీవ్‌గాంధీ చిత్ర పటానికి పూలమాళవేసి నివాళులర్పించిన ఎఐసీసీ ఓబీసీ కో ఆర్డినేటర్ నిర్మల్ కూమార్ యాదవ్ ఎం.కిషన్ కూమార్ ,జీ.రమేష్ ,శ్యాంరావ్ బాలపోచయ్య ,రాణా .ఆనగేష్ తదితరలు పాల్గోన్నారు.




**నాంపల్లి గాంధీభవన్ ప్రజాబలం ప్రతినిధి:** రాజీవ్ గాంధీ గారి వర్ధంతి సందర్భంగా మా ప్రియతమ నాయకులు మోత రోహిత్ ముధిరాజ్ డి సి సి అధ్యాక్షులు ఖైరతాబాద్ జిల్లా (హైదరాబాద్ సెంట్రల్ ) అధ్వర్యంలో గాంధీ భవన్ లో ఏర్పటు చేసిన రక్త దాన శిభిరం మరియు రాజీవ్ గాంధీ ఫోటో ఎగ్జిబిషన్ కు నాయకులు మరియు కార్యకర్తలు వచ్చి స్వచ్ఛందంగా రక్త ధానం చేసారు ఈ కార్యక్రమం లో ముంద్రాయి శ్రీనివాస్ కార్యదర్శి డి సి సి ఖైరతాబాద్ జిల్లా (హైదరాబాద్ సెంట్రల్ ) రక్తదానం చేసారు

# రాజీవ్ గాంధీకి మంత్రి పొంగులేటి నివాళులు



ఖమ్మం గురువారం నాడు రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన నివాళులు అర్పించారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజక వర్గం పర్యటనలో భాగంగా ఎమ్మెల్యే మట్టా రాగమయి, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి రాజీవ్ గాంధీ గారి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దేశ అభివృద్ధి, ప్రజాసేవ, సామాజిక న్యాయం కోసం తన జీవితాన్ని అంకితం చేసినగొప్ప నాయకుడు, ఆధునిక భారత నిర్మాణానికి పునాది వేసి త్యాగశీలి రాజీవ్ గాంధీ గారి సేవలను స్మరించుకున్నారు. దేశ సమగ్రత, శాంతి, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం ప్రాణాలనే త్యాగం చేసిన మహనీయులు భారత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ. దేశ చరిత్రలో రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని మంత్రి అన్నారు.

# రాజీవ్ గాంధీ దూరదృష్టి ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకం



న్యూఢిల్లీ భారతరత్న, దివంగత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా న్యూఢిల్లీలోని 'వీర్ భూమి' వద్ద అయనకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఘన నివాళులు అర్పించారు. భట్టి మాట్లాడుతూ భారతదేశాన్ని ఆధునిక సాంకేతిక యుగం వైపు నడిపించిన మహోన్నత నాయకుడు రాజీవ్ గాంధీ అని అభివర్ణించారు. నవ భారత నిర్మాణం కోసం, యువతకు ఓటు హక్కు కల్పించి వారి సాధికారత కోసం ఆయన చూపిన దూరదృష్టి ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకం. దేశ ప్రగతి కోసం, ప్రజాస్వామ్య విలువల రక్షణ కోసం ఆయన చేసిన త్యాగాలు వృథా కావని అన్నారు. రాజీవ్ గాంధీ రి ఆశయాల సాధనలో, కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి ప్రజా సేవకు నిరంతరం పునరంకితమౌతామని అయన అన్నారు.

# మూడు వస్తే..మూడేది ఎవరికి

విజయవాడ, మే21 రాజకీయాల్లో అవకాశాలు రావు, తీసుకోవాలి. ప్రజలు ఎపుడూ తెలివైన వాళ్ళు. వారికి తామే ఆల్టర్నేషన్ అని ఎవరైనా అనుకుంటే అంతకంటే పొరపాటు ఉండదు, ప్రజలు తమదైన చైతన్యంతో తమకు కావాల్సిన ఆల్టర్నేషన్ ని తెచ్చుకుంటారు. గద్దె మీద కూర్చోబెడతారు. దానికి తాజా ఉదాహరణ తమిళనాడు. అక్కడ డీఎంకే ఓడితే అన్నా డీఎంకేనే దిక్కు అనుకున్నారు ఆ పార్టీ నేతలు. కానీ ఫలితాలు వచ్చిన తరువాత సీన్ అర్థం అయింది మూడవ ప్లేస్ లోకి పడిపోయింది. అంటే జనాల ఆలోచనలు ఎంత వేగంగా మారుతాయన్నది అర్థం చేసుకోవాలిన అవసరం ఉంది. ఇదే కాదు దేశాన్ని మూడు నాలుగు దశాబ్దాలకు పైగా ఏకచత్రాధిపత్యంగా ఏలిన కాంగ్రెస్ పార్టీ కూడా చివరికి విపక్షంలోకి రావాల్సి వచ్చింది. ఏపీ లో చూస్తే ప్రస్తుతానికి రాజకీయ వాతావరణం కూటమికి వైసీపీయే ప్రత్యర్ధిగా ఉంది. అదే వైసీపీలో ధీమాను కూడా పెంచుతోంది. కూటమి తప్పులు చేస్తే అధికారం తమకే దక్కుతుందని మెచ్చి వరమాలను తమ మెడలో వేస్తారని వైసీపీ నేతలు భావిస్తున్నారు. యాంటీ ఇంకెంబెన్సీ మీదనే ఎక్కువగా ఆశలు పెట్టుకున్నారు. అందుకే వచ్చే ఎన్నికల్లో మేమే అని చెబుతున్నారు. మరో విషయం ఏమిటి అంటే ఒక పార్టీకి ఒకేసారి అధికారం ఇవ్వడం ఏపీ ప్రజలు చేస్తారు కాబట్టి ఆ ట్రాక్ రికార్డు చూసినా తమకే చాన్స్ అని కూడా వారు విశ్వాసంగా ఉన్నారు.అయితే ఏపీలో అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా మూడేళ్ళ సమయం ఉంది. రాజకీయంగా చూస్తే అది చాలా ఎక్కువ సమయమే. ఎందుకంటే క్షణాలలో అంతా మారే సీన్ పొలిటికల్ గా ఉంటుంది. అలా చూసినపుడు ఈ మూడేళ్ళలో కొత్త పార్టీ వచ్చినా లేక థర్డ్ ఫోర్స్ ఏదైనా ఎమర్జ్ అయినా ఎవరికి ఎక్కువ నష్టం అన్న చర్చ వస్తోంది.

సాధారణంగా మూడవ పార్టీ వస్తే కనుక అది ఖాయంగా ప్రతిపక్ష పార్టీకే చేటు చేస్తుంది. దానికి మళ్ళీ అన్నా డీఎంకేని ఉదహరించాల్సి ఉంటుంది. అందువల్ల ఏపీలో కూడా వైసీపీకే దెబ్బ పడుతుందని అనే వారూ ఉన్నారు. ఏపీలో రెండేళ్ళ కూటమి ప్రభుత్వం పాలనలో అసంతృప్తి ఉంది. అయితే అది ఏ మేరకు అన్నది తెలియడం లేదు కానీ అధికారంలో ఉన్న పార్టీకి సహజం. కానీ ఆ అసంతృప్తి వైసీపీ వైపు మళ్ళడం లేదు. అంటే వైసీపీకి 2024 లో వచ్చిన 40 శాతం ఓట్లు అలా నికార్సుగా నిలిచి ఉన్నాయో లేవో తెలియడం లేదు కానీ కొత్త ఓట్లు అయితే జత చేరడం లేదు అన్న విశ్లేషణలు ఉన్నాయి. మరో వైపు చూస్తే ఏపీలో వైసీపీని వీడిన వారు ఉన్నారు, కూటమిలో చోటు లేని వారు ఉన్నారు. ఇంకా అన్ని పార్టీల తీరు చూసి కొత్తదనం కోసం ఆలోచిస్తున్న వారు ఉన్నారు. వీరందరి కోసం ఏదైనా పార్టీ వచ్చినా లేక ఫోర్స్ గా అందరూ కలిసి ప్రయత్నం చేసినా అపుడు ఏమిటి జరుగుతుంది అన్నది ఒక కీలకమైన చర్చ. అలాంటి సందర్భాలలో కచ్చితంగా వైసీపీకి ఇబ్బంది అవుతుందని అంటున్నారు.

వైసీపీ అయితే రెండేళ్ళ కాలంలో జనంలోకి పెద్దగా వచ్చింది లేదు.

ఇక అసెంబ్లీ ముఖం ఎమ్మెల్యేలు చూసింది అంతకంటే లేదు. అధినేత జగన్ కూడా జనంలోకి వచ్చే ప్రయత్నం చేయడం లేదు. దాంతో తమ గొంతుకని విపక్షం వినిపించలేకపోతోంది అన్న భావన అయితే మెల్లగా జనంలోకి వెళ్తోంది. సరిగ్గా ఈ సమయంలో సర్దుకుని వైసీపీ దూకుడుగా ముందుకు సాగకపోతే మాత్రం మూడవ పార్టీ అయినా లేదా శక్తి అయినా వస్తే మాత్రం ఆ పార్టీ విజయావకాశాలనే దెబ్బ తీస్తాయన్న విశ్లేషణలు ఉన్నాయి. చూడాలి మరి ఏపీ రాజకీయాల్లో ఏ మార్పులు వస్తాయో.

# అనంతలో తమ్ముళ్ల మధ్య లుకలుకలు

అనంతపురం, మే21 ఉమ్మడి అనంతపురం జిల్లాలో తెలుగుదేశం పార్టీ అంతర్గత రాజకీయాలు రోజురోజుకు చర్చనీయాంశంగా మారుతున్నాయి. పార్టీ అధిష్టానం నాయకులంతా కలిసి పనిచేయాలని సూచిస్తున్నప్పటికీ, స్థానిక స్థాయిలో మాత్రం వర్గపోరు తగ్గే పరిస్థితి కనిపించడం లేదు. ముఖ్యంగా నామినేటెడ్ పదవుల నియామకాల తర్వాత కొన్ని నియోజకవర్గాల్లో నేతల మధ్య విభేదాలు మరింత స్పష్టంగా బయటపడుతున్నాయని రాజకీయ వర్గాలు చర్చించుకుంటున్నాయి.అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో ఈ విభేదాలు ఇప్పుడు బహిరంగ చర్చకు దారితీశాయి. మార్కెట్ యార్డ్ కమిటీ చైర్‌పర్సన్‌గా పల్లవి బాధ్యతలు చేపట్టిన తర్వాత స్థానిక రాజకీయాల్లో కొత్త సమీకరణాలు కనిపిస్తున్నాయి. మొదట్లో ఆమె సిట్టింగ్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ కు సన్నిహితంగా వ్యవహరించారని, ఆ కారణంగానే ఆమెకు పదవి లభించిందనే అభిప్రాయం పార్టీ వర్గాల్లో వినిపించింది.అయితే తరువాత పరిస్థితులు మారిపోయాయి. కొన్ని వ్యవహారాల్లో ఎమ్మెల్యేకు, చైర్‌పర్సన్‌కు మధ్య అభిప్రాయ భేదాలు వచ్చినట్టు ప్రచారం సాగుతోంది. ఇదే సమయంలో మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి తో పల్లవి దగ్గరయ్యారనే చర్చ రాజకీయ వర్గాల్లో ఊపందుకుంది. దీంతో స్థానికంగా రెండు వర్గాల మధ్య పోటీ వాతావరణం మరింత పెరిగిందని అంటున్నారు.ఈ పరిణామాలను గమనించిన ఎమ్మెల్యే వర్గం మార్కెట్ యార్డ్ కమిటీలోని ఇతర సభ్యులను తమవైపు తిప్పుకునే ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. కమిటీ కార్యకలాపాలు కూడా రెండు వర్గాల ప్రభావంతో సాగుతున్నాయని చెబుతున్నారు. సభ్యులు, చైర్‌పర్సన్ మధ్య సమన్వయం లేకపోవడం వల్ల సమావేశాలు, కార్యక్రమాలు కూడా సక్రమంగా జరగడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఒకరితో ఒకరు మాట్లాడుకోవడానికే ఇష్టపడని పరిస్థితి ఏర్పడిందని స్థానిక నేతలు అంటున్నారు.మరోవైపు మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి వచ్చే ఎన్నికల్లో తిరిగి పోటీ చేయాలనే ఆలోచనలో ఉన్నారనే ప్రచారం కూడా జోరుగా సాగుతోంది. అధికారికంగా ఆయన ఎలాంటి ప్రకటన చేయకపోయినా, తన అనుచరులతో సమావేశాలు నిర్వహించడం, స్థానికంగా అసంతృప్తిగా ఉన్న నేతలను దగ్గర చేసుకోవడం వంటి పరిణామాలు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. గత ఎన్నికల్లో టికెట్ ఆశించిన ఆయనకు అవకాశం రాకపోవడం, తర్వాత నామినేటెడ్ పదవి కూడా దక్కకపోవడం ఆయన వర్గంలో అసంతృప్తిని పెంచిందని భావిస్తున్నారు.ఈ పరిస్థితులు ఎమ్మెల్యే వర్గానికి అసహనాన్ని కలిగిస్తున్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇరువర్గాల మధ్య విభేదాలు రోజు రోజుకూ తీవ్ర రూపం దాలుస్తుండటంతో పార్టీ కార్యకర్తలు కూడా అయోమయంలో పడుతున్నారని అంటున్నారు.

సీనియర్ నేతలు ఇప్పటివరకు జోక్యం చేసుకోకపోవడం పరిస్థితిని మరింత క్లిష్టంగా మార్చిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ఈ అంతర్గత విభేదాలు భవిష్యత్తులో పార్టీపై ప్రభావం చూపే అవకాశముందని స్థానికంగా చర్చ జరుగుతోంది.

పార్టీ అధిష్టానం సమయానికి స్పందించి నాయకుల మధ్య సమన్వయం తీసుకురాకపోతే ఎన్నికల సమయానికి సమస్య మరింత పెద్దదయ్యే అవకాశముందని పరిశీలకులు భావిస్తున్నారు

# వేడెక్కిన ధర్మవరం రాజకీయాలు

అనంతపురం, మే21 ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ లక్ష్యంగా శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో స్థానిక రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ప్రభుత్వ విమర్శకులను, ప్రశ్నించే వారిని అణచివేస్తున్నారంటూ మంత్రి సత్యకుమార్‌పై సొంత పార్టీ కూటమి నేతలతో పాటు ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. “సత్యకుమార్.. నీకు దమ్ముంటే నీ పదవికి రాజీనామా చేసి మళ్లీ ఎన్నికల్లోకి రా” అంటూ ధర్మవరం స్థానిక నాయకులు సవాల్ విసరడం ఇప్పుడు జిల్లావ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది.ఈ తాజా రాజకీయ వివాదానికి ప్రధాన కారణం ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో మంగళవారం జరిగిన ఒక దాడి ఘటన. మంత్రి సత్యకుమార్ నియోజకవర్గంలో అందుబాటులో ఉండటం లేదంటూ సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించిన హైకోర్టు న్యాయవాది కె. అంజన్ రెడ్డిపై మంత్రి వ్యక్తిగత సహాయకుడుహరీష్, అనుచరులు దారుణంగా దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన అంజన్ రెడ్డి ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, ప్రశ్నించే వారిపై ఇలా దౌర్జన్యాలు చేయడం దుర్మార్గమని స్థానిక నేతలు మండిపడుతున్నారు.ఈ ఘటనకు నిరసనగా ధర్మవరంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద టీడీపీ, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన స్థానిక నాయకులు ఏకమై భారీ ధర్నా చేపట్టారు. నిరసనలో పాల్గొన్న బీజేపీ నేత సుదర్శన్ రెడ్డి, కాంగ్రెస్ నేత పరమేష్ మాట్లాడుతూ.. సత్యకుమార్ ఒక బ్రోకర్ లా వ్యవహరిస్తున్నారని, అనంతపురంలో కలకలం రేపిన ‘హనీ ట్రాప్’ స్కామ్ వెనుక ఆయన హస్తం ఉందంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. మంత్రి అండతోనే ధర్మవరంలో రౌడీయిజం పెరుగుతోందని, బాధితుడికి న్యాయం జరిగే వరకు మంత్రికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని నాయకులు హెచ్చరించారు.

# కోస్తాజిల్లాల్లే వైసీపీ టార్గెట్

విశాఖపట్టణం, మే 21 ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కాపు సామాజిక వర్గం మరోసారి ప్రధాన చర్చగా మారుతోంది. ముఖ్యంగా జనసేన పార్టీ ఏర్పాటైన తర్వాత కాపు వర్గంలో రాజకీయంగా కొత్త మార్పులు కనిపించాయి. పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పై ఉన్న అభిమానంతో పాటు తమ సమస్యలను ప్రస్తావించే వేదికగా జనసేనను భావించే వారు ఎక్కువగా కనిపిస్తున్నారు. ఈ కారణంగా గత కొన్నేళ్లుగా కాపు వర్గం పెద్ద ఎత్తున జనసేనకు మద్దతుగా నిలుస్తోందనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో ఉంది.ఈ పరిస్థితి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కి రాజకీయంగా సవాలుగా మారిందనే చర్చ కొనసాగుతోంది. కాపు వర్గం ఒకే దిశలో నిలిస్తే భవిష్యత్ ఎన్నికల్లో ప్రభావం చూపే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ వర్గాన్ని రాజకీయంగా తటస్థంగా మార్చేందుకు వైసీపీ వ్యూహాలు సిద్ధం చేస్తోందనే ప్రచారం జరుగుతోంది.ఇటీవల వరకు కూటమి రాజకీయాలపై వైసీపీ నేతలు తీవ్ర విమర్శలు చేశారు. తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ మధ్య విభేదాలు వస్తాయని సోషల్ మీడియా వేదికలతో పాటు బహిరంగ సభల్లో కూడా వ్యాఖ్యలు వినిపించాయి. అయితే పవన్ కళ్యాణ్ మాత్రం కూటమి కొనసాగుతుందని, వ్యక్తులు మారినా లక్ష్యం మారదని స్పష్టం చేశారు. దీంతో కూటమిలో చీలికలు సృష్టించే ప్రయత్నాలు ఫలించలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.ఈ పరిస్థితుల్లో ఇప్పుడు కాపు వర్గాన్ని మళ్లీ ఉద్యమాల దిశగా తీసుకెళ్లే ప్రయత్నాలు జరుగుతున్నాయనే వార్తలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా కాపు రిజర్వేషన్లు, సామాజిక హక్కులు, రాజకీయ ప్రాధాన్యత వంటి అంశాలను మళ్లీ ప్రస్తావనలోకి తీసుకురావాలనే ఆలోచన కొంతమంది నేతల్లో ఉందని చెబుతున్నారు. 2014 నుంచి 2019 మధ్య కాలంలో కాపు ఉద్యమం రాష్ట్ర రాజకీయాల్లో పెద్ద చర్చగా నిలిచింది. ఆ సమయంలో రిజర్వేషన్ల కోసం ఆందోళనలు కూడా జరిగాయి.అయితే తర్వాత పరిస్థితులు మారిపోయాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కాపు ఉద్యమం నెమ్మదించింది. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ తమ తరఫున పోరాడతారనే నమ్మకం కాపు వర్గంలో ఉందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. ఇదే అంశం ఇప్పుడు వైసీపీకి ఇబ్బందిగా మారిందనే ప్రచారం కూడా జరుగుతోంది.దీంతో కాపు వర్గంలో మళ్లీ భిన్న అభిప్రాయాలు వచ్చేలా చేయాలని కొందరు ప్రయత్నిస్తున్నారనే చర్చ రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. క్షేత్రస్థాయిలో కొన్ని వర్గాలతో చర్చలు జరుగుతున్నాయనే వార్తలు వినిపిస్తున్నాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై అసంతృప్తి పెంచేలా ఉద్యమాలను ప్రోత్సహించే వ్యూహం అమలు చేసే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.అయితే ఈ ప్రచారాలపై అధికారికంగా ఎలాంటి స్పష్టత లేదు. కానీ కాపు వర్గం రాజకీయంగా ఎటు వైపు నిలుస్తుందన్నది భవిష్యత్ ఎన్నికల్లో కీలక అంశంగా మారే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో కాపు ఓటు బ్యాంక్ చుట్టూనే అనేక వ్యూహాలు తిరుగుతున్నాయనే చర్చ కొనసాగుతోంది.

# కాకినాడ నుంచే వర్మ రాజకీయం

కాకినాడ, మే 21 పిఠాపురం రాజకీయాల్లో మరోసారి ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. టీడీపీ నేత పిఠాపురం వర్మ అలియాస్ ఎస్వీఎస్ఎన్ వర్మపేరు ఇప్పుడు మళ్లీ చర్చనీయాంశంగా మారింది. 2024 ఎన్నికల సమయంలో ఆయనకు ఎమ్మెల్యే టికెట్ దక్కకపోవడం అప్పట్లో పెద్ద రాజకీయ చర్చకు దారితీసింది. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పిఠాపురం నుంచి పోటీ చేయాలని నిర్ణయించడంతో వర్మకు టికెట్ అవకాశాలు ముగిశాయి.అప్పుడు పార్టీ పెద్దలు ఎమ్మెల్సీ పదవి ఇస్తామని హామీ ఇచ్చారని వర్మ అనుచరులు భావించారు. అయితే ఆ హామీ అమలు కాలేదని వారు ఇప్పుడు బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇదే సమయంలో వర్మకు ఉన్న నియోజకవర్గ ఇంచార్జి బాధ్యతలు కూడా తొలగించడంతో ఆయన వర్గం మరింత నిరాశకు గురైంది. ఆ పరిణామాల తర్వాత వర్మ కాకినాడ కు వెళ్లి అక్కడే ఉంటున్నారు.అయితే రాజకీయాలకు పూర్తిగా దూరంగా ఉంటారని అనుకున్న సమయంలో కొత్త పరిణామాలు కనిపిస్తున్నాయి. పిఠాపురం ప్రాంతానికి చెందిన టీడీపీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కాకినాడలోని వర్మ నివాసానికి వెళ్లడం ఇప్పుడు రాజకీయంగా చర్చనీయాంశమైంది. గ్రామ స్థాయి నాయకుల నుంచి కీలక నేతల వరకు చాలామంది ఆయనను కలిసి మద్దతు ప్రకటిస్తున్నారని సమాచారం.పిఠాపురం పరిధిలోని పలు గ్రామాల నుంచి వచ్చిన నాయకులు వర్మకు ధైర్యం చెబుతూ ఆయన ఇంకా తమ నాయకుడేనని చెబుతున్నారని రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కొందరు నేతలు నియోజకవర్గంలో జరుగుతున్న పరిస్థితులను కూడా ఆయనకు వివరిస్తున్నారని అంటున్నారు. దీంతో వర్మ పరోక్షంగా అయినా పిఠాపురం రాజకీయాలపై దృష్టి కొనసాగిస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.ఇదే అంశం ఇప్పుడు జనసేన వర్గాల్లో అసహనానికి కారణమైందని సమాచారం. ఇంచార్జి బాధ్యతలు లేని పరిస్థితిలో కూడా వర్మ నియోజకవర్గ రాజకీయాల్లో చురుకుగా వ్యవహరించడం సరైన విధానం కాదని కొందరు జనసేన నాయకులు అభిప్రాయపడుతున్నట్లు తెలుస్తోంది. కూటమి ధర్మానికి ఇది విరుద్ధమని కూడా వారు వ్యాఖ్యానిస్తున్నారట.అయితే తనను కలవడానికి వచ్చే నాయకులను తాను ఆపలేనని వర్మ చెబుతున్నట్లు సమాచారం. తమ పార్టీ కార్యకర్తలు అభిమానంతో వస్తుంటే వారిని నిరాకరించడం ఎలా సాధ్యమవుతుందని ఆయన సన్నిహితుల వద్ద వ్యాఖ్యానించినట్లు ప్రచారం సాగుతోంది. పార్టీ క్యాడర్ తనతోనే ఉందని ఆయన వర్గం కూడా ధీమా వ్యక్తం చేస్తోంది.ఇప్పటికే కాకినాడలో వర్మను కలిసేందుకు వస్తున్న నాయకుల సంఖ్య పెరగడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

ఈ పరిణామాలపై టీడీపీ అధిష్టానం ఎలా స్పందిస్తుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

మరోవైపు జనసేన వర్గాలు మాత్రం ఈ వ్యవహారంపై అసంతృప్తితో ఉన్నాయని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# కార్యకర్తలతోనే జగన్ ఫేస్ టూ ఫేస్



విజయవాడ, మే 21 వైసీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎందుకు ఓటమి పాలు అయ్యామో గురించించారు. పార్టీని సొంతం అనుకుని తమ ప్రాణాలకు సైతం లెక్క చేయకుండా 2019 ఎన్నికల్లో పనిచేసిన కార్యకర్తలు 2024 నాటికి పూర్తిగా గాలికి వదిలేశారు అన్నది బాగా ప్రచారంలో ఉంది. అందులో నిజం ఉందని వైసీపీ హైకమాండ్ కూడా భావిస్తోంది. అందుకే జగన్ కార్యకర్తలకు వైసీపీ 2.0 ప్రభుత్వంలో అత్యధిక ప్రాధాన్యత ఇస్తానని ఇప్పటిదాకా చెబుతూ వస్తున్నారు. ఇపుడు ఆయన నేరుగా ప్రతీ నియోజకవర్గంలోని కార్యకర్తలతో నేరుగా భేటీ వేస్తారు అని ప్రచారం సాగుతోంది. అది ఎపుడూ ఏమిటి అన్నది తెలియదు కానీ కార్యకర్తలతో అధినేత ముఖా ముఖీ సమావేశం అవుతారు అని అంటున్నారు. వైసీపీ ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఇంచార్జిలను నియమించింది. అక్కడ నుంచి మునిసిపాలిటీలు, మండలాలు, గ్రామాలు వార్డులు ఇలా బూత్ లెవెల్ దాకా కమిటీలు ఏర్పాటు చేయాలని పార్టీ ఆదేశించింది. ప్రస్తుతం ఆ ప్రక్రియ అయితే జోరుగా సాగుతోంది అని అంటున్నారు. ఇది పూర్తి కాగానే ప్రతీ కార్యకర్తకు పార్టీ తరఫున ఐడెంటిటీ కార్డు ఇస్తారని అంటున్నారు. ఆ విధంగా కార్యకర్తలు ఈ ఐడెంటిటీ కార్డుల ద్వారా నేరుగా జగన్ తో మమేకం అయ్యేలా పార్టీ నిర్మాణం చేపడుతున్నామని నేతలు చెబుతున్నారు పార్టీలో కమిటీలు పూర్తి చేసిన తరువాత పనిచేసే వారికే పదవులు అన్న విధానాన్ని అమలు చేస్తారని అంటున్నారు. అలాగే వారి యోగ క్షేమాలు అధినాయకత్వం పట్టించుకుంటూ ఎప్పటికప్పుడు నేరుగానే వారితో కనెక్ట్ అయ్యేలా ఒక వ్యవస్థను రూపొందిస్తున్నారు అని అంటున్నారు. ఇక జగన్ జిల్లాల పర్యటనలు ఉంటాయని చెబుతున్నారు. దాంతో జిల్లాల పర్యటనలో కార్యకర్తలతో ఆయన భేటీలు అవుతారని చెబుతున్నారు. పార్టీకి సంబంధించి గ్రౌండ్ లెవెల్ విషయాలను వారి ద్వారా అధినాయకత్వం తెలుసుకునే ప్రయత్నం చేస్తుందని చెబుతున్నారు.మొత్తం మీద చూస్తే ఈ తరహా మార్పు ఆహ్వానించతగినదే అనుకుంటున్నారు. ఎందుకంటే పార్టీలో ఎపుడూ జీవగర్ర లాంటి వారు క్యాడర్ అని అంతా అంటారు. కానీ వారి ఊసు తలవడం లేదు. వైసీపీలో అయితే పదేళ్ళ పాటు కష్టపడినా కూడా అధికారంలోకి వచ్చాక అసలు పట్టించుకోలేదు అన్న విమర్శలు ఉన్నాయి. దాంతో ఈసారి మాత్రం వారికే అగ్ర తాంబూలం అని చెబుతున్నారు. మరి కార్యకర్తల మనసును నాయకులు ఏ మేరకు గెలుచుకోగలరు అన్నది చూడాల్సి ఉంది అంటున్నారు.

## పెళ్లి ఊరేగింపులో విషాదం:
## డీజే హోరుకు కుప్పకూలిన యువకుడు..
## మెదడులో రక్తస్రావం!

ఖమ్మం: విపరీతమైన శబ్దాలు చేసే డీజే సౌండ్ వ్యవస్థలు పండుగలు, వేడుకల్లో సంతోషాన్ని ఇవ్వాల్సింది పోయి ప్రాణాలకే ముప్పుగా మారుతున్నాయి. తాజాగా ఖమ్మం జిల్లా తల్లాడ మండలంలోని నారాయణపురం గ్రామంలో జరిగిన ఒక ఘటన స్థానికంగా కలకలం రేపింది. అధిక శబ్దాల కారణంగా ఒక యువకుడు తీవ్ర అస్వస్థతకు గురై ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నాడు.

?అసలేం జరిగింది? ?నారాయణపురం గ్రామంలోని ఎస్సీ కాలనీలో జరిగిన ఒక వివాహ వేడుకకు సదరు యువకుడు హాజరయ్యాడు. ఊరేగింపులో భాగంగా ఏర్పాటు చేసిన భారీ డీజే స్పీకర్ల నుండి వస్తున్న హై-డెసిబెల్ శబ్దాలకు, బేస్ (ఃజీబబ) హోరుకు యువకులు ఉత్సాహంగా డ్యాన్స్ చేశారు. అయితే, ఆ శబ్ద తీవ్రతకు ఆ యువకుడి శరీరం సహకరించలేదు. డ్యాన్స్ చేస్తున్న సమయంలోనే ఒక్కసారిగా తల పట్టుకుని కిందపడి అపస్మారక స్థితిలోకి వెళ్ళిపోయాడు.

# భూమా మౌనికకు దారేది...

కర్నూలు, మే 21 భూమా మౌనిక రెడ్డి రాజకీయ అరంగేట్రం ఖాయం అని తేలిపోయింది. ఈ విషయాన్ని స్వయంగా సినీ నటుడు ఆమె భర్త మంచు మనోజ్ వెల్లడించారు. భూమా మౌనికా రెడ్డికి రాజకీయాలు కొత్త కాదని ఆయన చెప్పుకొచ్చారు. భూమా నాగిరెడ్డి శోభా నాగిరెడ్డి వారసురాలిగా ఆమె భవిష్యత్తులో ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగు పెట్టబోతున్నారు అని మనోజ్ సంచలన ప్రకటన చేశారు.

దీంతో రాయల సీమ రాజకీయాలతో పాటు కర్నూల్ ఆళ్ళ రాజకీయాల్లో కొత్త చర్చ వేడిగా వాడిగా రాజుకుంటోందివిషయానికి వస్తే భూమా కుటుంబానికి కర్నూలు జిల్లాలో ఎంతటి పేరు ప్రఖ్యాతులు ఉన్నాయో అందరికీ తెలిసిందే. రాజకీయంగా ఆ కుటుంబం జిల్లాలో కీలక పాత్ర పోషించింది. భూమా నాగిరెడ్డి శోభా నాగిరెడ్డి దంపతులు రాజకీయాల్లో తమదైన శైలిలో ప్రాధాన్యతతో కూడిన పాత్ర పోషించారు. వారు దివంగతులు కావడంతో ఆ కుటుంబంలో బిడ్డలు ఇపుడు రాజకీయంగా తమ అవకాశాల కోసం ఎవరి ప్రయత్నాలలో వారు ఉన్నారు. ఇప్పటికే భూమా నాగిరెడ్డి దంపతుల రాజకీయ వారసురాలిగా రంగ ప్రవేశం చేసిన అఖిల ప్రియ రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు..గత తెలుగుదేశం ప్రభుత్వంలో మంత్రి కూడా అయ్యారు. ప్రస్తుతం ఆమె ఆళ్ళగడ్డ సిట్టింగ్ ఎమ్మెల్యేగా టీడీపీ తరఫున ఉంటూ గట్టి పట్టు సాధించారుఇదిలా ఉంటే భూమా నాగిరెడ్డి దంపతుల రెండవ కుమార్తె మౌనిక రెడ్డి ఇప్పుడు రాజకీయాల వైపు చాలా ఆసక్తిగా చూస్తున్నారు అని అంటున్నారు. మంచు మనోజ్ ఈ విషయాని ధృవీకరించడంతో పాటు మౌనికా రెడ్డిది రాజకీయ కుటుంబమే అని స్పష్టం చేయడంతో భూమా మౌనిక రెడ్డి రాజకీయానికి తెర లేచినట్లు అయింది. భూమా కుటుంబంలో ఇద్దరు ఆడబిడ్డలు ఒక సోదరుడు రాజకీయ వారసత్వం విషయంలో పోటీ పడే పరిస్థితి వచ్చిందా అన్న చర్చ కూడా ఉంది. అయితే అఖిలప్రియకు గతంలో మౌనికా రెడ్డి రాజకీయంగా అండగా నిలిచి ఆమె విజయం వెనక ఉన్నారు. ఇక వారి సోదరుడు జగద్విఖ్యాత రెడ్డి కూడా అఖిలప్రియ వెంట ఉన్నారు. మౌనికా రెడ్డి రాజకీయాల్లోకి వస్తే ఆమె దారి ఏ వైపు అన్నది పెద్ద ప్రశ్నగా ఉంది. ఇక భూమా మౌనిక రెడ్డి రాజకీయంగా తన సొంత దారిలో వెళ్తారా అన్నది కూడా చర్చకు వస్తోంది. ఆమెకు మంచు మనోజ్ పూర్తి మద్దతుగా నిలుస్తారని చెబుతున్నారు. ఇప్పటికే సేవా కార్యక్రమాలు చేస్తూ ఈ దంపతులు ప్రజల మన్నన పొందుతున్నారు. రాజకీయాలు పట్ల ఆసక్తి కూడా ఉన్నట్లుగా ప్రకటనల ద్వారా తెలియజేస్తున్నారు. మంచు మనోజ్ తన పుట్టినరోజు సందర్భంగా తన సతీమణి రాజకీయ రంగ ప్రవేశం మీద తాజాగా కీలక వ్యాఖ్యలే చేశారు. దాంతో ఆమె ఎక్కడి నుంచి పోటీ చేస్తారు, ఏది పార్టీ నుంచి చేస్తారు, ఎంపీగానా లేక ఎమ్మెల్యేగానా ఇవన్నీ చర్చకు దారి తీస్తున్నాయిఇక భూమా కుటుంబానికి తెలుగుదేశం పార్టీతోనూ వైసిపితోనూ ప్రజా రాజ్యంతోనూ సంబంధాలు ఉన్నాయి. భూమా దంపతులు ఈ మూడు పార్టీల నుంచి ప్రజా ప్రతినిదులు అయ్యారు. దాంతో తెలుగుదేశంలో అక్క అఖిలప్రియ రాజకీయంగా స్థిరపడినందున మౌనికా రెడ్డి వేరే ప్రత్యామ్నాయలు చూసుకుంటారా అన్న చర్చ కూడా సాగుతోంది. ప్రజారాజ్యంలో భూమా దంపతులు పనిచేసిన కారణంగా జనసేనలో ఏమైనా అవకాశం సంపాదించి అక్కడ నుంచి పోటీ చేస్తారా అన్నది కూడా మరొక చర్చగా ఉంది.

ఏది ఏమైనా భూమా మౌనిక రెడ్డి రాజకీయ రంగ ప్రవేశం మాత్రం కర్నూలు జిల్లా రాజకీయాల్లో కొత్తగా సంచలన కలిగించే అవకాశం ఉంది. అక్క చెల్లెలు ఇద్దరూ సర్దుబాటు రాజకీయంగా ముందుకు సాగుతారా లేక ఎదురు బొదురు నిలిచి పోటీ చేస్తారా, అది కూడా వేరు వేరు పార్టీ నుంచి రాజకీయంగా ముందుకు వస్తారా అన్నది సైతం చూడాల్సి ఉంది.

భూమా కుటుంబ వారసత్వం ఎవరిది అన్న ప్రశ్నకు జవాబుగా అఖిల ప్రియా ఉన్నారు. మరి పోటీగా మౌనిక రెడ్డి వస్తే మాత్రం రాజకీయం ఆళ్లగడ్డ నుంచి కర్నూలు జిల్లా వరకు రసకందాయంలో పడే అవకాశం ఉందని చెప్పక తప్పదు.

# గుప్త నిధుల తవ్వకాల వ్యవహారం లో ఫారెస్ట్ అధికారుల పాత్ర పై అనుమానం!

## జేసీబీతో తవ్వి బంగారం కుండలు వెలికితీత! పోలీసుల విచారణ లో వాస్తవాలు వెలుగుచూసే అవకాశం

మార్కాపురం గిద్దలూరు టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో గుప్తనిధుల తవ్వకాల్లో లంకెబిందెలు బయటపడ్డాయన్న సమాచారం కలకలం రేపుతోంది. ఓ గుప్తనిధుల ముఠా ఇచ్చిన సమాచారంతో అటవీశాఖ అధికారులు గుప్త నిధులను తవ్వి అందులో లభించిన లంకెబిందెల్లోని సొమ్ము స్వాహా చేసినట్టు సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతోంది. అందుకు సంబంధించిన ఓ వీడియో నెట్టింట చక్కర్లు కొడుతోంది. మార్కాపురం జిల్లా తురిమెళ్ళ అటవీ క్షేత్ర స్థాయి అధికారులు.. ట్రైబల్ వాచర్లతో కలిసి గుప్తనిధులు తవ్వకాలు జరిపినట్లు అనుమానిస్తున్నారు. ఈ తవ్వకాల్లో ఓ రెండు పెద్ద మట్టి కుండలు బయటపడగా అందులో వజ్రాలు, బంగారం ఉన్నట్లు విస్తృతంగా ప్రచారం జరుగుతుంది. దొరికిన బంగారం, వజ్రాలను తొలుత హైదరాబాద్‌లో అమ్మేందుకు ప్రయత్నించి అది విఫలం కావడంతో బెంగళూరులో అటవీశాఖ అధికారులు అమ్ముకున్నారని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే ఈ సమాచారం



గురించి అటవీశాఖ అధికారులను మీడియా వివరణ కోరేందుకు ప్రయత్నించగా అధికారులు స్పందించడం లేదు.వెలగలపాయ ఫారెస్ట్ బీట్ అధికారికి యర్రగొండపాలెంకు చెందిన కొందరు గుప్తనిధుల ముఠా సభ్యులు విచారణ సందర్భంగా ఇచ్చిన సమాచారం మేరకు ఈ తవ్వకాలు చేసినట్టు తెలిసింది? గిరిజన ట్రైబల్ వాచర్ల సాయంతో భారీగా తవ్వకాలు జరిపి గుప్తనిధుల కుండలు వెలికితీసి, ఆ సందర్భంగా తీసినట్టుగా చెబుతున్న ఓ వీడియో ప్రసార మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. ఈ లంకెబిందెల్లో బంగారం, వజ్రాలు ఉన్నట్లు చెప్పుకుంటున్నారు. ఈ సందర్భంలో అటవీ అధికారులు తీసుకున్న వీడియోలు, ఫోటోలు సోషల్ మీడియాలో కూడా స్వయంగా పోస్ట్ చేశారట. గుప్త నిధుల తవ్వకాల వ్యవహారం పోలీసులకు సమాచారం అందడంతో స్థానిక పోలీసులు విచారణ చేపట్టినట్టు తెలిసింది? పోలీసుల విచారణలో వాస్తవాలు వెలుగుచూసే అవకాశం ఉంది.

# గుంటూరులో భారీ అగ్నిప్రమాదం

## తగలబడిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పైపులు

గుంటూరు, మే 21: నగరంలోని ఇన్నర్ రింగ్ రోడ్డు సమీపంలో గురువారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ప్రకాష్ నగర్ 3వ లైన్ వద్ద రోడ్డు పక్కన నిల్వ ఉంచిన అండర్ డ్రైనేజ్ (భూగర్భ మురుగునీటి వ్యవస్థ) పైపులకు అకస్మాత్తుగా నిప్పు అంటుకుంది. ప్లాస్టిక్ పైపులు కావడంతో మంటలు క్షణాల్లో వ్యాపించి, ఆకాశాన్నంటుతూ భారీగా ఎగసిపడ్డాయి. దట్టమైన నల్లటి పొగలు కమ్ముకోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు.ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది వాహనాలతో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలను అదుపు చేసేందుకు సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఈ ప్రమాదానికి గల కారణాలు, ఆస్తి నష్టం వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# శ్రీవారిని దర్శించుకున్న మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

తిరుమల రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి కుటుంబ సమేతంగా శ్రీ తిరుమల వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. గురువారం ఉదయం స్వామివారి దర్శనం అనంతరం వేద పండితుల ఆశీర్వచనాలు స్వీకరించారు. ఆలయ అధికారులు మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి కుటుంబ సభ్యులకు తీర్థప్రసాదాలు అందజేసారు.

దర్శనం అనంతరం మంత్రి ఆనం మీడియాతో మాట్లాడుతూ హిందూ ధర్మానికి, సనాతన ఆచార వ్యవహారాలకు కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోంది. రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని స్వామివారిని ప్రార్థించానని అన్నారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుటుంబానికి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కుటుంబానికి స్వామివారి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నాం. రాష్ట్రంలో ధార్మిక చైతన్యం పెంపొందించే దిశగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోంది. తిరుమల శ్రీవారి కృప రాష్ట్ర ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

# నెంబర్ 2ల భేటీ వెనుక...

న్యూఢిల్లీ, మే 21, కేంద్ర ప్రభుత్వంలో నరేంద్ర మోడీ తర్వాత.. స్థానంలో ఉన్నారు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా. ఏపీలో కూడా చంద్రబాబు తర్వాత ఆ స్థాయిలో ఉన్నారు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్. ఏపీలో పవన్ కళ్యాణ్.. కేంద్రంలో అమిత్ షా ఇద్దరు కూడా అత్యంత శక్తివంతమైన నాయకులు. వీరిద్దరికి బలమైన నేపథ్యం ఉంది. అన్నింటికి మించి జాతీయ భావాలు పుష్కలంగా ఉన్నాయి. వీరిద్దరిది ఒకే మనస్తత్వం. శైలికూడా ఒకే విధంగా ఉంటుంది. దేశం ముఖ్యమా.. ప్రాణాలు ముఖ్యమా అంటే వీరిద్దరూ మొదటి దానికి ఓటు వేస్తారు.అంతటి జాతీయత భావాలు ఉన్న వీరిద్దరూ కలవడం ఏపీ రాజకీయాలలోనే కాదు, దేశ రాజకీయాలలో సంచలనంగా మారింది. ఇప్పుడున్న పరిస్థితుల్లో అమిత్ షా పెద్దగా ఎవరితో మాట్లాడటం లేదు. పైగా పశ్చిమ బెంగాల్లో సిలిగురి కారిడార్ లో చేపడుతున్న పనులపై నిత్యం సమీక్షలు చేస్తున్నారు.. ఈశాన్య రాష్ట్రాలపై ప్రధానంగా ఫోకస్ పెట్టారు. అలాంటి అమిత్ షా ఇప్పుడు పవన్ కళ్యాణ్ తో భేటీ అయ్యారు. పవన్ కళ్యాణ్ వెంట ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ కూడా ఉన్నారు. ఏకంగా 25 నిమిషాల పాటు చర్చ జరిగింది. అనేక అంశాలపై ఈ సమావేశంలో మాట్లాడారని తెలుస్తోంది. అమిత్ షా తో సమావేశం ముగిసిన తర్వాత పవన్ కళ్యాణ్ బయటకు వచ్చి నవ్వుతూ కనిపించారు. అద్భుతం మీటింగ్ అద్భుతంగా సాగిందని పేర్కొన్నారు.ఇప్పటికిప్పుడు అమిత్ షా, పవన్ కళ్యాణ్ భేటీ వెనుక అసలు ఉద్దేశం 2029 ఎన్నికల్లో ఏపీ రాష్ట్రంలో బిజెపి, జనసేన, టిడిపి కలిసి పోటీ చేయడమేనని బయటకు లీకులు ఇచ్చారు. ఎందుకంటే ఈ మూడు పార్టీలు కూటమిగా ఏర్పడి 2024 లో బంపర్ మెజారిటీతో విజయం సాధించాయి. వైసిపిని 11 స్థానాలకు పరిమితం చేశాయి. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఏపీలో అభివృద్ధి.. సంక్షేమం.. ప్రజల భద్రత.. రాజకీయంగా స్థిరత్వం వంటివి కొనసాగాలంటే ఈ మూడు పార్టీలు 2029 ఎన్నికల్లో కూడా కలిసి పోటీ చేయాలని పవన్ కళ్యాణ్ అమిత్ షా కు సూచనలు చేసినట్టు బయట చెప్పారు.. దీనికి అమిత్ షా కూడా ఒప్పుకున్నట్టు సమాచారం. 2024 లో కూడా కూటమి ప్రభుత్వం ఏర్పడేందుకు.. దానికంటే ముందు జనసేన, టిడిపి, బిజెపి పార్టీలు కలిసి పోటీ చేసేందుకు పవన్ కళ్యాణ్ చొరవ చూపించారు. బిజెపి పెద్దలతో మాట్లాడారు. పొత్తు కుదిరేలా చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేశారు. అందువల్ల ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగలిగింది. అయితే ఇప్పుడు కూడా ఏపీలో కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి.. వైసిపిని అధికారానికి దూరంగా ఉంచాలని పవన్ కళ్యాణ్ భావిస్తున్నారు. అందువల్లే ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ బిజెపి పెద్దలతో అసలు విషయం చెప్పేస్తున్నారు. పవన్ కళ్యాణ్ మాటను బిజెపి పెద్దలు కూడా కాదనలేకపోతున్నారు. ఆయన చెప్పిన దానికి ఓకే అంటున్నారు. అయితే పవన్ కళ్యాణ్ గురువారం కూడా ఢిల్లీలోనే ఉంటారు. ఎన్డీఏ ప్రభుత్వంలోని కీలక మంత్రులను.. ఇంకా కొంతమంది పెద్ద వ్యక్తులను కలిసే అవకాశం ఉంది.అయితే అమిత్ షాతో పవన్ భేటి వెనుక బీజేపీ, జనసేన లీకులు అన్నీ టీడీపీకి అనుకూలంగానే ఉన్నాయి. మూడు పార్టీలు కలిసినడిచేటట్టుగానే ఉన్నాయి. అయితే మన తెలుగులో ప్రొఫెసర్ నాగేశ్వర్ లాంటి వారు దీనిపై కోడిగుడ్డుపై ఈకలు పీకిన చందంగా కొత్త లాజిక్ వెతుకుతున్నారు.. జగన్ ను కేంద్రంలోని బీజేపీ అరెస్ట్ చేస్తే ఖాళీ అయ్యే ఆ స్థానంలో జనసేనను ప్రతిపక్షంగా పెట్టొచ్చని.. లేదంటే బీజేపీతో కలిసి జనసేన సపరేట్ గా పోటీచేసినా గెలవచ్చొని.. ఈ రెండూ కాదంటే పవనే బీజేపీలో చేరి లీడ్ చేయవచ్చని నాగేశ్వర్ లాంటి మేధావులు ఇప్పటికే సోషల్ మీడియాలో పుంఖాను పుంఖాలుగా వార్తలు , వీడియోలు పరిచేస్తున్నారు.అయితే లోగొట్టు పెరుమాళ్లకెరుక అన్నట్టు.. కేంద్ర హోంమంత్రి బీజేపీలో నంబర్ 2 అయిన అమిత్ షా ఆ గుట్టు విప్పరు.. జనసేనాని పవన్ బయటకు చెప్పరు? ఏం జరిగింది? భవిష్యత్తులో ఏం జరుగబోతోందన్నది వారిద్దరికే తెలుసు. కానీ బయట మాత్రం కొందరు కూటమిలో ఈ భేటి ద్వారా బాగానే పుల్లలు పెట్టే ప్లాన్లు చేస్తున్నారు. ఏపీ రాజకీయాల్లో ఈ భేటి ప్రభావం ఎంతనేది భవిష్యత్తులోనే తేలనుంది..

# ఇండియాలో 4 శాతమే పెరుగుదల...

న్యూఢిల్లీ, మే 21, పశ్చిమాసియా యుద్ధంతో ప్రపంచ వ్యాప్తంగా చమురు సంక్షోభం నెలకొంది. హర్మూజ్ మూసివేతతో గల్ఫ్ నుంచి యురోపియన్ యూనియన్‌తోపాటు ఆసియాలోని వివిధ దేశాలకు ఇంధన సరఫరా ఆగిపోయింది. దీంతో చాలా దేశాలు ఇబ్బంది పడుతున్నాయి. అయితే ఇరాన్ శత్రు దేశాలు మినహా మిగతా ఓడలు వెళ్లడానికి అనుమతి ఇచ్చింది. అయితే హర్మూజ్‌లో ట్రాఫిక్ కారణంగా నౌకల ప్రయాణం క్లిష్టంగా మారింది. దీంతో చాలా దేశాలు చమురు ధరలు పెంచాయి. యుద్ధం ప్రారంభమైన రెండు నెలల తర్వాత భారత్ కూడా ఇంధన ధరలు పెంచింది. దీనిపై విపక్షాలు గగ్గోలు పెడుతున్నాయి.ఈ ఏడాది ఫిబ్రవరి 23 నుంచి మే 15 వరకు లీటర్ పెట్రోల్‌పై మయన్మార్ 89.7% వరకూ, లీటర్?డీజిల్‌పై 112.7% వరకూ ధరలు పెంచింది. ప్రపంచంలో ఇదే అత్యధిక పెంపు. ఇది గ్లోబల్ సరఫరాచైన్ కల్తీ, స్థానిక పాలనా వ్యవహారాలు లేదా కరెన్సీ సంక్షోభాల సంక్లిష్ట క్రియాచక్రాల ఫలితం కావచ్చు. చిన్న మార్కెట్లలో ఈ రకమైన భారీ ఒత్తిడి వాళ్ల ఆర్థిక వ్యవస్థలను నేలమాట చేస్తుంది. ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులు దూకుడు, సరుకుల ధరలు అనూహ్యంగా పెరగటం, సాధ్యమైన సామాజిక అసంతృప్తికి కారణమవుతుంది.మన దాయాది దేశం పాకిస్తాన్‌లో పెట్రోల్ ధరలు 54.9 శాతం, డీజిల్ ధరలు 44.9 శాతం పెరిగాయి. మయన్మార్ తర్వాత పాకిస్తాన్‌లోనే గరిష్టంగా పెరిగింది. ఇక యూఏఈలో 52.4% (పెట్రోల్), 86.1% (డీజిల్) పెంపు, సాధారణంగా ఆయా దేశాల్లోని సబ్సిడీ తగ్గింపు లేదా గ్లోబల్ పెట్రోల్ వాహక ధరల ప్రభావం సూచిస్తుంది. అమెరికా వంటి పెద్ద మార్కెట్లలో పెట్రోల్ 44.5%, డీజిల్ 48.1% పెరగడం అనేది అంతర్జాతీయ పరిస్థితులకు అద్దం పడుతోంది.

చైనా, ఫ్రాన్స్ నుంచి మధ్యంతర స్థాయిల వరకు

చైనా (పెట్రోల్ 21.7%, డీజిల్ 23.7%), ఫ్రాన్స్ (పెట్రోల్ 20.9%, డీజిల్ 31%)లో మధ్యస్థాయిలో పెరగడం, వీరు ప్రపంచ ఆర్థిక సంక్షోభాల బరువును కొంత మినహాయించుకుని ఉన్నప్పటికీ ఇంకొంచెం బాధ్యత హామీలా ఉంటుందని చూపిస్తుంది. ఇవి ఉత్పత్తి కనెక్టెడ్ డిమాండ్ మార్పులు, సంచార విధానాల తాత్కాలిక అనీయతలతో కూడా రెట్టింపు కాదు.భారతంలో పెట్రోల్ ధర 4.2%, డీజిల్ 4.4% తక్కువగా కనిపిస్తుంది. ప్రభుత్వ సబ్సిడీలు లేదా పండిత కార్డుల ద్వారా ధరల నియంత్రణ కొనసాగడం. పౌర వాహనుల పై మోతాదులో డిమాండ్ పెరుగుదల కాకపోవడం లేదా స్థానిక మద్దతు విధానాలు.లేదా కరెన్సీ వాల్యూమ్స్, పర్ధిత రిఫైనరీ అవుట్‌పుట్ పరిస్థితులు తాత్కాలికంగా భారత ధరలను వశీకరించినట్లె ఉంటుంది. ఈ పరిమిత పెంపు అన్ని సందర్భాలలో ప్రజలకి ఉపశమనం ఇవ్వవచ్చు. కానీ అది దీర్ఘకాలంలో ఖర్చును ప్రభుత్వ బడ్జెట్‌పై హెల్త్ చేసిన రీతిలోకి తీసుకెళ్తుంది. సబ్సిడీలు ఎక్కువసార్లు సంక్షేమ లక్ష్యాలను వేసుకున్నా, సమర్ధవంతమైన వినియోగాన్ని ప్రోత్సాహించే లేదా వనరుల దుర్వినియోగానికి దారితీస్తుంది.

## కోదాడలో మితిమీరుతున్న పోకిరీల ఆగడాలు

సూర్యాపేట కోదాడ పట్టణ ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో కూలీ పనులకు వెళ్తున్న అమాయక వ్యక్తులపై పోకిరీలు దాడి చేసారు. ట్రాక్టర్ను అడ్డంగా కటింగ్ కొడుతూ, రాష్ డ్రైవింగ్ చేసినందుకు పోకిరీలను ప్రశ్నించిన కూలీలు, ప్రశ్నించినందుకు వారిపై దాడి చేసారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## హైదరాబాద్లో మైనర్ బాలికపై గ్యాంగ్ రేప్

హైదరాబాద్ దుండిగల్ లో ఒక మైనర్ బాలికపై గ్యాంగ్ రేప్ జరిగింది. నిందితులు వీడియోలు తీసి పలుమార్లు బాలికను బ్లాక్మెయిల్ చేసారు. దుండిగల్ ప్రాంతంలో డబుల్ బెడ్ రూం ఇండ్ల సమీపంలోని ఓ షామియానా దుకాణంలో పనిచేస్తూ రోజూ అటు వైపు నుండి వెళ్తున్న బాలికపై శివకుమార్ అలియాస్ మట్టు(20) అనే యువకుడు కన్నేసాడు. ఒకరోజు బాలిక ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయం చూసి ఆమెపై అత్యాచారానికి పాల్పడి, ఎవరికైనా చెప్తే చంపేస్తానని బెదిరించాడు. బాలిక మౌనంగా ఉండడాన్ని అదునుగా చేసుకుని తన స్నేహితుడు నిజాంపేట రాము(30)తో కలిసి బాలికపై అత్యాచారానికి పాల్పడి, ఫొటోలు వీడియోలు తీసి, ఎప్పుడు పిలిస్తే అప్పుడు రావాలని బెదిరించాడు. దీంతో నిందితుల నుండి వరుస వేదింపులు తాళలేక తల్లిదండ్రులకు బాలిక జరిగిన దుర్ఘటన గురించి వివరించింది. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి నిందితులను రిమాండుకు తరలించారు.

# ఇక రణమే.... భగీరధ్ చిచ్చు...

హైదరాబాద్, మే 21, తెలంగాణలో మూడు ప్రధాన పార్టీలున్నాయి. అయితే బీజేపీ ? బీఆర్ఎస్ ఒక్కటేనని అధికార కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచీ ఆరోపిస్తూ వస్తోంది. ఆ రెండు పార్టీల మధ్య తెరవెనుక పొత్తు ఉందని చెప్తూ వచ్చింది. అయితే ఇప్పుడు అలాంటి ఊహాగానాలకు తెరపడింది. బండి భగీరథ్ కేసు వ్యవహారం ఆ రెండు పార్టీల మధ్య గ్యాప్ పెంచేసింది. భగీరథ్‌పై నమోదైన కేసు, ఆ తర్వాత చోటుచేసుకున్న పరిణామాలు రాష్ట్రంలో పొత్తుల సమీకరణాలను మార్చేసినట్లు అర్థమవుతోంది. ఢిల్లీ పెద్దలపై ఈగ వాలనివ్వకుండా కేవలం రాష్ట్ర స్థాయి నేతలనే టార్గెట్ చేస్తూ వస్తున్న గులాబీ బాసులు.. ఒక్కసారిగా రూట్ మార్చారు. తాజా పరిణామాలతో తెలంగాణ పీఠం కోసం పక్కాగా త్రిముఖ పోరు ఖాయమనే విషయం స్పష్టమైంది.బండి భగీరథ్ ఉదంతాన్ని ఒక సాధారణ లీగల్ ఇష్యూగా వదిలేయడానికి బీఆర్ఎస్ అస్సలు సిద్ధపడలేదు. దొరికిన అస్త్రాన్ని పదునుపెట్టి కమలనాథుల గుండెల్లో దింపింది. బండి సంజయ్‌ను కేంద్ర మంత్రిమండలి నుంచి బర్తరఫ్ చేయాలంటూ స్వయంగా కేటీఆర్ రంగంలోకి దిగడం, రాష్ట్రవ్యాప్తంగా గులాబీ కేడర్ రోడ్లపైకి వచ్చి నిరసనలతో హోరెత్తించడం చూసి బీజేపీ మైండ్ బ్లాంక్ అయింది. తమతో సయోధ్య, గియోధ్య లాంటి ముచ్చట్లేవీ లేవని, అవకాశం దొరికితే చట్టపరమైన ఉచ్చులతో రాజకీయ సమాధి కట్టడానికి బీఆర్ఎస్ ఎంతకైనా తెగిస్తుందనే చేదు నిజం ఢిల్లీ పెద్దలకు ఈ దెబ్బతో అర్థమైంది.ఈ దెబ్బతో బీజేపీ అధిష్టానం తన సాఫ్ట్ కార్నర్ వ్యూహాన్ని చెత్తబుట్టలో పారేసింది. ఇప్పటివరకు బీఆర్ఎస్ పట్ల ప్రదర్శిస్తూ వచ్చిన వ్యూహాత్మక నిశ్శబ్దాన్ని బద్దలు కొట్టాలని ఢిల్లీ బాసులు డిసైడ్ అయ్యారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన చారిత్రాత్మక విజయంతో ఫుల్ జోష్‌లో ఉన్న కమలదళం.. తన నెక్స్ట్ మెయిన్ టార్గెట్‌గా తెలంగాణను ఫిక్స్ చేసినట్లు తెలుస్తోంది. బెంగాల్ తరహాలోనే ఇక్కడ కూడా ప్రత్యర్థులను తుడిచిపెట్టే అగ్రెసివ్ పాలిటిక్స్‌కు తెరలేపింది. బీఆర్ఎస్ వేసిన రివర్స్ గేర్ కమలనాథులను మరింత రెచ్చగొట్టడంతో.. ఇక గులాబీ పార్టీని క్షేత్రస్థాయిలో నామరూపాలు లేకుండా చేయడమే ఏకైక ఎజెండాగా బీజేపీ తన అసలైన రాజకీయ వేట ప్రారంభించ బోతున్నట్లు సమాచారం. బండి భగీరథ్ పోక్సో కేసు సెగలు కాస్త చల్లబడటమే ఆలస్యం.. బీఆర్ఎస్ పై బీజేపీ ప్లాన్ అమలు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.మొత్తానికి బండి భగీరథ కేసు కేవలం ఒక వ్యక్తిగత వివాదంగా మిగిలి పోలేదు.తెలంగాణ భవిష్యత్తు పొత్తుల పటాన్ని, పొలిటికల్ రూట్ మ్యాప్‌ను మార్చేసిన ఒక బిగ్గెస్ట్ టర్నింగ్ పాయింట్‌గా నిలిచింది. ఇకపై ఎలాంటి లోపాయికారీ పొత్తులకు ఛాన్స్ ఉండకపోవచ్చు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒంటరిగానే రణరంగంలోకి దూకడం పక్కాగా కనిపిస్తోంది.

# బీజేపీ అస్త్రం... ఎస్ ఐ ఆర్

హైదరాబాద్, మే 21, తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య సరికొత్త వ్యూహాత్మక యుద్ధం మొదలైంది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం జూన్ 25 నుంచి జులై 24 వరకు రాష్ట్రంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ కొనసాగనుంది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం, మరణించిన వారి వివరాలను తొలగించడం, ఒకే పేరుతో రెండు చోట్ల ఉన్న నకిలీ ఓట్లను ఏరివేయడమే ఈ ఇంటింటి ఓటర్ల సర్వే ముఖ్య ఉద్దేశం. అయితే, ఈ ప్రభుత్వ అధికారిక ప్రక్రియను ఒక అద్భుతమైన రాజకీయ అవకాశంగా మార్చుకునేందుకు భారతీయ జనతా పార్టీ సర్వసన్నద్ధమైంది. గతంలో పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో అత్యంత విజయవంతమైన ఫలితాలను ఇచ్చిన మైక్రో-లెవెల్ మేనేజ్‌మెంట్ ఫార్ములాను ఇప్పుడు తెలంగాణలోనూ అమలు చేసేందుకు కమలనాథులు పక్కా స్కెచ్ వేశారు.ఎస్ఐఆర్ ప్రక్రియను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బీజేపీ అధిష్టానం, రాష్ట్రంలోని జిల్లాలను ఆరు జోన్లుగా విభజించింది. ఎన్నికల నిర్వహణ, సమన్వయాన్ని సులభతరం చేసేందుకు ఒక్కో జోన్ పరిధిలోకి దాదాపు 7 జిల్లాలు వచ్చేలా ప్లాన్ చేశారు. పార్టీలోని కీలక నేతలకు ఒక్కొక్కరికి 7 జిల్లాల చొప్పున పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించారు. కేవలం పైస్థాయి ప్రకటనలకే పరిమితం కాకుండా, ప్రతి ఒక్క కార్యకర్త క్షేత్రస్థాయిలోకి వెళ్లాలని స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి.ప్రభుత్వ బూత్ లెవెల్ అధికారులు ఇళ్లకు వెళ్ళినప్పుడు, వారితో పాటు బీజేపీ బూత్ లెవెల్ ఏజెంట్స్ కూడా ప్రతి ఇంటినీ సందర్శించనున్నారు. ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి.. అందులో పార్టీ మద్దతుదారులు ఎవరున్నారు, తటస్థంగా ఉన్న ఓటర్లు ఎవరు అనే అంశాలపై స్పష్టమైన మార్కింగ్ చేయనున్నారు. దీని ద్వారా ఏ బూత్‌లో పార్టీ బలం ఎంత ఉందనేదానిపై ఒక కచ్చితమైన అంచనాకు రానున్నారు. ముఖ్యంగా మరణించిన వారి ఓట్లతో పాటు, చొరబాటుదారుల ఓట్లను తొలగించడంపైనే తాము ప్రధానంగా ఫోకస్ పెట్టినట్లు బీజేపీ స్పష్టం చేస్తోంది.బీజేపీ ఎంచుకున్న ఈ క్షేత్రస్థాయి వ్యూహం తెలంగాణ అధికార పార్టీ కాంగ్రెస్తో పాటు, ప్రతిపక్ష బీఆర్ఎస్‌లోనూ తీవ్ర కలకలం రేపుతోంది. కాషాయదళం ప్రభుత్వ వ్యవస్థను దుర్వినియోగం చేస్తూ.. పథకం ప్రకారం తమ మద్దతుదారుల ఓట్లను అక్రమంగా తొలగించే ప్రయత్నం చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఆరోపిస్తున్నారు. బీజేపీ మైక్రో-ప్లాన్‌ను తిప్పికొట్టేందుకు ఈ రెండు పార్టీలు కూడా తమ బూత్ లెవెల్ కార్యకర్తలను అప్రమత్తం చేసి, ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. జూన్ 25 నుంచి క్షేత్రస్థాయిలో మూడు పార్టీల కార్యకర్తల మధ్య ఓటర్ల సర్వే వేదికగా గట్టి ఘర్షణ వాతావరణం నెలకొనే అవకాశం కనిపిస్తోంది.ఈ ఏడాది చివరిలో జరగబోయే ఉఊఓఅ ఎన్నికలపై ఈ సర్వే ప్రభావం ఎలా ఉండబోతోందనే ప్రశ్నే ఇప్పుడు ప్రధాన పార్టీలను తొలిచేస్తోంది. హైదరాబాద్ మున్సిపల్ పరిధిలో స్థానిక జనాభాతో పాటు వలస వచ్చిన వారి సంఖ్య చాలా ఎక్కువ. ఎస్ఐఆర్ ద్వారా సేకరించే డేటాను విశ్లేషించి, ఏయే డివిజన్లలో ఏ వర్గాల ఓటర్లు బలంగా ఉన్నారో ముందే గుర్తించడం ద్వారా అభ్యర్థుల ఎంపికను వేగవంతం చేయాలని బీజేపీ భావిస్తోంది.ఎస్ఐఆర్ ను స్థానిక పరిస్థితులకు అనుగుణంగా మార్చుకుంటూ, అటు సంక్షేమంపై అధికార కాంగ్రెస్‌ను నిలదీస్తూనే, ఇటు క్షేత్రస్థాయి సమీకరణాలను తనకు అనుకూలంగా మార్చుకోవాలని బీజేపీ గట్టి పట్టుదలతో ఉంది. జూన్ 25 నుంచి నెల రోజుల పాటు సాగనున్న ఈ 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' ప్రక్రియ పూర్తయ్యాక, గ్రేటర్ మున్సిపల్ రాజకీయం ఏ మలుపు తిరుగుతుందో చూడాలి.

# తెలంగాణలో నకిలీ క్లినిక్ లు

## అనుభవమే అర్హతగా అల్లోపతి వైద్యం.

హైదరాబాద్, మే 21, సరైన వైద్య పట్టా లేకుండా, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న నకిలీ మున్నాభాయ్‌లపై చర్యలు తీసుకోవడంలో వైద్య ఆరోగ్యశాఖ నిర్లక్ష్యం వహిస్తోంది. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 600 ఎఫ్ఐఆర్‌లు నమోదైనప్పటికీ, తదుపరి కార్యాచరణ ముందుకు సాగకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న క్లినిక్‌లపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ( తనిఖీలు చేసి కేసులు నమోదు చేస్తున్నా, ఉన్నతాధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.
తెలంగాణ మెడికల్ కౌన్సిల్ నిర్వహించిన తనిఖీల్లో విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి.

**మొత్తం తనిఖీ చేసిన క్లినిక్‌లు: 1200**

**నకిలీవిగా తేలిన క్లినిక్‌లు: 800**

**నమోదైన ఎఫ్ఐఆర్‌లు: 600**

హైదరాబాద్ వాటా: నకిలీ వైద్యుల్లో 80 శాతం మంది ఒక్క గ్రేటర్ హైదరాబాద్‌లోనే ఉండటం గమనార్హం. ఒక్క హైదరాబాద్ జిల్లాలోనే 200లకు పైగా కేసులు నమోదైనా, చర్యలు శూన్యం కావడంతో టీజీఎంసీ ఇప్పుడు హైకోర్టులో పిల్ వేసేందుకు సిద్ధమవుతోంది. మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లోనూ నకిలీ క్లినిక్‌లు భారీగా వెలిశాయి.కొందరు ఆసుపత్రుల్లో సహాయకులుగా పనిచేసి, ఆ అనుభవంతో ఏకంగా క్లినిక్‌లు నడుపుతుండగా.. మరికొందరు హోమియోపతి చదివి అల్లోపతి వైద్యం చేస్తున్నారు. ఇంకొందరు ఆర్ఎంపీలుగా పనిచేస్తూ ఏకంగా 10-15 పడకల ఆసుపత్రులనే నిర్వహిస్తున్నట్లు తనిఖీల్లో తేలింది. వీరు అవసరం లేకున్నా అధిక మోతాదులో యాంటీబయోటిక్స్, పెయిన్ కిల్లర్స్, స్టెరాయిడ్స్ వంటి మందులు ఇస్తూ రోగుల మూత్రపిండాలు, ఇతర అవయవాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నారు.తెలంగాణ మెడికల్ ప్రాక్టీషనర్స్ రిజిస్ట్రేషన్ చట్టం , నేషనల్ మెడికల్ కమిషన్ చట్టం సెక్షన్లు 34, 35 ప్రకారం నకిలీ వైద్యులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. పోలీసుల సహకారంతో క్లినిక్‌లను సీజ్ చేసే అధికారం ఉన్నా, క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. అధికారులు తనిఖీలు చేసినప్పుడు క్లినిక్‌లు మూసివేసి, కొద్దిరోజుల తర్వాత మరో పేరుతో మళ్లీ దందాను మొదలుపెడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. ప్రజల ప్రాణాలను పణంగా పెడుతున్న ఈ నకిలీ వైద్యులపై తక్షణమే ఉక్కుపాదం మోపాలని వైద్య నిపుణులు డిమాండ్ చేస్తున్నారు.

# శబరిమలలో అక్రమాల చిట్టా...

## హైకోర్టు నివేదికలో విస్తుపోయే నిజాలు



తిరువనంతపురం మే 21, దేవుడిని కొంతమంది నమ్ముతారు. ఇంకొంతమంది నమ్మరు. అయినంత మాత్రాన నమ్మేవారు పిచ్చివాళ్లు కాదు. నమ్మని వాళ్లు గొప్ప వాళ్ళు కాదు. ఎవరి నమ్మకం వాళ్ళది. కానీ కమ్యూనిస్టులు ఇలా కాదు. ఊరంతా ఒకదారిలో వెళ్తుంటే.. వారు మరొక దారిలో వెళ్తుంటారు. పైగా తమ దారిలోని రావాలని ఉపన్యాసాలిస్తుంటారు. చివరికి తమ దారి గురించి గొప్పగా చెప్పి.. మిగతావారు వెళ్లే దారి గురించి అసత్య ప్రచారం చేస్తుంటారు. అందువల్లే కమ్యూనిస్టులు ఇప్పుడు మనదేశంలో ఏ రాష్ట్రానికి కూడా ప్రాతినిధ్యం వహించడం లేదుకమ్యూనిస్టులు నిన్నటిదాకా పరిపాలించిన కేరళ రాష్ట్రంలో జరిగిన దారుణాలు మామూలువి కావు. భూముల ఆక్రమణ నుంచి మొదలుపెడితే.. శబరిమల ఆలయంలో జరిగిన అక్రమాల వరకు.. ఎన్నో ఉదంతాలు కేరళ రాష్ట్రంలో చోటుచేసుకొన్నాయి. అప్పట్లో శబరిమల ఆలయంలో మహిళలకు ఎందుకు ప్రవేశం కల్పించారు అంటూ జరిగిన ఉద్యమానికి కేరళ ప్రభుత్వం పరోక్షంగా సహకరించిందని ఇప్పటికి ఆరోపణలు వినిపిస్తూనే ఉంటాయి.. పైగా శబరిమల ఆలయానికి సంబంధించిన ప్రాశస్త్యాన్ని దెబ్బ తీశారని విమర్శలు ఉన్నాయి. పైగా ఆలయంలో బంగారు తాపడంలో కూడా అక్రమాలు చోటు చేసుకున్నాయని కేసులు నమోదయ్యాయి. తాజాగా శబరిమల ఆలయానికి సంబంధించిన ఒక అంశం ఇప్పుడు తెరపైకి వచ్చింది. సరిగ్గా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసిన మరుసటి రోజు ఈ వ్యవహారం వెలుగులోకి రావడం గమనార్హం.శబరిమల ఆలయాన్ని హిందువులు ఎక్కువగా దర్శించుకుంటూ ఉంటారు. కార్తీక మాసంలో అయ్యప్ప మాలధారులు స్వామివారిని దర్శించుకుంటారు. ఈ సమయంలో అయ్యప్ప క్షేత్రం భక్తులతో కిటికీటలాడుతూ ఉంటుంది. సన్నిధానం అయ్యప్ప మాలధారుల సంద్రంగా కనిపిస్తూ ఉంటుంది. అయ్యప్పకు ప్రతిరోజు విశేషమైన పూజలు జరుగుతూ ఉంటాయి. అయితే ఈ పూజలు సక్రమంగా జరిగితే బాగుండేది. గడచిన దశాబ్ద కాలంగా అయ్యప్ప స్వామికి జరిపే పూజలు విషయంలో అక్రమాలు చోటుచేసుకున్నాయి.ఇదే విషయాన్ని కేరళ హైకోర్టు ప్రస్తావించింది. అంతేకాదు పూజలపై ఆడిట్ నిర్వహించాలని సూచించింది. అయ్యప్ప స్వామికి సంబంధించిన పూజా సామాగ్రి కొనుగోలు విషయంలో కూడా అవ్వక తవకలు జరిగినట్టు హైకోర్టు పేర్కొంది. శబరిమల స్పెషల్ కమిషనర్ సమర్పించిన నివేదిక ఆధారంగా హైకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది.అయ్యప్ప స్వామికి నిర్వహించే పూజలలో అక్రమాలు జరుగుతున్నట్టు ఇటీవల ఓ భక్తుడు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు ఆధారంగా విజిలెన్స్ విభాగం దర్యాప్తు మొదలుపెట్టింది. అతడు చెప్పిన విషయాల మొత్తం నిజమని విజిలెన్స్ విభాగం అభిప్రాయపడింది. ముఖ్యంగా స్వామి వారికి సంబంధించిన అష్టాభిషేకం పూజ కోసం లేత కొబ్బరికాయల పాలవినియోగంలో అక్రమాలు చోటు చేసుకున్నట్టు.. ఇంకా 8 వస్తువులకు 300 రూపాయల దాకా వసూలు చేసినట్టు విజిలెన్స్ విభాగం ఎంక్వయిరీలో తేలింది.దశాబ్దకాలంగా ఎటువంటి బిల్లులు లేకుండానే వీటిని కొనుగోలు చేశారని హైకోర్టు అభిప్రాయపడింది. మాస పూజ, మకర విలక్కు పూజల్లో కూడా అక్రమాలు జరిగాయి. అయితే ఇవన్నీ కూడా కమ్యూనిస్టుల పరిపాలన కాలంలో జరగడం ఇక్కడ విశేషం. ఇప్పటికే బంగారం తాపడంలో అక్రమాలు జరిగి.. కొంతమంది జైలు పాలు కూడా అయ్యారు. ఇప్పుడు హైకోర్టు స్వయంగా రంగంలోకి దిగడంతో ఎంతమంది జైలుకు వెళ్తారనే చర్చ కేరళ రాష్ట్రంలో సాగుతోంది.

# డీట్ యాప్ తో ఉద్యోగాలు

హైదరాబాద్, మే 21, ప్రైవేటు , కార్పొరేట్ కంపెనీలలో ఉద్యోగాలు పొందాలనుకునే యువతకు తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన డీట్ యాప్ ఒక వరంలా మారింది.
డిగ్రీ, ఇంజినీరింగ్ పూర్తి చేసిన వారితో పాటు చివరి ఏడాది చదువుతున్న విద్యార్థులకు కూడా ఈ యాప్ ద్వారా ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని పేరు, విద్యార్హతలు నమోదు చేసుకుంటే, అభ్యర్థుల అర్హతలకు అనుగుణంగా ఇంటర్వ్యూల సమాచారం నేరుగా అందుతుంది.
డీట్ సాధించిన విజయాలు..
నిరుద్యోగులకు , సంస్థలకు మధ్య వంతెనగా నిలుస్తున్న ఈ యాప్ ద్వారా ఇప్పటివరకు,
40,472 మంది అభ్యర్థులు యాప్‌లో పేర్లను నమోదు చేసుకున్నారు.
22,244 మంది జాబ్ మేళాలకు హాజరయ్యారు.
11,271 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు షార్ట్ లిస్ట్ అయ్యారు.
అవగాహన , శిక్షణ..
హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో డీట్ యాప్‌పై నిరుద్యోగులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. కేవలం ఉద్యోగ సమాచారమే కాకుండా, కంపెనీలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకునే కోర్సుల వివరాలను కూడా డీట్ అధికారులు అందజేస్తున్నారు. మూడు జిల్లాల్లో ఆరు నెలల వ్యవధిలోనే సుమారు 2 వేల మందికి వివిధ స్థాయిల్లో ఉద్యోగాలు లభించడం విశేషంప్రభుత్వ, ప్రైవేటు , స్వచ్ఛంద సంస్థలు నిర్వహించే జాబ్ మేళాలకు డీట్ అధికారులు పూర్తి సహకారం అందిస్తున్నారు. అర్హులైన అభ్యర్థులకు ఇంటర్న్‌షిప్‌లు కూడా ఇప్పిస్తున్నామని డీట్ సంచాలకులు జె. రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. ప్రజా పాలన ? ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 1 నుండి 12 వరకు నిర్వహించిన జాబ్ మేళాలకు వందలాది మంది అభ్యర్థులు హాజరై తమ వివరాలను నమోదు చేసుకున్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

# బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ

## ''ఇదే చంద్రబాబు రెండేళ్ల పరిపాలన ప్రోగ్రెస్

తాడేపల్లి ఏపీలో ప్రజలు తమ అభిప్రాయలు స్వేచ్ఛగా చెప్పే పరిస్థితి లేదు. సోషల్ మీడియాలో ఆధారాలతో సహా పోస్టు చేస్తే నోటీసులు ఇస్తున్నారని మాజీ ముఖ్యమంత్రి, వైకాపా అధినేత వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆరోపించారు. గురువారం అయన మీడియాతో మాట్లాడారు.
జగన్ మాట్లాడుతూ అమరావతి, హెరిటేజ్-ఇందాపూర్ బంధం, మహిళలపై అఘాయిత్యాలపై పోస్టులు పెడితే డిలీట్ చేయాలని నోటీసులు ఇస్తున్నారు. సోషల్ మీడియా పోస్టులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయించి, సోషల్ మీడియా హెడ్ ఆఫీసులకు పంపించి డిలీట్ చేయాలని బెదిరింపులకు గురి చేస్తున్నారని అన్నారు.
రెండేళ్ల చంద్రబాబు పరిపాలన '' బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ ''ఇదే చంద్రబాబు రెండేళ్ల పరిపాలన ప్రోగ్రెస్. మావిగన్ అనే పేరు వింటేనే చంద్రబాబు బీపీ పెరిగి గుండె ఆగినంత పని అవుతుంది. మీ మీడియా వాళ్లు కూడా ఎప్పుడైనా మావిగన్ గురించి అడగండి, ఆయన గుండె ఆగకపోతే అదృష్టమని అన్నారు.
చంద్రబాబు బావమరిది బాలకృష్ణ గన్తో ఇద్దరిని కాల్చిపడేయలేదా..? ఆ తరువాత సాక్షులు ఉండకూడదని వాచ్మెన్ను బండచితో కొట్టి చంపలేదా..? మరి ఎవరిది గన్ కల్చర్ చంద్రబాబూ అని ప్రశ్నించారు.
చంద్రబాబు ఎవరిది గొడ్డలి పార్టీ..? ఎవరిది గన్ కల్చర్..? చంద్రబాబు అధికారంలో ఉండగానే నా తాత రాజారెడ్డిని చంపేశారు. మా నాన్నను అసెంబ్లీకి ఎలా వస్తావో చూస్తానని చంద్రబాబు అన్న రెండు మూడు రోజులకే హెలికాప్టర్ ప్రమాదం జరిగింది. మా తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మరణంపై ఇంకా నివృత్తి కాని అంశాలున్నాయి. మా చిన్నాన్న వైఎస్ వివేకానందరెడ్డి హత్య చంద్రబాబు అధికారంలో ఉండగానే జరిగింది. చంపినవాడు దస్తగిరి దర్జాగా కారులో తిరుగుతున్నాడని ఆరోపించారు.
జగన్ మంచోడు కాబట్టే మా తాత రాజారెడ్డిని నరికి చంపిన వారు ఈరోజుకు కూడా ప్రశాంతంగా ఉన్నారు. జగన్ చెడ్డవాడు అయ్యి ఉంటే వాళ్లంతా బతికి ఉండేవాళ్లా..? జగన్ నైజం ఎలాంటిది.. జగన్ మనస్తత్వం ఎలాంటిది అనేందుకు నిదర్శనం అది అని అన్నారు.

# చికెన్ నెక్ కు ఎందుకంత ప్రియారటీ



కోల్ కత్తా, మే 21, (న్యూస్ పల్స్)బెంగాల్ రాష్ట్రంలో మమతా బెనర్జీ అధికారంలోకి రాలేదు. 15 సంవత్సరాల పరిపాలించిన ఆమెను బెంగాల్ ప్రజలు తరిమి తరిమి కొట్టారు. చివరికి ఆమె పోటీ చేసిన భవానిపూర్లో ఓడించారు. బిజెపికి పట్టం కట్టారు. దీంతో బెంగాల్ రాష్ట్రంలో పరిణామాలు వేగంగా మారిపోతున్నాయి.దేశ భద్రతకు సంబంధించి కీలక నిర్ణయాలు వెంట వెంటనే అమలవుతున్నాయి. బెంగాల్ రాష్ట్రంలో అత్యంత కీలకమైన చికెన్ నెక్ రహదారి మీద ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ప్రధానంగా దృష్టి సారించారు. దృష్టి సారించడం మాత్రమే కాదు.. ఆ రోడ్డులో కనివిని ఎరుగని స్థాయిలో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ప్రభుత్వం 120 ఎకరాల భూమిని అప్పగించడమే ఆలస్యం.. పనులు మొదలైపోయాయి. దీంతో నాలుగు దేశాల్లో గుబులు మొదలైంది. చైనా ఇప్పటికే అక్కడ ఏం జరుగుతుందో చూస్తోంది. భూటాన్ జాగ్రత్తగా ఉంటోంది. బంగ్లాదేశ్ ఎప్పటికప్పుడు సమాజాన్ని సేకరిస్తుంది. నేపాల్ తన జాగ్రత్తలో తను ఉంటోంది. నిజానికి 22 కిలోమీటర్ల వెడల్పు ఉన్న ఈ రోడ్డు ఎందుకు అంత ప్రత్యేకం.. ఏకంగా నాలుగు దేశాలు ఎందుకు అలా అప్రమత్తమయ్యాయి.. ఈ ప్రశ్నల వెనక పెద్ద స్టోరీ ఉంది..మనదేశంలో ఏడు ఈశాన్య రాష్ట్రాలను కలపడానికి అత్యంత ప్రధానమైన మార్గం చికెన్ నెక్ రహదారి. ఇది కేవలం ఒక రోడ్డు మాత్రమే కాదు.. మన దేశ అంతర్గత భద్రతకు సంబంధించింది.. ఈ రోడ్డు కనక అభివృద్ధి చెందకపోతే.. దీని మీద కేంద్ర బలగాల పెత్తనం లేకపోతే.. దేశం మొత్తం నాశనం అవుతుంది. యుద్ధం లాంటి పరిణామాలు చోటు చేసుకుంటే.. ఈశాన్య రాష్ట్రాలు మన దేశంతో కనెక్టివిటీని కోల్పోతాయి. అందువల్లే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, హోం శాఖ మంత్రి అమిత్ షా ఈ రోడ్డును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు.. చైనా ఇప్పటికే టిబెట్ ప్రాంతంలోని చుంబి వ్యాలీ వద్ద సైనికులను మోహరించింది. నేపాల్ కూడా చైనా గుప్పెట్లో చిక్కుకుంది. బంగ్లాదేశ్ చుట్టు అమెరికా, చైనా, పాకిస్తాన్ మోహరించి ఉన్నాయి. ఇవి భౌగోళికంగా మన మీద ఒత్తిడి పెంచుతున్నాయి. రంగ్ పూర్ ప్రాంతం చుట్టూ కొత్త సైనిక ఒప్పందం జరుగుతున్నాయి. విదేశీ ప్రభావాలు ఉండనే ఉన్నాయి. తీవ్రవాద నెట్వర్క్ ల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అయితే వీటిపై భారత భద్రతా దళాలు గట్టిగా నిఘా పెట్టాయి. ఇదేమి సాధారణంగా ఉండే సరిహద్దు ఉద్రిక్తత కాదు.బెంగాల్ ప్రభుత్వం 120 ఎకరాల వ్యూహాత్మకమైన భూమిని అప్పగించడమే ఆలస్యం.. ఏడు జాతీయ రహదారుల నియంత్రణ మొదలైంది. భూగర్భ రైల్వే మార్గాల పని ప్రారంభమైంది. అంతేకాదు డ్రోన్లు.. థర్మల్ కెమెరాలు.. భూగర్భ కదలికలను గుర్తించే సెన్సార్లు.. లేజర్ గోడలు.. ఇవన్నీ కూడా ఇప్పుడు భారత రక్షణ వ్యవస్థలో కీలకమవుతున్నాయి. కేవలం 120 ఎకరాలు మాత్రమే కాదు.. బంగ్లాదేశ్ సరిహద్దు దగ్గర మరో 600 ఎకరాల భూమి కూడా మనదేశ సెక్యూరిటీ జోన్ పరిధిలోకి వస్తోంది. ఈ ప్రకారం అక్కడ సరిహద్దు నిర్మాణం పూర్తిగా మారుతుంది. అంతేకాదు 40 కిలోమీటర్ల మేర భూగర్భ రైల్వే సొరంగ మార్గాన్ని కూడా నిర్మిస్తున్నారు. దానిని 20 మీటర్లకు పైగా లోతులో నిర్మిస్తున్నారు. యుద్ధం వంటి విపత్కర పరిస్థితులు మొదలైతే.. ఏం జరుగుతుందో తెలుసు.. అందువల్లే ఈ స్థాయిలో నిర్మాణాలు మొదలవుతున్నాయి. ఇన్ని సంవత్సరాలు చికెన్ నెక్ కారిడార్ మీద కేంద్రానికి ఎటువంటి నియంత్రణ లేదు.మమతాబెనర్జీ ప్రభుత్వం నిర్వాకం వల్ల ఒక్క చిన్న రోడ్డు పని చేయాలన్నా సరే అనుమతులు వచ్చేవి కాదు. దీంతో జాతీయ భద్రత కూడా స్థానిక రాజకీయ అహంకారంలో ఇరుక్కుపోయింది. ఇప్పుడు బిజెపి ప్రభుత్వం రావడంతో సైన్యం నేరుగా నియంత్రణ తీసుకుంది. హైవే వెడల్పు అవుతుంది. పెద్ద పెద్ద మిస్సైల్స్ వ్యవస్థలు వెళ్లగలిగే విధంగా రోడ్లను సిద్ధం చేస్తున్నారు. రఫెల్ యుద్ధ విమానాలను మోహరించిన బాగ్డోగ్రా వైమానిక స్థావరం వద్ద అత్యంత భారీ సైనిక నిల్వ కేంద్రాలు సిద్ధం చేస్తున్నారు.. అందువల్లే చికెన్ నెక్ కారిడార్ ను కేవలం ఒక దారిగానే భారత్ చూడడం లేదు. భవిష్యత్తులో జరిగే ఏ పెద్ద యుద్ధానికి అయినా సరే ఇదే కేంద్ర నాడీ బిందువు అవుతుందని భావిస్తున్నారు.

# హైదరాబాద్‌లో తుది దశకు మరో స్టీల్ బ్రిడ్జి

హైదరాబాద్, మే 21, హైదరాబాద్ నగరంలో మరో స్టీల్ బ్రిడ్జి త్వరలోనే అందుబాటులోకి రానుంది. దశాబ్దాల క్రితం ప్రతిపాదించినా.. వాయిదా పడుతూ వస్తున్న ఈ బ్రిడ్జి.. నిర్మాణం పూర్తి చేసుకోగా.. వచ్చే నెల 2వ తేదీన ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. నల్గొండ క్రాస్ రోడ్డు నుంచి.. ఓవైసీ హాస్పిటల్ వరకు నిర్మించిన ఈ స్టీల్ బ్రిడ్జితో ఆ మార్గంలో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పడనుందని అధికారులు పేర్కొంటున్నారు.శరవేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరంలో ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, స్కైవేలు.. అంతే వేగంగా నిర్మాణం అవుతున్నాయి. విశ్వనగరంగా ఎదిగిన హైదరాబాద్‌లో ఉన్న కోట్ల మంది ప్రజల రాకపోకలకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చేసేందుకు ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు.. మౌలిక వసతులు కల్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే గత కొంత కాలంగా ఎన్నో ఫ్లైఓవర్లు నగరంలో ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. ఈ క్రమంలోనే ఎన్నో ఏళ్ల క్రితం ప్రతిపాదించిన స్టీల్ బ్రిడ్జి.. ఎట్టకేలకు నిర్మాణ పనులు పూర్తి చేసుకుంటోంది. త్వరలోనే ఆ బ్రిడ్జిని అందుబాటులోకి తీసుకువచ్చి.. నగరవాసులకు ట్రాఫిక్ కష్టాలను తగ్గించాలని అధికారులు భావిస్తున్నారు.నిత్యం వాహనాల రద్దీతో.. తీవ్ర ట్రాఫిక్ జాం అయ్యే మలక్‌పేట వద్ద నల్గొండ క్రాస్ రోడ్డు నుంచి కంచన్ బాగ్ వద్ద ఉన్న ఓవైసీ హాస్పిటల్ వరకు నిర్మిస్తున్న స్టీల్ బ్రిడ్జి పనులు ముగింపు దశకు చేరుకున్నాయి. ఈ స్టీల్ బ్రిడ్జిని త్వరలోనే ప్రారంభించేందుకు ఏర్పాట్లు రెడీ అవుతున్నాయి. మొత్తం 3.32 కిలోమీటర్ల పొడవు, ఆరు లేన్లుగా నిర్మించిన ఈ స్టీల్ ఫ్లై ఓవర్ నిర్మాణానికి సుమారు రూ.630 కోట్ల వ్యయం అయినట్లు తెలుస్తోంది. అయితే ఈ స్టీల్ బ్రిడ్జి.. క్షేత్ర స్థాయిలో ఎన్నో అడ్డంకులను దాటుకుని.. ఎట్టకేలకు నిర్మాణం పూర్తి చేసుకోగా.. త్వరలోనే ప్రారంభానికి సిద్ధం అవుతోంది.అయితే మరీముఖ్యంగా ఐఎస్ సదన్ వద్ద ఉన్న ఒక దేవాలయం.. మరో ప్రార్థన మందిరాలపై ప్రభావం పడేలా ఈ స్టీల్ బ్రిడ్జిని నిర్మిస్తున్నారని.. స్థానికులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. దీంతోపాటు చాలాసార్లు ఆందోళనలు కూడా చేశారు. వీటికి తోడు భూ సేకరణ కూడా ఎన్నో అవాంతరాల మధ్య పూర్తి అయింది. ఎన్ని అడ్డంకులు వచ్చినా.. అధికారులు వ్యూహాత్మకంగా వాటిని అధిగమిస్తూ వచ్చి.. ఈ స్టీల్ వంతెన పనులను తుది దశకు తీసుకువచ్చారు. ఇటీవలె కొన్ని రోజుల క్రితం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) కమిషనర్ ఆర్‌వీ కర్ణన్.. ఈ స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించారు.ముందుగా నిర్ణయించుకున్న గడువులోగా ఈ స్టీల్ వంతెన నిర్మాణ పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలోనే జీహెచ్ఎంసీ అధికారులు రంగంలోకి దిగి.. పనుల్లో వేగం పెంచారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వచ్చే నెల 2వ తేదీన ఈ స్టీల్ వంతెనను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించి.. నగరవాసులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.ఇక ఈ స్టీల్ బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా ఓవైసీ హాస్పిటల్ వరకు సుమారు 210 మీటర్ల పొడవున అప్ ర్యాంప్‌ను నిర్మించగా.. అక్బర్ బాగ్ వద్ద డౌన్ ర్యాంప్‌ను కూడా నిర్మించారు. ఈ ఫ్లై ఓవర్ అందుబాటులోకి వస్తే నల్గొండ క్రాస్ రోడ్డు నుంచి కంచన్ బాగ్ ఓవైసీ హాస్పిటల్ వరకు వేగంగా రాకపోకలు సాగనున్నాయి. ప్రస్తుతం చాంద్రాయణగుట్ట, సైదాబాద్, కంచన్ బాగ్ మార్గంలో కొత్త ఫ్లైఓవర్ల నిర్మాణంతో ట్రాఫిక్ భారీగా తగ్గింది.దీనికితోడు ఈ కొత్త ఫ్లైఓవర్ కూడా అందుబాటులోకి వస్తే.. ఆ మార్గంలో వాహనాలు వేగంగా ముందుకు సాగి.. వాహనదారులకు సిగ్నల్ ఫ్రీ ప్రయాణం అందుబాటులోకి రానుందని అధికారులు తెలిపారు.

ఈ స్టీల్ బ్రిడ్జి అందుబాటులోకి వస్తే.. ఓల్డ్ సిటీ, న్యూ సిటీల మధ్యనే కాకుండా.. న్యూ సిటీ నుంచి నగర శివారు ప్రాంతాలకు కూడా రాకపోకలు మరింత పెరిగే అవకాశాలున్నాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# జూన్ 2 నుంచి మద్యం ధరల పెంపు..



హైదరాబాద్, మే 21, రాష్ట్రంలో మందుబాబులకు భారీ షాక్ తగిలే సూచనలు కనిపిస్తున్నాయి. జూన్ 2 తర్వాత మద్యం ధరలు పెంచేందుకు సర్కార్ కసరత్తులు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే దీనికి సంబంధించిన ప్రక్రియ పూర్తి అయినట్లు సమాచారం. మద్యం ధరల పెంపునకు సంబంధించి.. ఇప్పటికే కమిటీ సిఫార్సులను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించినట్లు తెలుస్తోంది. మరోవైపు.. మద్యం తయారీ కంపెనీల నుంచి వస్తున్న ఒత్తిడి నేపథ్యంలో ధరలు పెంచక తప్పని పరిస్థితి నెలకొంది. కమిటీ సిఫార్సుల కంటే తక్కువగానే ప్రభుత్వం ధరలు పెంచనుంది.తెలంగాణలో మద్యం ప్రియులకు షాక్ ఇచ్చేందుకు రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రెడీ అయినట్లు తెలుస్తోంది. త్వరలోనే రాష్ట్రంలో మందు, బీర్ల ధరలు పెరగనున్నాయని సమాచారం. రాష్ట్రంలో మద్యం ధరల పెరుగుదలకు సంబంధించి.. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ ఇప్పటికే సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2వ తేదీ తర్వాత.. అన్ని రకాల మద్యం ధరలను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు సమాచారం. మద్యం ధరలను పెంచాలని ఇప్పటికే తయారీ కంపెనీల నుంచి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగుతోంది.అదే సమయంలో గతంలో పశ్చిమాసియా యుద్ధం ప్రారంభమైన సమయంలోనే మద్యం ధరలను పెంచాలని మద్యం తయారీ కంపెనీలు డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే. అయితే యుద్ధం ఎఫెక్ట్ సీసాల తయారీపైనా పడటంతో.. వాటి ధరలు పెరిగాయి. ఇక మద్యం ధరలో సీసాల తయారీ ఖర్చు ఎక్కువగా ఉంటుందని తెలుస్తోంది. ఇప్పటికే కమర్షియల్ గ్యాస్ ధరలు దాదాపు రెట్టింపు కావడంతో సీసాల తయారీ ఖర్చు 15 శాతం నుంచి 20 శాతం వరకు పెరిగినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. దీంతో వాటికి అనుగుణంగా ధరలను పెంచాలని కంపెనీలు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాయి.ఇక అన్ని మద్యం బ్రాండ్లపై కనీసం 10 శాతం నుంచి 15 శాతం వరకు ధరలు పెంచేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ చర్యలు చేపడుతోంది. దీంతో సాధారణ, మీడియం బ్రాండ్లతో పాటు ప్రీమియం బ్రాండ్ల మద్యం ధరలు కూడా భారీగా పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఇక పెంచిన మద్యం ధరల ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు అదనంగా ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు ఆర్థిక, అబ్కారీ శాఖలు చర్యలు తీసుకుంటున్నాయి.మరోవైపు.. మద్యం ధరల పెంపు , ఆదాయ వనరులకు సంబంధించిన అధ్యయనం చేసేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం గతంలోనే ఒక త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేయగా.. ఆ కమిటీ ఇప్పటికే సర్కార్‌కు కీలక ప్రతిపాదనలు అందించింది. ఈ నేపథ్యంలోనే ప్రస్తుత మార్కెట్ పరిస్థితులు, ఇతర రాష్ట్రాల్లో ఉన్న మద్యం ధరలను దృష్టిలో పెట్టుకుని తెలంగాణలో ఏకంగా 25 శాతం నుంచి 30 శాతం వరకు పెంచవచ్చని.. ఆ త్రిసభ్య కమిటీ సర్కార్‌కు సిఫార్సు చేసినట్లు సమాచారం. అయితే ఒకేసారి అంత పెంచితే.. ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుందని భావిస్తున్న ప్రభుత్వం.. 10 నుంచి 15 శాతం వరకు మాత్రమే ధరలను పెంచాలని అధికారులు పేర్కొంటున్నారు.

# నిబంధనలపై మిల్లర్లు గుస్సా

నల్గొండ, మే 21, వాస్తవ విరుద్ధంగా నిబంధనలు రూపొందించి.. తమపై ప్రయోగించడమే తప్ప, నిబంధనలు రూపొందించినవారే వాటిని పాటించిన ధాఖలాలు లేవంటూ రాష్ట్రంలోని రైస్ మిల్లర్లు మండిపడుతున్నారు. రైస్ మిల్లర్లకు ధాన్యం సరఫరా, బియ్యం సేకరణ తదితర అంశాలపై భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ), సివిల్ సప్లై సంస్థలు రూపొందించిన నిబంధనలను తమపై బలవంతంగా రుద్దుతూ, తమను బలిపశువు చేస్తున్నారని.. అదే నిబంధనలు వారుకూడా పాటించాలని, వారు అదేమీ పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని రైస్ మిల్లర్లు వాపో తున్నారు. మొత్తంగా తమకు నష్టం కలిగించే నిబంధనలనే పాటించాలని వారు అంటున్నారు. ధాన్యం సేకరణ సమయంలో 3 శాతం ముక్కిన/రంగు మారిన ధాన్యాన్ని మాత్రమే తీసుకోవాలనే నిబంధన ఉందని రైస్ మిల్లర్లు చెబుతున్నారు. ఎఫ్‌సీఐ రూపొందించిన ఎఫ్ఏక్యూ (ఫెయిర్ యావరేజ్ క్వాలిటీ) నిబంధనల ప్రకా రం.. 3 శాతం వరకు రంగుమారిన, ము తక, ముక్కిన ధాన్యాన్ని తీసుకోవాల్సి ఉంటుంది. అదే విధంగా.. రైస్ మిల్లర్లు బియ్యాన్ని ఎఫ్‌సీఐకి, సివిల్ సప్లైకి పం పించేటప్పుడుకూడా ఇదే నిబంధన ప్రకారం 3 శాతం ముక్కిన/రంగుమారిన బియ్యాన్ని మాత్రమే అనుమతించా ల్సి ఉంటుంది. అంతకుమించితే అటు ధాన్యమైనా.. ఇటు బియ్యం అయినా తీసుకోరని వారంటున్నారు.క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉంటున్నాయని రైస్ మిల్లర్లు వాపోతున్నారు. వాతావరణ పరిస్థితులు, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పరిస్థితులకు తోడు, రైతులు తీసుకొచ్చే ధాన్యంలో..ముక్కిన/రంగుమారిన ధాన్యం గింజల శాతం 15 శాతానికిపైగా ఉంటున్నాయని రైస్‌మిల్లర్లు చెబుతున్నారు. నిబంధనల ప్రకారం.. అలాంటి ధాన్యాన్ని మిల్లర్లకు సరఫరా చేయకూడదు.అయితే రాజకీయ ఒత్తిళ్లకు తోడు.. క్షేత్రస్థాయిలో రైతాంగం నుంచి ఎదుర య్యే అసంతృప్తిని తప్పించుకోవడానికి అధికార యంత్రాంగం కూడా తమపై ఒత్తిడి పెంచి.. 15 శాతానికిపైగా ముక్కిన/రంగుమారిన ధాన్యం/తడిచిన ధాన్యం సరఫరా చేస్తున్నారని.. రైస్ మిల్లర్లు ఆవేదన చెందుతున్నారు. రైతాంగం పరిస్థితి దృష్ట్యా వెసులుబాటు ఇవ్వవచ్చని.. కానీ దానిని ప్రభుత్వ రంగ సంస్థలు కూడా పాటించాలని వారంటున్నారు.మూడు శాతం వరకు తీసుకోవచ్చనే నిబంధనలను సడలించి.. ఒకపక్క 15 శాతానికి మించి ముక్కిన/రంగు మారిన ధాన్యాన్ని తమకు సరఫరా చేస్తూ.. కనీసం నిబంధనల ప్రకారం 3 శాతం వరకు ఉన్న బియ్యం కూడా తీసుకోకపోతే ఎలా.. ఆ నష్టాన్ని ఎవరు భరిస్తారంటూ రైస్ మిల్లర్లు ప్రశ్నిస్తున్నారు. అంటే ఇటువైపు నిబంధనలను సడలించి.. 15 శాతం వరకు ముక్కిన/రంగుమారిన ధాన్యాన్ని సరఫరా చేస్తూ.. 3 శాతం వరకు అనుమతి ఉన్నప్పటికీ.. బియ్యాన్ని తీసుకోకుండా రిజెక్ట్ చేస్తే.. రెండు విధాలా తాము నష్టపోతున్నామని రైస్‌మిల్లర్లు మొత్తుకుంటున్నారు.ఇలా రెండు విధాలా తాము నష్టపోతు న్నామని వారంటున్నారు. పేరుకే ప్రభుత్వ సంస్థలతో బియ్యం సరఫరాపై ఒప్పందం చేసుకుంటున్నామని.. కానీ అమలు విషయానికి వచ్చేసరికి.. తమనే బలిపశువుగా చేస్తున్నారని రైస్ మిల్లర్లు ఆవేదన చెందుతున్నారు. కనీసం ఎంతశాతం ముక్కిన/రంగుమారిన ధాన్యం సరఫరా చేస్తారో.. అంతశాతం బియ్యాన్ని సరఫరా చేసే అవకాశం కల్పించాలన్నారు.మూడు శాతం వరకు మాత్రమే ముక్కిన/రంగుమారిన/తడిచిన ధాన్యం తీసుకోవాల్సి ఉండగా.. క్షేత్రస్థాయిలో పరిస్థితులు, రాజకీయ, అధికార ఒత్తిళ్ళతో.. 15 శాతం.. అంతకంటే ఎక్కువగా ఉన్నా తీసుకుంటున్న రైస్ మిల్లర్ల నుంచి.. అదే స్థాయిలో ఉండే బియ్యాన్ని మాత్రం ఎఫ్‌సీఐ, సివిల్‌సప్లు శాఖలు తీసుకోవడం లేదంటూ.. మిల్లర్లు లబోదిబోమంటున్నా రు. ధాన్యాన్ని మిల్లింగ్ చేసిన తరువాత.. బియ్యాన్ని ఎఫ్‌సీఐకి, సివిల్ సస్లు గోదాములకు తరలించాలి.నిబంధనల ప్రకా రం ఇందులోనూ 3 శాతం వరకు ముక్కిన/రంగుమారిన బియ్యం ఉండవచ్చు. అయితే 0.5 శాతం ముక్కిన/రంగుమారి న బియ్యం ఉన్నా.. ఎఫ్‌సీఐ తీసుకోకుం డా.. వెనక్కి పంపిస్తుందని రైస్ మిల్లర్లు వాపోతున్నారు. తమకు 15 శాతానికిపైగా ముక్కిన/రంగుమారిన ధాన్యాన్ని సరఫరాచేసి.. కనీసం 3శాతం ముక్కిన/రంగు మారిన బియ్యాన్ని తీసుకోకపోతే ఎలా అంటూ వారు ప్రశ్నిస్తున్నారు.

# రాష్ట్రంలో రోడ్డెక్కని రైతు లేడు..

## రాస్తారోకో జరగని రహదారి లేదు కేటీఆర్

హైదరాబాద్ పంట కొనుగోళ్ల సంక్షోభంపై ఎన్నాళ్లీ మొద్దునిద్ర ముఖ్యమంత్రి గారు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీఎం రేవంత్ రెడ్డిని నిలదీసారు. క్యాబినెట్ మీటింగ్ లోనైనా కళ్ళు తెరవండి. రైతుల ప్రాణాలు పోతున్నా.. పంటలు కొనరా..? కొనుగోలు కేంద్రాల్లో కుప్పకూలుతున్నా కనికరించరా అని ప్రశ్నించారు. ధాన్యం తగలబెట్టుకుంటున్నా తండ్లాట తీర్చరా. సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ లేఖ రాసారు. రెండు నెలలైనా మొద్దునిద్ర వీడని ముఖ్యమంత్రిపై ధ్వజం ఎత్తారు. కొనుగోలు కేంద్రాల్లో ఈ మరణమృదంగమేంటి? రాష్ట్రంలో రోడ్డెక్కని రైతు లేడు.. రాస్తారోకో జరగని రహదారి లేదు. ఇవాళ బూతులు తిడుతున్న రైతులే.. రేపు వాతలు పెడతారని అన్నారు. కాంటా పెట్టని కాంగ్రెస్ సర్కారుకు రైతు చేతిలోనే కౌంట్ డౌన్ మొదలైందని అయన లేఖలో పేర్కొన్నారు.

## మహిళా సాధికారతకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక

## మే 25 నుంచి 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా మహిళా వారోత్సవాలు




హైదరాబాద్ మహిళల ఆర్థిక, సామాజిక, రాజకీయ సాధికారతను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ఈ నెల 25 నుంచి 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా "మహిళా వారోత్సవాలు" నిర్వహించనుంది. ప్రజా పాలన ? ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామీణ మహిళలు, స్వయం సహాయక సంఘాలు, సంస్థలు, యువతులు, బాలికలు, దివ్యాంగులు, వృద్ధులు తో సహా అన్ని వర్గాల మహిళలను భాగస్వామ్యులను చేస్తూ వారం రోజుల పాటు విభిన్న కార్యక్రమాలు చేపట్టనున్నారు.

ఈ కార్యక్రమాల ద్వారా మహిళల ఆర్థిక స్వావలంబన, జీవనోపాధుల విస్తరణ, సామాజిక భద్రత, ఆరోగ్యం, భద్రత, మౌలిక వసతుల అభివృద్ధి, మహిళా సంఘాల బలోపేతం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రత్యేక సమావేశాలు, అవగాహన కార్యక్రమాలు, మౌలిక వసతుల ప్రారంభోత్సవాలు, జీవనోపాధి యూనిట్ల గ్రౌండింగ్, రుణమేళాలు నిర్వహించనున్నారు.

ప్రత్యేకంగా మే 29న హైదరాబాద్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మహిళా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల కోసం ఇంక్యుబేటర్ ప్రోగ్రాం ప్రారంభం, జీవనోపాధి యూనిట్ల గ్రౌండింగ్ కార్యక్రమం నిర్వహించనుండటం ఈ వారోత్సవాల్లో ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాలకు ఆర్థిక అవకాశాలు విస్తరించే దిశగా ఈ కార్యక్రమం కీలక మైలురాయిగా నిలుస్తుంది.

మహిళా సంఘాలను కేవలం పొదుపు సమూహాలుగా కాకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను నడిపించే ఉత్పాదక శక్తులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహిళలకు బ్యాంకు రుణాలు, జీవనోపాధి యూనిట్లు, సూక్ష్మ పరిశ్రమలు, వ్యవసాయ ప్రాసెసింగ్ కేంద్రాలు, సౌర విద్యుత్ ప్రాజెక్టులు వంటి అవకాశాలను గ్రామ స్థాయికే తీసుకెళ్తున్నామని చెప్పారు. మహిళల చేతుల్లో ఆదాయం పెరిగితే కుటుంబాలు బలపడటమే కాకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కూడా మరింత పటిష్టమవుతుందని పేర్కొన్నారు. మహిళా వారోత్సవాల సందర్భంగా నిర్వహించే ప్రతి కార్యక్రమం మహిళల ఆర్థిక స్వావలంబన, భద్రత, నాయకత్వ వికాసానికి దోహదపడేలా రూపొందించామని, రాష్ట్రవ్యాప్తంగా అన్ని శాఖలు సమన్వయంతో ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు.

## విద్యార్థుల భద్రతే మా ప్రథమ ప్రాధాన్యత

### నగర వ్యాప్తంగా స్కూల్, కాలేజీ బస్సుల ఫిట్‌నెస్‌ను విస్తృతంగా తనిఖీ చేసిన ట్రాఫిక్ పోలీస్ అధికారులు.

నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో, నగర వ్యాప్తంగా ట్రాఫిక్ పోలీస్ అధికారులు నిబంధనల ప్రకారం విద్యాసంస్థల బస్సులు నడుస్తున్నాయా లేదా అనే అంశంపై ట్రాఫిక్ అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ రోజు నాల్గవ ట్రాఫిక్ ఎ.సి.పి. శ్రీ డి.పావన్ కుమార్ పర్యవేక్షణలో నాల్గవ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ శ్రీ కృష్ణ బాబు గారు వారి సిబ్బందితో కలిసి పటమట లోని ఎస్.ఆర్.కె.కళాశాల లోని కలశాల బస్సులకు తనిఖీ నిర్వహించి బస్సులకు సంబంధించిన ఫిట్‌నెస్ సర్టిఫికేట్ (ఈఅ), ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికేట్లు సక్రమంగా ఉన్నాయా, బస్సుల్లో ఎమర్జెన్సీ ఎగ్జిట్ (అత్యవసర ద్వారం), ఫస్ట్ ఎయిడ్ బాక్స్, మరియు వర్కింగ్ కండిషన్‌లో ఉన్న ఫైర్ ఎక్స్‌టింగిషర్లు (అగ్నిమాపక పరికరాలు) ఉన్నాయా, బస్సు డ్రైవర్లకు హెవీ వెహికల్ లైసెన్స్‌తో పాటు అనుభవం ఉందో లేదో సరిచూశారు.అనంతరం అధికారులు మాట్లాడుతూ..... విద్యార్థుల ప్రాణాలతో ముడిపడి ఉన్న వాహనాల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని హెచ్చరించారు. బస్సులలో విద్యార్థులను సీటింగ్ సామర్థ్యానికి మించి ఎక్కించుకోకూడదని, నిబంధనలు ఉల్లంఘించిన, ఫిట్‌నెస్ లేని బస్సులను నడిపిన విద్యాసంస్థల యాజమాన్యాలపై మరియు డ్రైవర్లపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని, భారీ జరిమానాలతో పాటు వాహనాలను సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను స్కూళ్లకు పంపే వాహనాల భద్రతను గమనించాలని కోరారు.రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ, సురక్షితమైన ప్రయాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.




## చిలుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్



నెల్లూరు జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణతో పాటు ప్రజల్లో భద్రతా భావన పెంపొందించే దిశగా పోలీసుఉ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్స్ను విస్తృతంగా నిర్వహిస్తున్నారు. డిజిటల్ మ్యాపింగ్ ద్వారా క్రైమ్ స్పాట్స్ గుర్తింపు, రౌడీషీటర్లు, అనుమానితులు, పరారీ నిందితులు, వారంట్లు /సమన్లు, గంజాయి మరియు ఇతర నిషేధిత పదార్థాలు, అనుమానాస్పద వాహనాలు, అక్రమ కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

ఈ ఆదేశాల మేరకు, గురువారం ఉదయం చిలుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని బూధనం గ్రామంలో విస్తృత కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ ఆపరేషన్లో భాగంగా గ్రామంలోని సుమారు 170 ఇళ్లలో ఇంటింటి తనిఖీలు నిర్వహించి, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు మరియు అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచారు. తనిఖీల సందర్భంగా సరైన పత్రాలు లేని 14 ద్విచక్ర వాహనాలను గుర్తించి స్వాధీనం చేసుకుని పరిశీలనలో ఉంచారు. అలాగే ఇతర రాష్ట్రాలకు చెందిన 27 మంది వ్యక్తుల వేలిముద్రలను సేకరించి, వారి వివరాలను నమోదు చేసి పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు నేరాల నివారణ, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై అప్రమత్తంగా ఉండటం, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు మరియు భద్రతా చర్యలపై అవగాహన కల్పించారు.

ప్రాంతంలో అనుమానాస్పద వ్యక్తుల కదలికలు, అక్రమ కార్యకలాపాలు లేదా మత్తు పదార్థాల వినియోగం/సరఫరాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## హాస్టల్లో వివాదం.. దాడులు

### హాస్టల్ నిర్వాహకులపై భవన యజమానుల దాడులు
### స్థానికులతో పెట్టుకుంటావా అంటూ పిడిగుద్దులు
### అక్రమ నిర్మాణంలో కొనసాగుతున్న హాస్టల్స్ పై స్థానికుల ఆవేదన
### రోడ్లపైనే వందలాది వాహనాలు ,లక్షల్లో అద్దెలు
### అగ్రిమెంట్లకు విరుద్ధంగా ఖాళీ చేయాలంటూ న్యాయస్థానాలకు

మహానగరంలో హాస్టల్ల వ్యాపారం కోట్లలో సాగుతుంది. ఉన్నత చదువుల కోసం వృత్తిరీత్యా, నైపుణ్యాల శిక్షణ కోసం హైదరాబాద్ మహా నగరానికి వస్తున్న వారికి ఆశ్రయం కల్పిస్తున్న హాస్టల్స్ నిత్యం వివాదాలకు కేంద్రాలుగా మారుతున్నాయి. జిహెచ్ఎంసి నిబంధనలు ఏ మాత్రం పాటించకుండా బహుళ అంతస్తులు నిర్మాణం చేసి హాస్టల్ కు అద్దెకిస్తున్నారు. ఉమెన్స్ హాస్టల్ లో కనీస ప్రమాణాలు పాటించకపోవడం తో ఆయా హాస్టల్లో ఉంటున్న మహిళలు, బాలికలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన దుస్థితి. ఇక భవన యజమానులు, హాస్టల్ నిర్వాహకుల మధ్య నిత్యం ఏదో ఒక విషయంలో వివాదం జరగడం సర్వసాధారణం అయిపోయింది. లక్షల అద్దెలకు ఆశపడి భవన యజమానులు వారి భవనాలను హాస్టలకు ఇస్తున్నారు. స్థల యజమానులు హాస్టల్ నిర్వాహకుల నుంచి కోట్లల్లో డబ్బులు తీసుకొని నిర్మాణాలు చేపడుతున్నారు. నిబంధనల ప్రకారం వారు ఇచ్చే డబ్బులు పూర్తి అయ్యేవరకు హాస్టల్ కొనసాగించే అవకాశం ఉన్న కొంతకాలానికి ఏదో ఒక రూపంలో వివాదం చేసి హాస్టళ్లను స్వాధీనం పరుచుకునేందుకు జరుగుతున్న ఘర్షణ దాడులకు దారి తీస్తుందని స్థానికులు వాపోతున్నారు. ఇక నివాస ప్రాంతాలలో హాస్టలను ఏర్పాటు చేయడంతో విసిగిపోతున్నట్లు చెబుతున్నారు స్థానికులు. రోడ్లపైనే అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్న ఏమీ అనలేని పరిస్థితి వచ్చిందని తీవ్ర మనోవేదన గురవుతున్నారు. అసాంఘిక కార్యక్రమాలలో అడ్డుకోవాల్సిన పోలీసులు భవన యజమానుల అండదండలతో చెలరేగిపోతున్న హాస్టల్ నిర్వాహకులకు వత్తాసు పలుకుతున్నారని విమర్శిస్తున్నారు.ఇక అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన జిహెచ్ఎంసి భవన యజమానులు ఇచ్చే తైలాలకు లొంగి 50 గజాల కూడా లేని స్థలాలలో సైతం ఆరు నుంచి ఏడు అంతస్తులు నిర్మిస్తున్న పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. అమీర్పేట హాస్టల్ వివాదం సైతం ఈ తరహాలో జరిగినట్లు తెలుస్తుంది. స్థల యజమాని హాస్టల్ నిర్వాహకుల నుంచి రెండు కోట్లకు పైగా డబ్బులు తీసుకొని అవి పూర్తయ్యే వరకు నిర్వహించుకోవచ్చునని హామీ ఇచ్చారు.

అనంతరం ఇరు వర్గాల మధ్య తలెత్తిన వివాదం కోర్టుకు చేరింది. నిబంధనల ప్రకారం ప్రస్తుతం కోర్టుకు హాస్టల్ నిర్వాహకులు డబ్బులు చెల్లిస్తున్నారు. ఇది ఇలా ఉండగా హాస్టల్ నిర్వాహకులను ఖాళీ చేయించేందుకు మాజీ మేయర్ కుటుంబ సభ్యులు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు అందులో భాగంగానే తమపై అక్రమ కేసులు బలాయిస్తున్నారని హాస్టల్లో వాపోయారు. సివిల్ వివాదాన్ని క్రిమినల్ వివాదంగా మార్చి తమను బలవంతంగా అక్కడ నుంచి పంపించే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొంటుండగా అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నందునే ఖాళీ చేయాలని కోరుతున్నట్లు తెలిపారు. గత మూడు రోజులుగా ఈ వివాదం కొనసాగుతుండగా బుధవారం రాత్రి తమ హాస్టల్ లోకి అక్రమంగా చొరబడ్డ మహిళలు తమపై దాడి చేశారని హాస్టల్ నిర్వాహకులు పేర్కొంటున్నారు.

ప్రస్తుతం గాయపడ్డ వారు ప్రైమ్ హాస్పిటల్ చికిత్స పొందుతున్నారని తెలిపారు.

## బోడపాడు ఉత్సవాల్లో పొలిటికల్ హీట్!

### కూటమి ప్రభుత్వంపై ఎంపీ అవినాష్ రెడ్డి ఆరోపణలను తీవ్రంగా ఖండించిన టీడీపీ నేతలు..
### బిజివేముల రామసుబ్బారెడ్డిపై ధ్వజం

బ్రహ్మంగారిమఠం బ్రహ్మంగారిమఠం మండలం బోడపాడు గ్రామంలో జరిగిన శ్రీ సీతారామ అభయ వీరాంజనేయ స్వామి 37వ సప్తహా మహోత్సవాల వివాదం ఇప్పుడు పొలిటికల్ టర్న్ తీసుకుంది.ఈరోజు బ్రహ్మంగారిమఠం తెదేపా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, కడప జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు కానాల మల్లికార్జున రెడ్డి, సోమిరెడ్డి పల్లె సొసైటీ బ్యాంక్ చైర్మన్ ఎల్లటూరి సాంబశివారెడ్డి, తెదేపా నాయకులు పూజ శివ యాదవ్ లతో బోడపాడు గ్రామానికి చెందిన టిడిపి నాయకులు బిజివేముల రామిరెడ్డి, బిజీవేముల సాంబశివరెడ్డి మాట్లాడుతూ.. పవిత్రమైన సప్తహ మహోత్సవాలను ప్రభుత్వం ఆపింది అనడం ముమ్మాటికీ అవాస్తవమని స్పష్టం చేశారు. గ్రామంలో గ్రూపు రాజకీయాల వల్ల ఎక్కడ గొడవలు జరుగుతాయోనని, ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగానే పోలీసులు చట్టప్రకారం కొన్ని ఆంక్షలు విధించారని టిడిపి నేతలు స్పష్టం చేశారు. అక్కడ చట్టం తన పని తాను చేసుకుపోతే.. దాన్ని కూటమి ప్రభుత్వం కావాలనే అడ్డుకుందంటూ బురదజల్లడం ఏమాత్రం సమంజసం కాదని వారు మండిపడ్డారు.దేవుడి గుడి దగ్గర అసలైన రాజకీయ కుట్రలకు తెరలేపింది వైసిపి నేత బోడపాడు రామసుబ్బారెడ్డి అని వారు తీవ్రంగా ధ్వజమెత్తారు. గత ముప్పై ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్న రామసుబ్బారెడ్డి, గ్రామంలో తను చెప్పిందే వేదవాక్కుగా సాగాలని భావిస్తారే తప్ప, బోడపాడు అభివృద్ధికి ఆయన పైసా పని చేయలేదని టిడిపి నేతలు విమర్శించారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డికి అసలు బోడపాడు గ్రామ చరిత్ర తెలియదని, అందుకే నిన్నటి పర్యటనలో కొందరు నేతలు ఆయనకు వాస్తవాలు దాచి, అవాస్తవాలు చెప్పడంతోనే ఆయన కూటమి ప్రభుత్వంపై బురదజల్లేలా మాట్లాడారని మండిపడ్డారు. అదే మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డికి రామసుబ్బారెడ్డి ట్రాక్ రికార్డ్ పూర్తిగా తెలుసని.. అందుకే ఆయనతో మాట్లాడించకుండా, ఏమీ తెలియని ఎంపీతో అబద్ధాలు చెప్పించారని ఎద్దేవా చేశారు. ఆహ్వాన కరపత్రంలో బద్వేల్ శాసనసభ్యురాలు డాక్టర్ సుధా పేరు వేసుకున్న నిర్వాహకులు, లోకల్ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పేరు ఎందుకు వేయలేదని సూటిగా ప్రశ్నించారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే కూటమి ప్రభుత్వంపై బురద చల్లడానికి రామసుబ్బారెడ్డి ఇలాంటి దిగజారుడు రాజకీయాలు చేశారని ఆరోపించారు.బోడపాడు రామసుబ్బారెడ్డి ఇప్పటికైనా దేవుని గుడి దగ్గర రాజకీయాలు మానేసి, తన కుట్రలను అదుపులో పెట్టుకోవాలని, గ్రామంలో అందరినీ కలుపుకొని పోతూ బోడపాడు అభివృద్ధికి కృషి చేయాలని హితవు పలికారు. తాము గ్రామానికి బ్రిడ్జి లేని విషయాన్ని గౌరవ శాసనసభ్యులు శ్రీ పుట్టా సుధాకర్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తుంటే.. ఎమ్మెల్యే పైనే ఇలాంటి ఆరోపణలు చేయడం వల్ల గ్రామానికి మొండిచేయి మిగిలే ప్రమాదం ఉందన్నారు. బోడపాడు గ్రామ ప్రజలు కూడా ఇప్పటికైనా ఆలోచించాలని.. ఏ నాయకుడు మంచి చేస్తున్నాడు, ఏ నాయకుడు అభివృద్ధి చేయకుండా ఊరిని వెనక్కి నెడుతున్నాడు అనేది గమనించాలన్నారు. దేవుడి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరగకుండా అడ్డుపడుతున్న శక్తులకు రాబోయే రోజుల్లో కనువిప్పు కలిగించేలా గ్రామస్థులు సరైన నిర్ణయం తీసుకోవాలని బిజివేముల రామిరెడ్డి, సాంబశివరెడ్డి పిలుపునిచ్చారు.

## ఆకస్మిక తనిఖీలు చేసిన మఠాధిపతులు వేంకటాద్రి స్వామి



బ్రహ్మంగారిమఠం పుణ్యక్షేత్రమైన బ్రహ్మంగారిమఠంలో గురువారం రోజు ఉదయం 5.30 సమయం లో జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి వారి మఠం మఠాధిపతులు వీరధర్మజ వేంకటాద్రిస్వాముల స్వాములవారు మఠం మాడవీధులను మరియు రథం పరిసర ప్రాంతాలను, టీటీడీ రూములను, టిటిడి పరిసర ప్రాంతాలను మరియు కళ్యాణ కట్ట పరిసర ప్రాంతాలను, నిత్యాన్నదాన పరిసర ప్రాంతాలను ఆకస్మికంగా వెళ్లి తనిఖీ చేసి ఎప్పటికప్పుడు ప్రతిరోజు మఠం పరిసర ప్రాంతాలన్నీ కూడా శుభ్రంగా ఉంచాలని అక్కడ ఉన్నటువంటి మఠం సిబ్బందికి ఆదేశించడం జరిగినది. అలాగే మధ్యాహ్నం వేళలో ప్రతిరోజు జరిగే నిత్య అన్నదాన సత్రాన్ని కూడా మఠాధిపతులు తనిఖీ చేశారు అక్కడ భోజనం చేస్తున్న భక్తాదులతో కలిసి భోజనంతోపాటు కూరలు ఎలా ఉన్నాయని స్వయంగా భక్తులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా అన్నదాన సత్రంలో పనిచేసే సిబ్బందిని భక్తులకు జాగ్రత్తగా అన్ని రకాల రుచులతో వంటలను పంపిణీ చేయాలని ఆయన ఆదేశించారు. అదేవిధంగా భక్తులు అన్నదానానికి సమర్పించే విరాళాలు వాటి వివరాలను అక్కడ ఉన్న సిబ్బంది దగ్గర రసీదులను ఆయన పరిశీలించి చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో భక్తులకు అన్ని రకాల రుచికరమైన వంటకాలతో నాణ్యమైన ఉచిత భోజనాన్ని అందజేస్తామని మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వాములవారు తెలిపారు. కార్యక్రమంలో దేవాలయ సిబ్బంది ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# "ఆత్మకథ" మూవీ ట్రైలర్ లాంచ్



వారాహి ఎంటర్టైన్మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్ పై సోమేష్ నిర్మాతగా శ్రీనివాస్ బండ్రెడ్డి రచనా దర్శకత్వంలో రానున్న చిత్రం ఆత్మ కథ - యాన్ అన్ టోల్డ్ స్టోరీ. సినీ ప్రముఖులు, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ చేతుల మీదగా ఈ చిత్ర టైటిల్, అలాగే ట్రైలర్ లాంచ్ చేయడం జరిగింది. జెమిని సురేష్ హీరోగా రూప హీరోయిన్ గా చేయగా 30 ఇయర్స్ ఇండస్ట్రీ పృథ్వీ, సమ్మెట గాంధీ, షకలక శంకర్, తాగుబోతు రమేష్, ధనరాజ్, నాగ మహేష్, బలగం విజయలక్ష్మి, శ్రీనివాస్ నాయుడు తదితరులు కీలకపాత్రలు పోషించారు. ఈ కార్యక్రమానికి తెలుగు చిత్ర నిర్మాతల మండలి సెక్రటరీ తుమ్మల ప్రసన్నకుమార్ గారు, నటుడు కె.వి ప్రదీప్, నటి కరాటే కళ్యాణి తదితరులు పాల్గొన్నారు. శ్రేయాంశ్ సంగీతాన్ని అందించిన ఈ చిత్రానికి గోపి డిఓపిగా చేయగా రాఘవేంద్ర రెడ్డి ఎడిటింగ్ చేశారు. ఈ చిత్రం తెలుగు, హిందీ, తమిళ్, మలయాళం, కన్నడ భాషలలో విడుదల కానుంది.

ఈ సందర్భంగా దర్శకుడు శ్రీనివాస్ గుండ్రెడ్డి మాట్లాడుతూ... "నేను ఇతర భాషలలో కూడా సినిమాలు చేశాను. ప్రతి సినిమాకు నా వెనుక ఉండి నన్ను సపోర్ట్ చేస్తూ వచ్చిన వ్యక్తి మా అన్నయ్య ప్రసన్న గారు. చెప్పిన బడ్జెట్ లో ఒక సినిమా చేశాను అంటే దానికి ఎంతో మంది సహకారం ఉండటం వల్లనే. అలాగే చిత్ర పోస్ట్ ప్రొడక్షన్ సమయంలో నాకు ఎంతో సహాయం చేసిన వ్యక్తి రామకృష్ణ అన్నయ్య. ఈ చిత్ర నిర్మాత మా ఇంటి ఓనర్, ఆయన కుమారుడే ఈ సినిమాకు సంగీతాన్ని అందించారు. సినిమాకు డబ్బింగ్ తప్పించి మిగతా అన్ని పనులు నేను ఇంట్లోనే చేసుకుంటాను. మా పిల్లలు కూడా మంచి టెక్నీషియన్స్. దాని వల్ల నా నిర్మాతకు బడ్జెట్ తగ్గుతుంది. నా ప్రతి కథ, డైలాగ్స్ నేనే రాసుకుంటా. పోస్ట్ ప్రొడక్షన్ నేనే చేసుకుంటా. నిర్మాత ఇచ్చిన డబ్బు తీసుకున్నాను. కళామ్మ తల్లి నాకు, నా కుటుంబానికి అన్నం పెట్టింది. చాలా చిన్న స్థాయి నుండి ఇక్కడ వరకు వచ్చాను. నిరంతరం ఏదో ఒకటి నేర్చుకుంటూనే ఉంటాను. సినిమాకు నటీనటులు, సంకేతాక నిపుణులు సినిమాకు బాగా సహకరించారు. ఈ సినిమాను అందరూ ఆశీర్వదించాలని కోరుకుంటున్నాను" అన్నారు.

తెలుగు చిత్ర నిర్మాతల మండలి సెక్రటరీ ప్రసన్న కుమార్ గారు మాట్లాడుతూ..."వారాహి ఎంటర్టైన్మెంట్స్ వస్తున్న ఆత్మకథ చిత్రం ఒక సామాన్యుడిది. దర్శకుడు శ్రీనివాస్ తమ పిల్లలు కూడా ఇదే ఇండస్ట్రీలో ఉండటంతో వారి సహాయంతో నిర్మాతకు బడ్జెట్ పెరగకుండా ఈ సినిమాకు ఎంతో బడ్జెట్ తగ్గించి వేడి చేశారు. అలాగే నిర్మాత, సంగీత దర్శకుడు కూడా సొంతవారు కావడం విశేషం. రసమయి బాలకిషన్ గారు ఈ కార్యక్రమానికి రావడం సంతోషకరం. జెమిని సురేష్ మొదటి నుంచి చాలా కష్టపడి పైకి వచ్చిన వ్యక్తి. రామక్రిష్ణ గారు చిత్ర పరిశ్రమకు చాలా సేవ చేశారు. అలాగే ఈ కార్యక్రమానికి వచ్చిన ప్రతి ఒక్కరూ బావుండాలని, అందరికీ మంచి పేరు రావాలని కోరుకుంటున్నాను" అన్నారు.

నటుడు కెవి ప్రదీప్ గారు మాట్లాడుతూ... "ఈ కార్యక్రమంలో పాల్గొనడం, అందరిని కలవడం చాలా సంతోషం. నిర్మాత సోమేష్ గారితో నాకు ఎంతో కాలం నుండి మంచి అనుబంధం ఉంది. ఆయన కొడుకు ఈ సినిమాకు సంగీతం అందించడం చాలా ఆనందకరం. శ్రేయాంశ్ మంచి స్థాయికి వెళ్లాలని కోరుకుంటున్నాను. సురేష్ తో కలిసి గతంలో పని చేశాము. ఆయన ఈ సినిమాతో మంచి పేరు తెచ్చుకోవాలని కోరుకుంటున్నాను. థియేటర్ కి వెళ్ళి ఈ సినిమా చూడాలని కోరుకుంటున్నాను" అన్నారు.

మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ గారు మాట్లాడుతూ... "ఆత్మకథ చిత్ర టైటిల్ లాంచ్ కార్యక్రమానికి నన్ను ఆహ్వానించిన చిత్ర బృందానికి నా ధన్యవాదాలు. ఎన్నో చిత్ర కార్యక్రమాలకు వచ్చాను కానీ ఈ చిత్ర టైటిల్ నన్ను ఎంతగానో ఆకర్షించింది. ఈరోజుల్లో ఇటువంటి కథను ప్రేక్షకులకు చెప్పున్న శ్రీనివాస్ గారికి చాలా ధైర్యం. ఇటువంటి దర్శకులు దొరకడం నిర్మాతకు అదృష్టం. చిన్న వయసులో సినిమాకు సంగీతం అందించిన శ్రేయాంశ్ కు ఆల్ ది బెస్ట్. జెమిని సురేష్ మంచి నటుడు. విజయ లక్ష్మి గారు నాకు ఎంతోకాలం నుండి పరిచయం. ఈ సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను" అన్నారు.

నటుడు సమ్మెట గాంధీ గారు మాట్లాడుతూ... "ఈ కార్యక్రమానికి వచ్చిన అందరికీ నమస్కారం. దర్శకులు నాకు కథ చెప్పినప్పుడు ఆ కథలో ఆత్మ నేను అని చెప్పినప్పుడు సినిమాలో నేను కనిపిస్తానా అనుకున్న కాని సినిమా అంతా నా చుట్టూ తిరుగుతుంది అని సంతోషించాను. కేవలం 3 లొకేషన్స్ లో ఈ సినిమా ఇంత గొప్పగా చేయడం పెద్ద విషయం. నటీనటులు, సాంకేతిక నిపుణులు చాలా కష్టపడి ఈ సినిమా చేశారు. ఈ సినిమాకు మంచి విజయం ఇచ్చి నిర్మాతకు కాలుస వర్షం కురవాలని కోరుకుంటున్నాను" అన్నారు.


నటి కరాటే కళ్యాణి మాట్లాడుతూ... " అమ్మాయిల కలల రాకుమారుడు జెమినీ సురేష్ గారి కోసం నేను ఈ కార్యక్రమానికి వచ్చాను. ఈయనకు మంచి పాట పడితే ఆయన స్థాయి వేరేలా ఉంటుంది. ఈ రోజుల్లో నిర్మాతను బాగా చూసుకునే దర్శకులు దొరకడం చాలా కష్టం. అటువంటి దర్శకులు శ్రీనివాస్ గారు జెమిని సురేష్ కు హీరోగా మంచి అవకాశం ఇచ్చారు. ఈ వేదిక మీద ఉన్న అందరూ చాలా గొప్పవారు. పవన్ కళ్యాణ్ గారు నమ్మిన వారాహి అమ్మవారి పేరుపై బ్యానర్ ఉండటంతో అమ్మవారి ఆశీస్సులు తప్పకుండా ఉంటాయి. సినిమాలో సంగీతం చాలా బావుంటుంది అని అనుకుంటున్నాను" అన్నారు.

నటుడు కుమనన్ మాట్లాడుతూ... "అందరికీ నమస్కారం. దర్శకులు శ్రీనివాస్ గారికి మొహంలో ఎప్పుడూ నవ్వుతూ ఉండే ఒక కల ఉంటుంది, ఆ నవ్వుకి ఆర్టిస్టులు అందరూ ఒప్పేసుకుంటారు. తన కుటుంబం సభ్యులతో అలాగే నిర్మాత కుటుంబం సభ్యులతో కలిసి పనిచేస్తూ చేయించుకుని ఈ సినిమా చేసిన శ్రీనివాస్ గారికి మంచి పేరు రావాలని, సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను. సురేష్ ఇంకా పైకి ఎదగాలని కోరుకున్నాను, అలాగే గాంధీ గారు అంటే నాకు ఎంతో అభిమానం. మా ప్రయాణం సైరా నరసింహారెడ్డి చిత్రం నుండి ఉంది. ఆయన ఘంటసాల గారిలా పద్యాలు పడతారు. సినిమాను థియేటర్కు వెళ్లి ఈ సినిమా చూడాలని కోరుకుంటున్నాను" అన్నారు.

నటుడు జెమిని సురేష్ మాట్లాడుతూ... "సెప్టెంబర్ 7, 2005న హైదరాబాద్‌కు వచ్చి యాంకర్, డబ్బింగ్ ఆర్టిస్ట్, క్రియేటివ్ డైరెక్టర్ స్థాయి నుంచి కష్టపడి ఈరోజు 'ఆత్మకథ' సినిమా ద్వారా ప్రధాన హీరోగా మారాను. హీరోగా అవకాశం ఇచ్చిన దర్శకుడు శ్రీనివాస్, నమ్మి పెట్టుబడి పెట్టిన నిర్మాత సోమేష్, అలాగే తదుపరి చిత్రం 'బ్లాక్ మెయిల్' నిర్మాత అవినాష్ కూనపరెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు. సమ్మెట గాంధీ, కరాటే కళ్యాణి, హీరోయిన్ రూప, డీఓపీ గోపి, ఎడిటర్ సతీష్, 'వేదిక' డైరెక్టర్ రాజవంశీ, స్నేహితులు హేమంత్, ప్రకాష్‌లను ధన్యవాదాలు. అరుణాచలంలో గిరి ప్రదక్షిణ చేసి వచ్చిన వెంటనే నాకు ఈ సినిమాలో హీరోగా అవకాశం రావడం పూర్తిగా శివుడి ఆశీర్వాదంగా భావిస్తున్నాను. తెలుగు సినిమా అనేది ఇంట్లో వేడి అన్నంలో తినే పప్పు, ఆవకాయ, నెయ్యి లాంటిది. ఒక ఇంట్లో జరిగే కథగా రూపొందిన 'ఆత్మకథ' కామన్ మ్యాన్ ఎమోషన్స్, భయం, వినోదంతో కూడిన అద్భుతమైన కుటుంబ కథా చిత్రం. గత 20 ఏళ్లుగా నన్ను ఆదరించిన జెమినీ కిరణ్ గారికి, సహాయకులకు, మీడియాకు పాదాభివందనాలు. ఈ సినిమాను తప్పకుండా థియేటర్లలో చూసి ఆదరించాలని ప్రేక్షకులను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అంటూ ముగించారు.

నటీనటులు : జెమిని సురేష్, రూప, 30 ఇయర్స్ ఇండస్ట్రీ పృథ్వీ, సమ్మెట గాంధీ, షకలక శంకర్, తాగుబోతు రమేష్, ధనరాజ్, నాగ మహేష్, బలగం విజయలక్ష్మి, శ్రీనివాస్ నాయుడు తదితరులు.

# 'ఐ యామ్ గేమ్' మూవీ ఆగస్టు 20న వరల్డ్ వైడ్ గ్రాండ్ రిలీజ్



దుల్కర్ సల్మాన్ మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'ఐ యామ్ గేమ్' రిలీజ్ డేట్‌ను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. దుల్కర్ సల్మాన్ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం 2026 ఆగస్టు 20న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది. ప్రస్తుతం డబ్బింగ్‌తో పాటు పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దుల్కర్ సల్మాన్‌కు చెందిన వే ఫారర్ ఫిల్మ్స్ బ్యానర్‌పై ఈ చిత్రం నిర్మిస్తున్నారు.

దక్షిణ భారతదేశంలోని 100కు పైగా లొకేషన్లలో చిత్రీకరించిన ఈ సినిమాకు నహాస్ హిదాయత్ దర్శకత్వం వహిస్తున్నారు. వే ఫారర్ ఫిల్మ్స్ బ్యానర్‌పై దుల్కర్ సల్మాన్, జోమ్ వర్గీస్ సంయుక్తంగా నిర్మిస్తుండగా, షహబాస్ రషీద్, ఆదర్శ్ సుకుమారన్ కథా రచన అందించారు.

మలయాళ సినీ చరిత్రలోనే అత్యంత భారీ స్థాయిలో తెరకెక్కుతున్న చిత్రాల్లో ఒకటిగా 'ఐ యామ్ గేమ్' నిలవనుంది. ఈ చిత్రంలో దుల్కర్ సల్మాన్ అల్ట్రా స్టైలిష్, మాస్ అవతార్‌లో కనిపించనున్నారు. తన కెరీర్‌లో ఇదే అత్యంత స్టైలిష్ మూవీ అని దుల్కర్ ఇప్పటికే వెల్లడించారు. 'లోకా' బ్లాక్‌బస్టర్ తర్వాత వే ఫారర్ ఫిల్మ్స్ నుంచి వస్తున్న తదుపరి భారీ ప్రాజెక్ట్ ఇదే. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్, సెకండ్ లుక్ పోస్టర్లు సోషల్ మీడియాలో అద్భుతమైన స్పందన తెచ్చుకున్నాయి. ఇదే దుల్కర్ సల్మాన్ కెరీర్‌లో 40వ చిత్రం కావడం విశేషం.

ఇప్పటివరకు మలయాళ ప్రేక్షకులు చూడని స్టైల్‌లో థ్రిల్లింగ్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను ఈ సినిమా అందించబోతోంది. దుల్కర్ సల్మాన్‌తో పాటు ఆంటోని వర్గీస్, తమిళ నటుడు-దర్శకుడు మిస్కిన్, కయాదు లోహర్, కతిర్, పార్థ్ తివారి, తమిళ నటి సంయుక్త విశ్వనాథన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జేక్స్ బీజోయ్ సంగీతం అందిస్తుండగా, యాక్షన్ సీక్వెన్స్‌లను అన్బరివ్ డిజైన్ చేస్తున్నారు. 'ఆర్డీఎక్స్' బ్లాక్‌బస్టర్ తర్వాత నహాస్ హిదాయత్ తెరకెక్కిస్తున్న చిత్రం ఇదే.

మలయాళంతో పాటు తెలుగు, తమిళ, హిందీ, కన్నడ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో 'ఐ యామ్ గేమ్' విడుదల కానుంది.

# చిరు158 మూవీ పవన్ కళ్యాణ్, నాగబాబు సమక్షంలో ఘనంగా జరిగిన ప్రారంభోత్సవం




మెగాస్టార్ చిరంజీవి, సక్సెస్ ఫుల్ డైరెక్టర్ బాబీ కొల్లి క్రేజీ కాంబినేషన్ లో వచ్చిన 'వాల్తేర్ వీరయ్య' సంచలనాత్మక మాస్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఇప్పుడు ఈ ద్వయం మరో భారీ ప్రాజెక్ట్ - చచిరుబాబీ2 / చచిరు158 తో అలరించబోతున్నారు. ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మాత వెంకట్ కె నారాయణ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. కన్నడ, తమిళ, హిందీ భాషల్లో పలు భారీ ప్రాజెక్టులను అందించిన తర్వాత, కేవీఎన్ ప్రొడక్షన్స్ వారి తొలి తెలుగు చిత్రం ఇది.

ఇప్పటికే వరుస అప్డేట్స్‌తో భారీ అంచనాలు సృష్టించిన ఈ చిత్రం నేడు ఘనంగా పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, నాగబాబు ముఖ్య అతిథులుగా విచ్చేసి ఈ కార్యక్రమం మరింత వైభవంగా మారింది. ఈ మెగా త్రయం వేదికను పంచుకోవడం అభిమానులకు కనులవిందు చేసింది. పవన్ కళ్యాణ్ క్లాప్‌బోర్డ్ కొట్టగా, సుష్మిత కొణిదెల కెమెరా స్విచ్ ఆన్ చేశారు. వి.వి. వినాయక్ ఫస్ట్ షాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు. బి. గోపాల్, కోదండరామి రెడ్డి, నాగబాబు చిత్ర బృందానికి స్క్రిప్ట్‌ను అందజేశారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖ దర్శకులు, నిర్మాతలు హాజరయ్యారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ నుంచి లోహిత్ తన బృందంతో కలిసి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

మాస్ ప్రేక్షకుల అభిరుచిని బాగా అర్థం చేసుకున్న దర్శకుడు బాబీ కొల్లి ఈసారి మరింత భారీ కథను సిద్ధం చేశారు. మ్యాసీవ్ స్కేల్, ఇంటెన్సిటీ తో నిండిన ఈ కథలో చిరంజీవి తన కెరీర్‌లోనే అత్యంత పవర్‌ఫుల్ పాత్రల్లో కనిపించనున్నారు. ఇటీవల విడుదలైన ఆయన జిమ్ ట్రాన్స్‌ఫర్మేషన్ వీడియో ఈ సినిమా కోసం ఆయన ఎంత అంకితభావంతో సిద్ధమవుతున్నారో స్పష్టం చేసింది.

ఈ చిత్రంలో మలయాళ నటి అనస్వర రాజన్ కీలక పాత్రలో నటించనున్నారు.

చఅప్త్రతీతీబీఃనీఎఎఎ2 కోసం టాప్ టెక్నికల్ టీమ్ పని చేస్తోంది. సంగీత సంచలనం ఎస్. థమన్ సంగీతం అందిస్తుండగా, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ విజయ్ కార్తిక్ కన్నన్ విజువల్స్‌ను అద్భుతంగా ఆవిష్కరించనున్నారు. ప్రొడక్షన్ డిజైనర్‌గా అవినాశ్ కొల్లా, ఎడిటర్‌గా ఆంటోని రూబెన్ పని చేస్తున్నారు. కోన వెంకట్, కె. చక్రవర్తి రెడ్డి స్క్రీన్‌ప్లే అందించగా, హరి మోహన కృష్ణ, వినీత్ పొట్లూరి ఎడిషనల్ స్క్రీన్‌ప్లే రైటర్లుగా పనిచేస్తున్నారు. హిలేరియస్ రైటింగ్ తో పొందిన భాను-నందు ద్వయం ఈ చిత్రానికి డైలాగ్స్ రాస్తున్నారు.

ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ రేపటి నుంచి హైదరాబాద్‌లో ప్రారంభం కానుంది.

# కేంద్ర ప్రభుత్వం పెంచుతున్నపెట్రోల్, డీజిల్ ధరలతో సామాన్యుడి నడ్డి విరుగుతుంది.. సత్యం శ్రీరంగం

## కార్పోరేట్ శక్తులకు కోట్ల రూపాయల ప్రజాధనం ధారాదత్తం చేస్తూ ప్రజలపై భారం మోపుతున్న మోడీ..




కూకట్పల్లి (ప్రజాబలం )మే 21 : ఎన్నికలు ముగిసిన వెంటనే కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ డీజిల్ ధరలు పెంచి సామాన్య ప్రజలపై భారం మోపిందని కేంద్ర ప్రభుత్వ వైఖరిపై గాంధీ భవన్ లో పత్రిక సమావేశంలో విమర్శించిన టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం. యూపీఏ హయాంలో అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు ఎక్కువగా ఉన్నప్పటికీ ప్రజలపై భారాలు వేయలేదని గుర్తుచేశారు. ముడి చమురు ధరలు తగ్గిన కేంద్రం ఎక్సైజ్, సుంకాలు సెస్సుల పేరుతో ప్రజలను దోచుకుంటోందన్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోడీ ' డబులింజన్ సర్కార్ ఉన్న రాష్ట్రాలలో పాలన అద్భుతం, అమోఘం యావత్ దేశ అభివృద్ధి వికసిత్ భారత్ వైపు దూసు కెళ్తుంది. రాష్ట్రాల పాలనలో అన్ని రంగాల్లో ఆర్థిక వ్యవస్థ ధ్వంసమైందని ' ఊదరగొట్టిన ప్రసంగాలకు, మీడియా కల్పిం చిన విస్తృత ప్రచారం చూసి ప్రజలు నిజంగానే నమ్మారని పిస్తోంది. ఆయా రాష్ట్రాలలో అన్ని వ్యవస్థలు ధ్వంసమయ్యాయని బీజేపీ పాలిత రాష్ట్రాలలో, కేంద్రంలో అన్ని రంగాల్లో పరుగులు పెడుతూ ఆర్థిక వ్యవస్థ స్వర్ణయగంలో నడుస్తుందని మోడీ భజనపరులు కీర్తిస్తున్నారు అని అన్నారు. ఇదంతా చూసి ప్రజలు ఓట్లను వేసి గెలిపిస్తే వారం తిరగకముందే దేశమం తటా తిరుగుతూ దేశం క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్నది ప్రజలు దేశ భక్తిని చాటుకోవాలంటూ ఉచిత పొదుపు సూత్రాలను వల్లెవేస్తూ, ప్రజలు దుబారా ఖర్చును తగ్గించుకోవాలని కర్తవ్య బోధన చేసారని అని అన్నారు. దేశ ఆర్థిక క్లిష్ట పరిస్థితుల నుంచి గట్టెక్కించే తన కర్తవ్యాన్ని, తన దుబారా ఖర్చులను తగ్గించుకోవడం మర్చిపోయి ఈ ఆర్థిక సంక్షోభ భారాన్ని దేశభక్తితో సామాన్య ప్రజలు భరించాలని చేతులు దులుపుకోవడం తన పన్నెండేండ్ల పాలన పతనావస్థ స్థితికి చేరిందని చెప్పున్నట్లే. ఇప్పటికే రూపాయి విలువ రికార్డు స్థాయిలో డాలర్ రూ. 96.90 వారం నుంచి బ్రేక్ లేకుండా పడుతున్న రూపాయి దిగజారి వందకు చేరువలో పతనా స్థితికి వెళ్తుంది. డాలర్ తో పోటీపడి ప్రపంచ ఆర్థిక రంగంలో అగ్రగామి దేశంగా ఎలా నిలుస్తుంది 500 ట్రిలియన్ డాలర్లకు ఎప్పుడు చేరువ వుతుంది మనది అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అంటూ విదేశాల్లో మోదీ గప్పాలు కొడుతూ తన అసమర్థతను ప్రజలపై రుద్దుతున్నారు విమర్శించారు.

# ప్రజలకు చేరువగా ప్రభుత్వం--99 రోజుల ప్రగతి కార్యక్రమం అభివృద్ధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి




**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం మే 21:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈనెల 22వ తేదీన శామీర్ పేట్ మండలంలోని అంతాయిపల్లిలో గల ఎస్ ఎన్ ఆర్ వేద్ కన్వేన్షన్ హాల్లో జిల్లా స్థాయి కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లా స్థాయి కార్యక్రమానికి జిల్లా ఇంఛార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్, ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి, మేడ్చల్ శాసనసభ్యులు మల్లారెడ్డి, ఖుత్బుల్లాపూర్ శాసనసభ్యులు వివేకానంద, మల్కాజ్గిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి, కూకట్పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు, జిల్లా కలెక్టర్ మను చౌదరి, మల్కాజిగిరి మున్సిపల్ కమీషనర్ వినయ్ కృష్ణారెడ్డి ×ూూ, అడిషనల్ కలెక్టర్లు, జోనల్ కమిషనర్లు, మున్సిపల్ చైర్ పర్సన్స్, జిల్లా మార్కెటింగ్, గ్రంధాలయ కమిటీల చైర్మన్ లు, ఆర్టిఐ కమిటి సభ్యులు వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొంటారని వివరించారు.

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈనెల 22వ తేదీన జిల్లా స్థాయి కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై పూర్తిస్థాయిలో ప్రజలకు అవగాహన, పరిపాలనలో ప్రజల భాస్వామ్యాన్ని ప్రొత్సహించడం, జిల్లా స్థాయి సమస్యలు మరియు అభివృద్ధి ప్రాధాన్యతలను గుర్తించడం, ఇప్పటి వరకు నిర్వహించిన థిమాటిక్ వారాల విజయాల ప్రదర్శన వంటి కార్యక్రమాలే కాకుండా భవిష్యత్తులో రాబోయే పథకాల గురించి అవగాహన కల్పించడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు వివిధ శాఖల విజయాలను ప్రజల ముందుంచడం, వార్డు స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయం చేయడం ప్రధాన లక్ష్యంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరడమైనది.

# భారతరత్న దివంగత మాజీ ప్రధాన మంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ సేవలు మరువలేనివి.

## అయన చిత్ర పఠనికి పూలమాల వేసి నివాళ్లు అర్పించిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మైల జయరామ్ రెడ్డి.



గురువారం రోజున రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి ౘ స్త్రీ శిశు సంక్షేమ శాఖ మాత్యులు గౌరవనీయులు శ్రీమతి ధనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు,

ఈరోజు మంగపేట మండల కేంద్రం లోని వైస్సార్ విగ్రహం వద్ద మంగపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మైల జయరామ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన భారత రత్న మాజీ ప్రధాన మంత్రి స్వర్గీయ శ్రీ రాజీవ్ గాంధీ గారి వర్ధంతి కార్యక్రమం ను మండల కేంద్రం లో ఘనంగా నిర్వహించారు

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య హాజరై మాట్లాడుతూ..

ఈ భారత దేశానికి గాంధీ కుటుంబం చేసిన సేవ, త్యాగం వెలకట్టలేనిది రాజీవ్ గాంధీ 1944 ఆగస్టు 20 వ తారీకు న ముంబాయ్ లో జన్మించారు వారు 1981 లో రాజకీయ రంగ ప్రవేశం చేశారు తల్లి ఇందిరా గాంధీ 1984 లో హత్య కు గురి కాగా అనంతరం వచ్చిన ఎన్నికల్లో రాజీవ్ గాంధీ ఆధ్వర్యంలో భారీ విజయం సాధించి అత్యంత పిన్న వయసులో భారత దేశ ప్రధాన మంత్రి అయ్యి చరిత్ర రాశారు అదేవిధంగా అయన పరిపాలన లో ఎన్ని చారిత్రాత్మక మైన నిర్ణయాలు తీసుకొని అయన పాలనా లో ట్రెండ్ సృటించారు,యువత ఓటింగ్ వయోపరిమితి 21 సంవత్సరశీ నుండి 18 సంవత్సరకు తగ్గించి లక్షలాది యువత కు ఓటు హక్కును కల్పించారు,నవోదయ జవహర్ విశ్వ విద్యాలయం లు స్థాపించారు,గ్రామ స్థాయి నుండీ పంచాయతీరాజ్ వ్యవస్థ ను బలోపేతానికి కృషి చేసిన ఘనత రాజీవ్ గాంధీ అని కొనియాడారు

# సయ్యద్ నస్రిన్ వివాహానికి ఆర్థిక సాయం చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



**ఏటూర్ నాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి మే 21 2026 మంగపేట** మంత్రి సీతక్క గారి ఆదేశాల మేరకు గురువారం మంగపేట మండలం పొదుమూర్ గ్రామంలో సయ్యద్ ముస్తఫా ( లేటు) సయ్యద్ హసీనా (లేటు) తల్లితండ్రులు కోల్పోయిన అమ్మాయి సయ్యద్ నస్రిన్ వివాహానికి 10000 రూపాయలు ఆర్థిక సాయం చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చెట్టుపల్లి వెంకటేశ్వర్లు. మంగపేట గ్రామ పార్టీ అధ్యక్షులు సయ్యద్ హుస్సేన్,మైనారిటీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు మైబూబ్ఖాన్ . ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చింత పున్నారావు. జిల్లా కార్యదర్శి తుడి భగవాన్ రెడ్డి. మాజీ జెడ్పీటీసీలు సిద్ధం శెట్టి వైకుంఠం. ఆక రాధాకృష్ణ. మంగపేట మాజీ ఎంపీటీసీ మండవ రాధాకృష్ణ. మంగపేట మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు చాద మల్లన్న. మంగపేట మైనార్టీ సెల్ అధ్యక్షులు టీవీ హీదయతుల్లా. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు కొమరగిరి సామ్రాజ్యం. మంగపేట యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బాడిషా ఆదినారాయణ. మంగపేట యూత్ కాంగ్రెస్ గౌర అధ్యక్షులు కస్ప ముకుంద. మంగపేట యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నూతిల కంటి రాజు. జిల్లా యూత్ నాయకులు కబ్బాక లక్ష్మణ్. మత్స్య పారిశ్రామిక జిల్లా ప్రధాన కార్యదర్శి కాంగ్రెస్ పార్టీ బట్ట రామారావు. మండల సోషల్ మీడియా ఇంచార్జ్ భూక్య కుమార్. బోర్ నర్సాపూర్ యూత్ కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షులు జోగా రామచంద్రం, డాక్టర్ శ్రీనివాస్. తోట తిరుపతిమండల నాయకులు గ్రామ నాయకులు మహిళా నాయకులు పాల్గొన్నారు

# రెండు బైకులు ఢీ, ఒకరు మృతి



**జహీరాబాద్, మే 21 ప్రజాబలం ప్రతినిధి:** కోహీర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడిన సంఘటన చోటుచేసుకుంది. కోహీర్ ఎస్సై నరేష్ కుమార్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం మధ్యాహ్నం రెండున్నర గంటల సమయంలో కొత్తూరు కె గ్రామానికి చెందిన గొల్ల రాజు అనే వ్యక్తి కోహీర్ బిలాల్పూర్ రోడ్డులో బైకుపై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న బుల్లెట్ బైక్ అతివేగంగా అజాగ్రత్తగా వచ్చి ఢీకొట్టడంతో గొల్ల రాజు తీవ్ర గాయాల పాలై ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వెల్లడించారు. బుల్లెట్ బైక్ పై ఉన్న వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. ఘటన స్థలాన్ని పరిశీలించి మృతుని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# ఫ్యూచర్ సిటీ డిజైన్స్‌పై సీఎం రేవంత్ రెడ్డి సూచనలివే

హైదరాబాద్ పరిశ్రమల శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్‌సీహెచ్ఆర్‌డీలో సమీక్ష నిర్వహించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ల్యాండ్ అలాట్మెంట్, పరిశ్రమల ఏర్పాటుపై చర్చించారు. నెట్ జీరో సిటీ తరహాలోనే ఫ్యూచర్ సిటీ డిజైన్స్ ఉండాలని సీఎం తెలిపారు. మౌలిక వసతుల కల్పన అంతర్జాతీయ స్థాయిలో ఉండాలని..ఇందులో రాజీపడొద్దని స్పష్టం చేశారు. అంతర్జాతీయ స్థాయి నగరాలను అధ్యయనం చేయాలని ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చేసిన తర్వాతే భూ కేటాయింపులు చేయాలని సూచించారు. అంతర్జాతీయ స్థాయి సంస్థలను ఫ్యూచర్ సిటీకి తీసుకురావాలని సీఎం అన్నారు. ఫ్యూచర్ సిటీలో ప్రజాప్రతినిధులు,సివిల్ సర్వీస్ అధికారులు, జర్నలిస్టులకు 500 ఎకరాలు కేటాయించాలని సీఎం తెలిపారు. కేంద్రం ప్రకటించిన హెల్త్ క్లస్టర్‌ను ఫ్యూచర్ సిటీకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే ప్రధాని మోదీని కలిసి హెల్త్ క్లస్టర్ కేటాయించాలని విజ్ఞప్తి చేద్దామని ముఖ్యమంత్రి అన్నారు. జూన్‌లో ఫ్యూచర్ సిటీ ఇండస్ట్రియల్ పార్క్‌లో పరిశ్రమల ఏర్పాటుకు శంకుస్థాపన జరిగేలా చూడాలన్నారు. భూ కేటాయింపు జరిగిన వెంటనే పరిశ్రమలు నిర్మాణం మొదలు పెట్టేలా నిబంధన విధించాలని తెలిపారు. ఇన్వెస్ట్ తెలంగాణ పేరుతో పెట్టుబడుల ఆకర్షణకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇన్వెస్ట్ తెలంగాణ కోసం ఆకర్షణీయమైన లోగో, వెబ్‌సైట్ రూపొందించాలని వెల్లడించారు. ఇన్వెస్ట్ తెలంగాణ కోసం ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేయాలన్నారు.రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే వారి కోసం ఎస్కార్ట్ ఆఫీసర్ వ్యవస్థను రూపొందించాలని సీఎం ఆదేశించారు. గ్రూప్ 1 స్థాయి అధికారిని ఎస్కార్ట్ ఆఫీసర్‌గా నియమించే అంశాన్ని పరిశీలించాలని తెలిపారు. తమిళనాడు, గుజరాత్ పారిశ్రామిక విధానాన్ని అధ్యయనం చేయాలన్నారు. బుల్లెట్ ట్రైన్ కోసం భూ సేకరణ ప్రారంభించాలని ఆదేశించారు. 1500 ఎకరాల్లో డేటాసిటీ ఏర్పాటు చేయాలని..డేటా సిటీ నీటి అవసరాల కోసం ఎస్‌టీపీలను వినియోగించాలని సూచనలు చేశారు. జీసీసీలు, డేటా సెంటర్లు కోసం కరీంనగర్, వరంగల్, విజయవాడ రోడ్ల సమీపంలో ఉన్న ప్రభుత్వ భూములు గుర్తించాలని ఆదేశించారు.ద్వితీయ శ్రేణి నగరాలల్లో జీసీసీ ఏర్పాటు పైనా దృష్టి పెట్టేలా పాలసీ రూపకల్పన చేయాలన్నారు. మూడు నెలల్లో ప్రభుత్వ కార్యాలయాలు..టీ ఫైబర్‌కు కనెక్ట్ కావాల్సిందే అని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశానికి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ శశాంక, పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# క్రీడలతో ఆరోగ్యం -- పర్యాటకంతో అభివృద్ధి

## ఐ.విజయ కుమారి
## జిల్లా యువజన మరియు క్రీడల అధికారి,
## జిల్లా పర్యాటకం అధికారి

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం మే 21:**తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక (99 రోజుల యాక్షన్ ప్లాన్ ) ప్రోగ్రామ్స్ నిర్వహించబడుతుంది. ఈ వారము ( 18 మే నుండి 23 మే 2026 వరకు ) యువజన మరియు క్రీడల శాఖ అలాగే పర్యాటకం శాఖ వారం కూడా నిర్వహించడం జరుగుతుంది అని జిల్లా యువజన మరియు క్రీడల అధికారి ఓ జిల్లా పర్యాటకం అధికారి (ఇంచార్జ్) శ్రీమతి ఐ. విజయ కుమారి గారు ఒక ప్రకటన తెలిపారు.



నాల్గవ రోజు యువజన మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ లెవెల్ సమ్మర్ క్యాంప్ వాలీబాల్ అండ్ కబడి టోర్నమెంట్ జడ్.పి.హెచ్.ఎస్ నాగోల్ స్కూల్ నందు నిర్వహించడం అయినది సుమారు 200 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనడం జరిగింది. అలాగే ఈ పోటీలలో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేయడం జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, ఎంఈఓ, స్కూల్ హెచ్ఎం, మరియు ఈ కార్యక్రమానికి స్పాన్సర్ శ్రీ కోలన్ చంద్రశేఖర్ ఆజాద్, కొలను ప్రభాకర్, ఓల్డ్ స్కూల్ అసోసియేషన్, SGF secretary, PET/ PDs మరియు సిబ్బంది పాల్గొనడం జరిగింది.

అలాగే పర్యాటక శాఖ ఆధ్వర్యంలో యూట్యూబ్లో మరియు సోషల్ మీడియా విజువల్ క్రియేటర్స్తో మీటింగ్ నిర్వహించడం జరిగింది.

# ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో కిడ్నీ రోగులకు మెరుగైన డయాలసిస్ ఆరోగ్య సేవలు ...

### ఒక సం.లో 10 మిషన్ల ద్వారా వివిధ రోగులకు 7306 సార్లు డయాలసిస్ సేవలు...

### మెడికల్ సూపర్డెంట్ డాక్టర్ టి.ఉషారాణి.



**నాగర్ కర్నూల్ జిల్లా (ప్రజా బలం ప్రతినిధి)** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో అపెక్స్ కిడ్నీ కేర్ సంస్థ ద్వారా కిడ్నీ రోగులకు తప్పనిసరైన డయాలసిస్ సేవలు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా మెరుగ్గా అందుతున్నట్లు సూపర్డెంట్ డాక్టర్ టి. ఉషారాణి తెలిపారు.

నాగర్ కర్నూల్ లో 2018 ఫిబ్రవరి నెలలో కిడ్నీ రోగులకు డయాలసిస్ ఆరోగ్య సేవలు ప్రారంభమైనట్లు ఆమె తెలిపారు.ప్రస్తుతము 10 మిషన్ తో కూడిన బెడ్లు అందుబాటులో ఉన్నాయని, అందులో 9 నెగటివ్ ఉన్నవారికి, ఒక మిషన్ తో కూడిన బెడ్ హెపటైటిస్-సి,హెపటైటిస్ బి పాజిటివ్ ఉన్నవారికి డయాలసిస్ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ డయాలసిస్ సేవలు ఆసుపత్రిలో గది నెంబర్ 44 లో ఉదయం 6 గంటల నుండి ప్రారంభమై రాత్రి 8 గంటల వరకు నిర్వహిస్తారని తెలిపారు. ఒక్కొక్క కిడ్నీ రోగి అవసరమైన వారానికి రెండు లేదా మూడుసార్లు తప్పక డయాలసిస్ చేస్తున్నట్లు తెలిపారు. కిడ్నీ రోజులకు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా డయాలసిస్ అందడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా పెన్షన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతిరోజు 25 నుండి 30 మంది వరకు డయాలసిస్ సేవలు చేస్తున్నట్లు తెలిపారు. ఒకరికి డయాలసిస్ చేయుటకు కనీసం నాలుగు గంటల సమయం పడుతుందని అన్నారు. అధిక ఒత్తిడి, షుగర్ వ్యాధులు నియంత్రణలో ఉంచుకోవాలని ఆమె సూచించారు. డయాలసిస్ రోగులు ఉప్పుతోపాటు నీటిని తాగడం నియంత్రణలో ఉండాలని సూచించారు. వీరికి మెరుగైన ఆరోగ్య సేవలు అందించుటకు నెఫ్రాలజిస్ట్ ప్రొఫెసర్ డాక్టర్ షబానా అందుబాటులో ఉన్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో నెఫ్రాలజిస్ట్ డాక్టర్ షబానా,సహాయ సంచాలకులు సీజే వసంత్ కుమార్,ఆర్.ఎం. ఓ.లు డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ రవి శంకర్,నర్సింగ్ సూపర్డెంట్ మంజుల, నర్సింగ్ అధికారి ఎం.ఆనంద్,డయాలసిస్ కేంద్ర ఇన్చార్జ్ వినోద్,సిబ్బంది శ్రీశైలం,కృష్ణ,శ్రీకాంత్, విద్య, శిరీష,సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

# పార్కిన్సన్స్ నియంత్రణలో డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్ కీలక చికిత్స

### మెడికవర్ వైద్యులు

సికింద్రాబాద్, 21 మే , 2026: భారతదేశంలో వేగంగా పెరుగుతున్న న్యూరోలాజికల్ వ్యాధుల్లో పార్కిన్సన్స్ వ్యాధి (ఖజీతీఎతినిబనీని'బ ఆతిబవజీబవ) ఒకటిగా మారుతోందని మెడికవర్ హాస్పిటల్స్, సికింద్రాబాద్ న్యూరో సైన్సెస్ నిపుణులు తెలిపారు. ముఖ్యంగా 60 సంవత్సరాల పైబడిన వారిలో ఈ వ్యాధి అధికంగా కనిపిస్తోందని, ఆలస్యంగా గుర్తించడం వల్ల రోగులు క్రమంగా స్వతంత్ర జీవనాన్ని కోల్పోతున్నారని వైద్యులు హెచ్చరించారు.మెదడులో డోపమైన్ ఉత్పత్తి చేసే కణాలు క్రమంగా దెబ్బతినడం వల్ల ఈ వ్యాధి వస్తుందని నిపుణులు వివరించారు. చేతులు వణకడం, కాళ్లు గట్టిపడటం, నడకలో అస్థిరత, శరీర కదలికలు మందగించడం, తరచూ పడిపోవడం, మాట్లాడడంలో మరియు రోజువారీ పనుల్లో ఇబ్బందులు వంటి లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. వ్యాధి ముదిరే కొద్దీ రోగులు పూర్తిగా ఇతరులపై ఆధారపడే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు.ప్రారంభ దశల్లో మందులతో లక్షణాలను నియంత్రించవచ్చని, అయితే అడ్వాన్స్డ్ దశలో డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్ (ఆఖా) వంటి ఆధునిక చికిత్సలు రోగులకు గణనీయమైన ఉపశమనాన్ని అందిస్తాయని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా ఉపయోగిస్తున్న ఈ చికిత్సలో మెదడులోని ప్రత్యేక భాగాల్లో ఎలక్ట్రోడ్స్ అమర్చి కదలికలను నియంత్రించే విధంగా పనిచేస్తుందని వివరించారు.ఈ సందర్భంగా మెడికవర్ హాస్పిటల్స్ న్యూరో సర్జన్ డాక్టర్ శ్రీనివాస్ దూసా మాట్లాడుతూ,"డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్ పార్కిన్సన్స్కు పూర్తి నివారణ కాకపోయినా, సరైన రోగుల్లో వణుకు, కండరాల గట్టితనం, కదలికల సమస్యలను గణనీయంగా తగ్గిస్తుంది. దీని వల్ల రోగులు మళ్లీ సాధారణ జీవితానికి చేరుకునే అవకాశం ఉంటుంది" అని తెలిపారు.ఇటీవల ఖమ్మం జిల్లా కి చెందిన 63 ఏళ్ల శ్రీ రాకేష్కు మెడికవర్ హాస్పిటల్స్లో విజయవంతంగా డీబీఎస్ శస్త్రచికిత్స నిర్వహించినట్లు వైద్యులు వెల్లడించారు. శస్త్రచికిత్స అనంతరం ఆయన కదలికలు, నడక మరియు శారీరక స్థిరత్వంలో స్పష్టమైన మెరుగుదల కనిపించిందని తెలిపారు.ఈ క్లిష్టమైన చికిత్సను డాక్టర్ శ్రీనివాస్ దూసా, డాక్టర్ రమేష్ శిఖాకొల్లి, డాక్టర్ రోహిత్ రమేష్, డాక్టర్ వికాస్ అగర్వాల్, డాక్టర్ సుధీర్లతో కూడిన మల్టీడిసిప్లినరీ న్యూరో సైన్సెస్ బృందం విజయవంతంగా నిర్వహించింది. న్యూరో అనస్థీషియా, ఫిజియోథెరపీ, రిహాబిలిటేషన్, క్రిటికల్ కేర్ మరియు నర్సింగ్ బృందాలు కూడా కీలక పాత్ర పోషించాయి.పార్కిన్సన్స్ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించడం, క్రమం తప్పకుండా వైద్య పర్యవేక్షణలో ఉండటం, ఫిజియోథెరపీ మరియు ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించడం ద్వారా రోగులు ఎక్కువకాలం చురుకుగా జీవించవచ్చని మెడికవర్ నిపుణులు సూచించారు.

# శిక్షణ వినియోగించుకొని.. ఆర్థికంగా ఎదగాలి

### . ఆర్ సెటీ శిక్షణ కోర్సులతో యువతకు మేలు
### . జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
### . రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఆర్ సెటీ శిక్షణా కేంద్రం ప్రారంభం

**రాజన్న సిరిసిల్ల జిల్లా, మే -21 (ప్రజా బలం ప్రతినిధి)**ఉచిత శిక్షణను యువతీ యువకులు వినియోగించు కోవాలని, ఆర్థికంగా ఎదగాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు. కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ, బ్యాంకుల సహకారంతో ఆర్ సెటీ (రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్) ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని నెహ్రూ నగర్ శిక్షణా కేంద్రంలో జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ గురువారం ప్రారంభించారు.శిక్షణ ఇచ్చే, ట్రైనింగ్, వసతి గదులను ప్రారంభించి.. పరిశీలించారు. ఈ సందర్భంగా మగ్గం వర్క్ కింద శిక్షణ పొంది పలువురు అభ్యర్థులు సిద్ధం చేసిన వస్త్రాలను పరిశీలించి.. వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోజూ ఎన్ని గంటలు శిక్షణ పొందుతున్నారో ఆరా తీశారు. మగ్గం వర్క్ తర్ఫీదు పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి మార్చి 6వ తేదీన ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. ఇందులో భాగంగా జూన్ 12వ తేదీ వరకు 10 శాఖల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 23వ తేదీ వరకు నిర్వహించనున్న యువజన క్రీడా వారోత్సవాలు కొనసాగుతున్నాయని వెల్లడించారు.గతంలో ఉమ్మడి జిల్లా కేంద్రంలోనే ఆర్ సెటీ కేంద్రాలు ఉండేవని, ఇప్పుడు మన జిల్లాలో కూడా అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. జిల్లాలోని యువతీ యువకులు ఇక్కడ అందించే ఉచిత వసతి, భోజనం, శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. శిక్షణలో భాగంగా అందించే ప్రతి మెలకువను ఎంతో శ్రద్ధ, ఆసక్తితో నేర్చుకొని.. స్వయం ఉపాధిలో ఆ అంశాలు వినియోగించాలని సూచించారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తూ.. ఆర్థిక స్వాతంత్రం సాధించాలని ఆకాంక్షించారు. మరో పది మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని పిలుపు నిచ్చారు. మార్కెట్, పరిశ్రమల అవసరాలు, అభ్యర్థుల డిమాండ్ కు అనుగుణంగా నూతన కోర్సులు ప్రారంభించాలని, ఏడాది అంతా శిక్షణ అందించాలని నిర్వాహకులకు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు.కార్యక్రమంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, యూబీఐ డీజీఎం నటరాజ్, ఏజీఎం శ్రీనివాసరావు, ఎల్ డీ ఎం మల్లికార్జున రావు, శిక్షణ కేంద్రం బాధ్యులు, బ్యాంక్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.








# మే 22న శ్రీ గోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

తిరుపతి, 2026 మే 21 తిరుపతి లోని శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో మే 23 నుండి 31వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు జరగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు మే 22న శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించనున్నారు. సాయంత్రం 5.30 నుండి 8 గంటల మధ్య ఈ కార్యక్రమం వైభవంగా జరగనుంది.ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి తోమాల, సహస్రనామార్చన సేవలు నిర్వహిస్తారు. అనంతరం సాయంత్రం సేనాధిపతి ఉత్సవం, గంగుంద్ర మండపంలో ఆస్థానం, యాగశాలలో శాస్త్రోక్త అంకురార్పణ కార్యక్రమాలు జరుగుతాయి.

ఆలయ ప్రాశస్త్యం

కలియుగ వైకుంఠమైన తిరుపతిలో వెలసిన శ్రీ గోవిందరాజ స్వామివారి ఆలయం భక్తి, చరిత్ర, శిల్పకళ, ఆగమ సంప్రదాయాల సమ్మేళనంగా యుగయుగాలుగా భక్తులను ఆధ్యాత్మిక మార్గంలో నడిపిస్తోంది. ఈ దివ్యక్షేత్రాన్ని దర్శించుకున్న భక్తులకు రుణ విమోచనం, మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మికఆనందం కలుగుతాయని స్థల పురాణం పేర్కొంటోంది.స్వామివారి దివ్య మంగళ విగ్రహం భక్తుల హృదయాలలో విశ్వాసాన్ని నింపుతూ, జీవన సాఫల్యానికి మార్గదర్శకంగా నిలుస్తోంది.

స్థల పురాణ వైభవం

పురాణాల ప్రకారం, శ్రీ మహావిష్ణువు భూలోకంలో శ్రీనివాసుడిగా అవతరించి తిరుమలలో నివసించే సమయంలో వివాహ మహోత్సవం నిమిత్తం కుబేరుని వద్ద నుండి ధనం అప్పుగా తీసుకున్నారని విశ్వసిస్తారు. ఆ ధనాన్ని కొలిచే బాధ్యతను శ్రీనివాసుడి అన్నయ్య అయిన శ్రీ గోవిందరాజ స్వామివారికి అప్పగించారని స్థల పురాణం తెలియజేస్తోంది. ధనాన్ని కొలుస్తూ అలసిన స్వామివారు ఆదిశేషునిపై శయనించిన దివ్య రూపమే నేటి శ్రీ గోవిందరాజ స్వామివారి దర్శనమని భక్తుల విశ్వాసం.

గర్భాలయంలో దివ్య దర్శనం

ఆదిశేషునిపై శయనిస్తున్న స్వామివారు గర్భాలయంలో దివ్య కాంతులతో దర్శనమిస్తూ భక్తుల హృదయాలకు ప్రశాంతతను ప్రసాదిస్తు న్నారు. స్వామివారి నాభి నుండి బ్రహ్మదేవుడు ఉద్భవించినట్లు, పాదాల వద్ద శ్రీదేవి, భూదేవి అమ్మవార్లు, మోక్షం కోసం తపస్సు చేస్తున్న మధు?కైటభ రాక్షసులు కొలువై ఉన్న దృశ్యం భక్తులను భక్తి పారవశ్యంలో ముంచెత్తుతోంది.

దర్శనం

? నిత్య సేవలుప్రతిరోజూ ఉదయం 5 గంటలకు సుప్రభాతంతో స్వామివారి సేవలు ప్రారంభమవుతాయి. ఉదయం 5.30 గంటలకు విశ్వరూప దర్శనం, 6.30 గంటలకు తోమాల సేవ, 7.30 గంటలకు అర్చన, 8 గంటలకు అర్చనానంతర దర్శనం నిర్వహిస్తారు. రాత్రి 8.30 గంటలకు ఏకాంత సేవతో నిత్య కార్యక్రమాలు ముగుస్తాయి. ఈ సేవల్లో పాల్గొనే భక్తులు అపార ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందుతున్నారు.

భక్తులకు ఉచిత అన్నప్రసాదాలు

శ్రీ గోవిందరాజ స్వామివారిని దర్శించుకునే భక్తులకు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు చక్కెర పొంగలి, అన్నం, సాంబారు, రసం, కర్రీ, చట్నీ, మజ్జిగతో రుచికరమైన భోజనం వడ్డిస్తున్నారు. అదేవిధంగా, ఆలయం సమీపంలోని పాత మ్యూజియంలో ప్రతిరోజూ ఉచిత అన్నప్రసాదాలను అందిస్తున్నారు. 2026 ఫిబ్రవరి నెల నుండి సాయంత్రం 6.30 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు సాంబారు అన్నం, పెరుగు అన్నం కూడా పంపిణీ చేస్తున్నారు.

రాజగోపుర శిల్ప వైభవం

ఆలయంలోకి ప్రవేశించగానే దర్శనమిచ్చే ఏడు అంతస్తుల మహారాజగోపురం విజయనగర శిల్పకళా వైభవానికి ప్రతీకగా నిలుస్తోంది. స్థానిక పాలకుడు మట్ల అనంతరాజు నిర్మించిన ఈ గోపురం ద్రావిడ, విజయనగర నిర్మాణ శైలుల సమ్మేళనంగా శతాబ్దాలుగా భక్తులను ఆకట్టుకుంటోంది.మూడు అంతస్తులతో నిర్మించిన పడి కావిలి గోపురం, మహాద్వార గోపురం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుండగా, విమాన గోపురం బంగారు తాపడంతో దివ్య కాంతులను విరజిమ్ముతోంది.

బంగారు తాపడం

? మహాసంప్రోక్షణఆలయంలో 70 సంవత్సరాల క్రితం ప్రతిష్టించిన పాత ధ్వజస్తంభం స్థానంలో 2018 ఏప్రిల్ 7న నూతన ధ్వజస్తంభాన్ని ప్రతిష్టించారు. అనంతరం 2018 ఏప్రిల్ 12న వైఖానస ఆగమోక్తంగా మహాసంప్రోక్షణ నిర్వహించారు.ఆలయ విమాన గోపురానికి 100 కిలోల బంగారంతో తాపడం పనులను 2021 సెప్టెంబర్ 14న ప్రారంభించి, 2023 మే 25న బంగారు తాపడం విమాన గోపుర మహాసంప్రోక్షణను అత్యంత వైభవంగా నిర్వహించారు.క్షేత్ర వైభవంఈ మహాక్షేత్రంలో శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి స్థానక రూపంలో, శ్రీ పార్థసారథి స్వామివారు ఆసీన రూపంలో, శ్రీ గోవిందరాజ స్వామివారు శయన రూపంలో దర్శనమిస్తారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449 Email;prajaabalamnews@gmail.com